సాహిత్య

# ప్రస్థానం

ఏప్రిల్ 2009

వెల రూ. 10



## వైరుధ్య జీవిత వ్యంగ్య శిల్పి
## కె.ఎన్.వై. పతంజలి



## ప్రజాస్వామ్యానికి
## చుక్కాని
## ఓటు చుక్క

సాహితీ స్రవంతి




సికింద్రాబాద్ సెయింట్ మేరీస్ చర్చి ప్రాంగణంలో కొద్దికాలం క్రితం
ఏర్పాటయిన మైకేలాంజెలో ప్రసిద్ధ శిల్పం 'పియేటా' కు ప్రతిరూపం
ఫొటో : గుడిపూడి విజయరావు

సాహిత్య ప్రస్థానం
సంపుటి : 7 ఏప్రిల్, 2009 సంచిక : 41

# ఎన్నికల భారతం

ఈ సంచిక మీ చేతుల్లోకి వచ్చేసరికి దేశంలో ఎన్నికల వేడి బాగా పెరుగుతుంటుంది. ఎనభై కోట్ల మంది ఓటర్లున్న ఈ ఎన్నికల భారతం భావిగతిని నిర్ణయించడంలో చాలా కీలకఘట్టం. ఇప్పుడు ప్రజలు ఇచ్చే తీర్పు రావలసిన మార్పుకు బాట కావాలి. దేశంలో ప్రధాన పాలక పక్షాలన్ని సామ్రాజ్యవాద ప్రపంచీకరణ పథంలో ఒకే అభివృద్ధి నమూనాను దేశంపై రుద్దాయి. గత ఎన్నికల నాటికి కేంద్రంలో వాజ్‌పేయి నాయకత్వంలోని బిజెపి- ఎన్‌డిఎ ప్రభుత్వం మత ఘర్షణల మధ్య భారత్ వెలిగిపోతుందని నినాదమిచ్చి ప్రజల తిరస్కరణకు గురైంది. తర్వాత కూడా ఆ విధానాల్లో మార్పు రాకపోగా ఇప్పుడు వాజ్‌పేయి స్థానంలో మతతత్వ రాజకీయాల ప్రత్యక్ష ప్రేరకుడు ఎల్.కె.అద్వానీని ప్రధాని అభ్యర్థిగా ప్రకటించి రంగంలోకి దిగింది. గత సారి వామపక్షాల మద్దతుతో అధికారం చేపట్టిన కాంగ్రెస్ యుపిఎ కూడా ఆచరణలో అవే విధానాలను అనుసరించి అణు ఒప్పందంతో దేశ సార్వభౌమత్వాన్ని ప్రమాదంలో నెట్టింది. ఇప్పుడు యుపిఎ విచ్ఛిన్నమై పోతుంటే కాంగ్రెస్ మాత్రం ప్రస్తుతానికి అదే మన్మోహన్ సింగ్‌ను ప్రధానిగా ముందుంచుకొని ప్రచారంలో దిగింది. ఈ రెండు పెద్ద జాతీయ పాలకపక్షాలకు భిన్నంగా వామపక్షాలు, ప్రాంతీయ లౌకిక పక్షాలతో మూడో వేదిక ఏర్పాటుకై ప్రయత్నాలు సాగుతున్నాయి.

రాష్ట్రంలోనూ గతంలో సాగిన ప్రజాఉద్యమాల వల్ల అధికారంలోకి వచ్చిన వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రభుత్వం ఉద్యమాలపైనే కత్తికట్టి దారుణమైన నిర్బంధం సాగించింది. భూపోరాటం సందర్భంలో ఈ నిర్బంధాన్ని సాహిత్య లోకం ఎలుగెత్తి నిరసించింది. దానికి తోడు విపరీతమైన అవినీతి పోకడలతో రాష్ట్ర సంపద హరించుకుపోతున్నది. సెజ్‌లు, భూ పందేరాలు, కబ్జాలు వగైరాలతో ముఖ్యంగా గ్రామీణ జీవితం కల్లోలితమైంది. అనేకచోట్ల రచయితలు ప్రత్యక్ష పర్యటనలతో ఈ వాస్తవాలు పరిశీలించి అనుభవాలకు అక్షర రూపమిచ్చి ప్రజలకు సంఘీభావం ప్రకటించారు. బూటకపు ఎన్‌కౌంటర్లను ఉన్నత న్యాయస్థానమే ఖండించవలసి వచ్చింది. ఇక తెలంగాణాపై రకరకాల మాటలతో ప్రజల ఇంగితాన్ని అవహేళన చేయడంపై ఆగ్రహం పెల్లుబుకుతున్నది.

ఇలాటి నేపథ్యంలో కేంద్రంలోనూ రాష్ట్రంలోనూ కూడా ఇప్పుడున్న ప్రభుత్వాలను కొనసాగనివ్వడం ప్రజా ప్రయోజనాలకే చేటు. ఇక మతతత్వ శక్తులకు మళ్లీ అవకాశమివ్వడం ప్రజాస్వామ్య లౌకిక విలువలకు హాని. ఈ రెంటిలో ఏది గెల్చినా దేశ సార్వభౌమత్వాన్ని సామ్రాజ్యవాదులు బారి నుంచి కాపాడుకోవడం కుదిరేపని కాదు. అసలే ఆర్థిక మాంద్యం అందరినీ కుదిపేస్తున్న ఈ తరుణంలో ప్రత్యామ్నాయ విధానాలను సాధించుకోవడం ఒక్కటే మార్గం. వాస్తవిక దృష్టితో అందుకు దోహదం చేసే ప్రత్యామ్నాయ శక్తులను బలోపేతం చేసుకోవడమే ప్రజల ముందున్న మార్గం. అలాటి ఆరోగ్యకరమైన శక్తులకు చేయూత నివ్వడం కవులు రచయితలు కళాకారులు తదితర బుద్ధి జీవులు కర్తవ్యం. గతంలో వలెనే ఇప్పుడూ వారు ఆ కర్తవ్యాన్ని నెరవేరుస్తారని ఆశిద్దాం.

ముఖచిత్రం : శ్రీరామ్ కారంకి
బొమ్మలు : శేఖర్, శివాజీ, వెంకటేష్, బి.వి.ఆర్. చారి

## ఈ సంచికలో...

| | |
|---|---|
| జీవితం మళ్ళీ మొదలైంది! (కథ) | 2 |
| కవిత | 5 |
| గిరిజన బాలలకు సాహిత్యం | 7 |
| కవిత | 11 |
| సాహసి | 12 |
| కవిత | 14 |
| ఇంటింటి కథ | 15 |
| కవిత | 19 |
| తొలిమహిళా లేఖలు-సామాజిక విలువలు | 20 |
| కవిత | 25 |
| దృక్పథం (కథ) | 26 |
| చిలిపి పదాల్లో | |
| చిగురు తొడిగిన మతసామరస్యం | 29 |
| కథాసంద్రంలోంచి ఎగిసిన కవితా కెరటం | 30 |
| అభ్యుదయ కవి కాంచనపల్లి | 32 |
| కవిత | 33 |
| వైరుధ్య జీవిత వ్యంగ్య శిల్పి | 34 |
| ఎన్నికల సవాళ్ళు | 35 |
| కుటిల పాలకులను తూర్పారపట్టిన కవులు | 37 |
| కథా నిలయం పన్నెండో వార్షికోత్సవం | 38 |
| కొలకలూరి సాహిత్యోత్సవం | 41 |
| డైరీ | 43 |
| కొత్త పుస్తకాలు | 47 |

కవిత

సంపాదకవర్గం
తెలకపల్లి రవి (సంపాదకుడు)
కె.ఆనందాచారి
ఎ.సత్యభాస్కర్
వీరప్రసాద్
ఎం.నరహరి
కె. లక్ష్మయ్య, మేనేజర్

చిరునామా
సాహిత్య ప్రస్థానం
1-1-187/1/2,
వివేక్‌నగర్, చిక్కడపల్లి, హైదరాబాద్-500 020
ఫోన్లు : 27660013, 27635136,
ఇ.మెయిల్ : Prasthanam_ss@yahoo.co.in

# జీవితం మళ్ళీ మొదలైంది!

◆ కథ



■ శిరం శెట్టి కాంతారావు

**అప్పుడే ఉదయిస్తున్న సూర్యుడు థర్మల్‌స్టేషన్ వెలువరిస్తున్న ధూళి మేఘాల మధ్య నుండి బూడిద రంగులో కన్పిస్తున్నాడు.**

**రాత్రి కురిసిన మంచును, థర్మల్ స్టేషన్ బూడిదనూ భరాయించిన చెట్లన్నీ సూర్యుణ్ణి చూడడంతోనే ఆ ధూళిని భరాయించడం మీ చేతకావడం లేదన్నట్టుగా ఆకుల నేత్రాల నుండి పట, పట కన్నీళ్ళు కార్చసాగాయి.**

పొద్దున్నే ముక్కుల్లోకి బూడిదపోకుండా గుడ్డలు అడ్డుపెట్టుకున్న జనం గాలికుంటు సోకిన గొర్రె పిల్లల్లా రోడ్ల మీద భారంగా కదులుతున్నారు.

విరామం ఎరుగని వేరుశనగ మిల్లు బస్తాల కొద్దీ కాయలను వొల్చుకుతింటూ పొట్టును బయటకు ఉమ్మేస్తుంది....

ఆ శనగ పొట్టు కుప్పకు ఎద్దుల బండిని నిలబెట్టిన యాకూబలీ వెదురుగంపతో లెక్కపెట్టుకుంటూ పొట్టుబండి జల్లను మెల్లగా నింపుతున్నాడు.

బండికాడిని దిండల మీద మోస్తూ నిల్చున్న ఎద్దులు రెండూ అంతకు ముందు రోడ్ల మీద తిన్న చెత్త కాగితాలను నెమరుకు తెచ్చుకోవడం మనసుకు నొప్పనట్టు శివాలయం ముందు నందీశ్వరుల్లా మూతులు బిగబట్టి చెవులతోనూ, తోకలతోనూ జోరీగలను తోలుకుంటున్నాయి.

పొట్టు గంపలను మోస్తున్న యాకుబలీ వంటి మీద మోకాళ్లు దిగిన నిక్కర్ తప్ప వేరే ఆచ్ఛాదన ఏదీ లేదు.

చమటతో తడిసిన అతని వళ్ళు అప్పుడే ఫ్రిజ్‌లో నుండి బయటకు తీసి రేపర్ వలచిన చాక్‌లెట్‌లా ఉదయం ఎండకు చల్లగా మెరుస్తుంది.

లెక్కపెట్టి ఇరవై ఐదు గంపల శనగపొట్టు ఎత్తి పోసేసరికి బండి జల్ల కాస్తా నిండి పొర్లి పోవడంతో ఆ వెదురు గంపను తీసుకుపోయి మిల్లు వెనుక కొట్టులో దాచి పెట్టి తల గుడ్డ తీసి దులుపుకుంటూ మిల్లు ముందున్న బోరు పంపు దగ్గరకు నడిచాడు.

వళ్ళు కడుక్కుని వస్తున్న యాకుబలీని చూస్తే వడలిపోయిన వంకాయను నీళ్ళల్లో ముంచి తీసి నట్టుగా ఉంది. పొట్టు గంపలు, మోసి, మోసి జుట్టంతా ఊడిపోయిన మాడు ఎండు కొబ్బరి టెంకెలా రాటు దేలిపోయింది.

తువ్వాలు పిండి భుజాల మీద ఆరేసుకుంటూ బండి దగ్గరకొచ్చిన యాకుబలీ రోజాలకు (చక్రాలకు) అడ్డం పెట్టిన పోటు రాళ్లను తీస్తుండగా దగ్గర కొచ్చిన ఆయిల్ మిల్లు యజమాని రంగారెడ్డి "సాయిబు గారు! రేపట్నుండి పొట్టుజల్ల ఏడొందలని ఆ ప్యారేలాల్ సేట్‌కు చెప్పు. గొందు గూడెం ఇటుక బట్టీలోళ్ళు తెగ తిరిగి పోతున్నా లేదని చెబుతున్నా. అసలు శనగపంటే తక్కువై మిల్లే బందు పెట్టాల్సొచ్చేట్టుంది." అంటూ చెప్పుకొచ్చాడు.

"ఇప్పటికి నాలుగొందలు పొట్టు బండికి ఆరొందలు తీసుకుంటుంది చాలక మళ్ళీ వంద పెంచాలంటున్నాడీరెడ్డిగారు. ఉన్నోడికి ఆశెక్కువంటే ఇట్లానే ఉంటుందేమో?" రంగారెడ్డి మాటలు విని తన్లో తానే ఆలోచించుకుంటూ బయటికి మాత్రం" మంచిది రెడ్డిసాబ్! అట్లనే చెబుతాలెండి" అన్నాడు యాకుబలీ.

పోటు రాళ్లను పక్కకు జరిపి ఎద్దుల పగ్గాలను చేతిలోకి తీసుకొని బండి ముందు నడుస్తూ బల్లోరి గూడెం సిమెంట్ రోడ్డు మీదుగా సినిమాహాలు ముందుకొచ్చి, అక్కణ్ణుంచి ఆర్డీవో ఆఫీస్ దగ్గరున్న స్వీట్ కార్ఖానకు చేరుకుని జల్లలోని శనగపొట్టునంతా దంతతో కిందికి జారగుంజిన యాకుబలీ బండిని అట్లాగే నిలబెట్టి కార్ఖానాలోకి నడిచాడు.

కార్ఖానా అంతా రక, రకాల స్వీట్ల వాసనతో ఆదోరకంగా ఉంది.

నూనె, పిండి మరకలతో మాసిపోయిన బట్టలు వేసుకున్న పనివాళ్ళంతా చెమటలు కారుతుంటే వాళ్లల్లో వాళ్ళు లొడ, లొడా మాట్లాడుకుంటూ సరుకు దించుతున్నారు.

యాకుబలీని చూసిన ప్యారేలాల్‌సేట్ సిల్కు లాల్చీ బేబులోనుండి వంద రూపాయలు తీసి బండికిరాయికింద చేతికిస్తూ

'క్యాసమాచార్! పరేశాన్ కనబదుతున్నవెందుకు?" అన్నాడు.

"ఏముంది సేట్! పొట్టుబండి రేపట్నుండి ఏడొందలంట'' కిరాయి డబ్బులు జేబులో పెట్టుకుంటూ చెప్పాడు యాకుబలీ.

"ఓ సాలా! మళ్ళీ పెంచిండా!? ఏ పొట్టూ, గిట్టూ సబ్ బంద్‌కరో, ట్రాలీ, ఆటో పట్టుకొని ఆ పాండు రంగారావుపురం పోతే వంద రూపాయలకు ఐదు బస్తాల కర్ర పొట్టు ఇస్తామని ఆ ఊరి వడ్లోళ్లు రోజూ చెప్పి పోతున్నారు. ఎందుకులే ఎప్పట్నుండో ఇక్కడ తెస్తున్నామని పొట్టుకి పోతుంటే ఆ రెడ్డిగాడు



నఖ్రాల్ జేస్తుండు" అంటూ యాకుబలీనే కావాలని ఏదో పొట్టు రేటు పెంచినట్టు అతని మొహం మీద చేతులు ఝాడిస్తూ గట్టిగా అన్నాడు ప్యారేలాల్‌సేట్.

కార్ఖానాలో నుండి బయటకొచ్చిన యాకుబలీ బండెక్కి కూర్చుని ఎద్దుల్ని అదిలించాడు.

ఎద్దులు రెండు మెల్లగా ఇంటి దారి పట్టాయి.

బండి మీద కూర్చున్న యాకుబలీ ఏదో ఆలోచనల్లో కూరుకుపోయాడు.

◆◆◆

యాకుబలీకి పెండ్లయిన కొత్తలో ఓ బండిని, జత ఎద్దులనూ కొని ఇచ్చిన మామ ఎ.పి. స్టీల్, నవభారత్ కంపెనీలో క్యాంటీన్లను చూపించి మంచిగా బతుకు పొమ్మన్నాడు. అప్పట్నుండి గొల్లగూడెంలో గుండయ్య వద్ల మిల్లు నుండి వరి పొట్టు తోలుకు పొయ్యి కంపెనీల క్యాంటీన్లకు అందించసాగాడు యాకుబలీ.

అట్లా రోజుకి నాలుగైదు పొట్టు బండ్లను తోలి వంద రూపాయలు కండ్ల జూసేవాడతను. యాకుబలీ సంపాదనను చూసిన వాళ్ళ మామ" మీ కంటే చిన్నోడు ఎట్ల సంపాయిస్తున్నాడో చూడండి. మీరేమో వద్దన్నా వినకుండా ఆ ఫవరౌజ్ పనికి బొయ్యి రోజుకు ఐదు రూపాయలు సంపాయిస్తుండ్రు. ఆ ఐదురూపాయలతోటి పెళ్ళాం, పిల్లల్ని ఎట్లా బత్కిస్తారు?" అంటూ రోజూ మందలిస్తూ వాళ్ళను యాకుబలీ బాటలో నడవమనేటోడు.

ఐతే, ఆ పనిమావల్ల కాదునుకున్న యాకుబలీ తోడళ్ళుల్దిద్దరూ మామ మాటలు ఆ చెవులతో విని ఈ చెవులతో వదిలిపెట్టి ఎప్పటిలాగే థర్మల్ స్టేషన్లో పనికి వెళ్ళేవాళ్ళు.

యాకుబలీ బండి మీద సంపాదన జాగ్రత్తగా ఖర్చుపెట్టుకుంటూ రూపాయి, రూపాయి పోగేసి మసీద్ రోడ్డులో నాలుగు కుంటల స్థలం కొని బెంగుళూరు పెంకుల్తో ఇల్లు కట్టాడు.

ఇంకా, అడపా ధడపా, చిన్న చిన్న అవసరాలకు తోడళ్ళుల్దిద్దరికీ, వందో, వెయ్యో వడ్డికి, సడ్డీకి ఇస్తూ ఆదుకునే వాడుకూడా.

అట్లా బండి తోలుకుంటూ నలుగుర్లో గుట్టుగా బతుకుతున్న యాకుబలీకి ఇద్దరమ్మాయిలు కలిగారు. దాంతో ఇంటి ఖర్చులు పెరిగి పొట్టు బండి సంపాదన కాస్తా 'లంక మేత– ఏటీ ఈత' సామెతగా అయ్యింది.

చూస్తుండగానే ఏ ఇంట్లో చూసినా పొట్టు పొయ్యిలు మాయమై వాటి స్థానంలో గ్యాస్ పొయ్యిలు వచ్చేశాయి.

మరోవైపున ఏనుగు మింగిన ఎలక్కాయ చందంగా ఎ.పి. స్టీల్స్ కంపెనీ మూత పడిపోయింది. దాంతో యాకుబలీ ఆదాయానికి సగానికి సగం గండి పడింది.

"ఖాళీగా కూర్చుంటే ఇల్లెట్లా గడుస్తుంది?" అనుకున్న యాకుబలీ గుట్ట చివర ఇటుక బట్టిలకు ఊక తోలడం మొదలు పెట్టాడు. దాంతో మళ్ళీ నాలుగు డబ్బులు చేతిలో ఆడడంతో "ఫర్వాలేదంటే ఒకటి పోయినందుకు మరొకటి దొరికింది" అనుకుంటుండగానే పులిమీద పుట్రలా నవభారత్ కంపెనీ వాళ్ళు క్యాంటీన్ని కాంట్రాక్టర్‌కి ఇచ్చి వేశారు. ఆ కాంట్రాక్టరేమో పొట్టు పొయ్యి తీసేసి గ్యాస్ పొయ్యి వాడడం మొదలు పెట్టాడు. దాంతో యాకుబలీ పని మళ్ళీ ఒక్కసారిగా మొదటికొచ్చింది.

కాలానికి తగ్గట్టు యాకుబలీ మారుతున్నప్పటికీ, సమాజంలో అంతకంటే వేగంగా మార్పులు చోటు చేసుకోసాగాయి.

యాకుబలీ వరి పొట్టు తోలుతున్న ఇటుక బట్టీలకు ఎదురుగానే ఎవరో వచ్చి అల్లోబ్రిక్స్ కంపెనీ పెట్టడంతో జనమంతా అటువైపు మొగ్గు చూపడంతో కాల్చు ఇటుకలకు గిరాకీ తగ్గిపోయి బట్టీలు మూలపడ్డాయి.

యాకుబలీ మళ్ళీ రోడ్డున పడ్డాడు!

మధ్య మధ్యలో స్వీట్ షాపుల కార్ఖానాలకు ఒకటో అరో పొట్టు బండ్లుతోలినా ఇంట్లో గడవడం కష్టం కావడంతో ఇలా లాభం లేదనుకుని మెల్లగా అటు ముర్రేదు వాగు ఆవల బంగారుజాలు అడవుల్లోకి బండి తోలుకెళ్ళి ఎండు పుల్లలు వేసుకొచ్చి కావాలన్నోల్లకు వేస్తూ నాలుగు డబ్బులు కళ్ళ జూడసాగాడు.

కట్టెల బండ్లు తోలడం గూడా అనుకున్నంత తేలిక కాదు. వళ్ళు గుల్లైపోతుంది. పైగా ఫారెస్ట్ వాళ్ళకు బండికింతని మామూలివ్వాలి. వాళ్ళు తీసుకునే మామూళ్ళు తీసుకుంటూనే ఒక్కోసారి కేసుల్లేవని చెప్పి అడ్డ దిడ్డంగా కేసులు రాయడం, గొడ్డళ్ళు గుంజుకుపోవడం చేస్తుంటారు.

ఐనా సరే, అట్లాగే రోజులు నెట్టుకొస్తున్న యాకుబలీకి రాను, రాను, అడవిలో ఎండుపుల్ల దొరకడమే కష్టమై పోతుండడంతో "ఇంకేదన్నా దారి చూసుకోవాలి" అని ఆలోచిస్తుండగానే అనుకోకుండా 'సీతారాంపట్నం' సబ్‌స్టేషన్‌లో సిమెంట్ స్తంభాలు తోలే పని తగిలింది.

అయితే, అది మూదు రోజుల ముచ్చటే అయ్యింది.

ఆ సబ్ స్టేషన్‌లోనే పని చేసే ఎ.ఇ. బావ మరిది ఒకాయన కొత్తగా ట్రాక్టర్ తెచ్చి పెట్టడంతో డిపార్టుమెంట్ వాళ్ళు పని చులకనయ్యింది. దాంతో వాళ్ళు "ఈ ఎద్దుల బండితో ఎవరు పెట్టుకుంటాదులే" అంటూ పని మొత్తం ట్రాక్టర్‌కే ఇచ్చేశారు.

దాంతో యాకుబలీ పని భూమి గుండ్రంగా వుంది అన్నట్టుగా అయ్యింది.

◆◆◆

ఓ రోజు పొట్టు కావలంటూ స్వీట్ కార్ఖానా వాళ్ళు కబురు చేయడంతో తోలుకు పోయిన యాకుబలీతో "క్యాజీ! పరేశాన్ కనబడుతున్నావేంది?" అంటూ పలుకరించాడు సేట్.



"ఏం పరేశాన్ చెప్పమంటావ్ సేట్! ఆఁ కరంట్ స్తంభాల పని గూడా ఉల్టా –పల్టా అయ్యింది గాదు? ఏం జెయ్యాల్నో తోచట్లేదు." జల్లల్లో పొట్టు కిందకు గుంజుతూనే చెప్పుకొచ్చాడు యాకుబలీ.

యాకుబలీ పరిస్థితి పూర్తిగా ఎరిగున్న ప్యారీలాల్ అతని వంక సానుభూతిగా చూస్తూ "ఏంగాదులే భయపడకు. మేమీ వారం, పదిరోజుల్లో కొత్తగా సెంట్రింగ్ సామాను కిరాయికి పెడుతున్నాం. బండి తెచ్చి కొట్టు ముందు పెట్టి కూర్చో. కావాలన్నోళ్ళకు తోలిపెడుదువు గాని" అంటూ నిజమైన శ్రేయోభిలాషిలా ఓ కొత్త దారి చూపించాడు. ఆ విధంగా కొన్నాళ్ళ పాటు యాకుబలీ బండికి చేతి నిండా పని దొరికింది. దాంతో నాలుగు రాళ్ళు వెనక పడ్డంతో ఆఖరి అమ్మాయి పెండ్లి చేశాడు. ఇంటి గోడలకు సిమెంట్ చేయించాడు.

"ఇక అంతా బాగుంది" అనుకుంటుండగానే ఊరి నిండా ఉసిళ్ళల్లా పుట్టుకొచ్చాయి ట్రాలీ ఆటోలు! కొత్త నీరు తాకిడికి పాత నీరు పక్కకు తొలిగి దారి ఇవ్వడమే తప్ప చేయగలిగిందేమీ లేదన్నట్టు సెంట్రింగ్ సామాను కొచ్చిన వాళ్ళంతా ట్రాలీ ఆటోలే కావాలనడంతో యాకుబలీ పొట్టు బండి పని మళ్ళోసారి నిచ్చెన ఎక్కినట్టే ఎక్కి పామునోట్లో పడ్డట్టు అయ్యింది.

◆◆◆

"బండొచ్చి ఇంటి ముందాగినా దిగకుండా అట్లనే కూసోని ఏంటో ఆలోచించబడ్తివి?" వీధి చివర మున్సిపల్ పంపు నీళ్ళు పట్టుకొస్తూ మందలించింది యాకుబలీ భార్య మీరా.

అప్పటిదాకా బండిమీద ఆలోచనలో మునిగిపోయిన యాకుబలీ 'స్పృహ' అనే వడ్డు మీదకొచ్చి పడ్డాడు. ఆ వెంటనే బండి దిగి ఎద్దుల చిర్రల పలుపులు తప్పించి పోదిగర్రను ఎత్తి పట్టాడు.

కాడికింద నుండి పక్కకు తప్పుకున్న ఎద్దులు రెండూ నేరుగా కుడితి గాబు దగ్గరికి వెళ్ళి నీళ్ళను మురక చూసి తాగకుండా అట్లాగే నిల్చుండి పొయ్యాయి.

పోలుగర్ర కిందకు దించిన యాకుబలీ చిర్రలు, పలుపులు, పగ్గాలు ఇంట్లోకి తీసుకెళ్ళి వస్తూ... వస్తూ.... మానికతో ఇంత తౌడు తెచ్చి కుడితి గాబులో పోసి, ముల్లు కర్రతో నీళ్ళను లోపుతుంటే ఎద్దులు రెండూ సంతోషంగా కళ్ళు మునిగి పోయేంతలోతు ముట్టెలను నీళ్ళలో ముంచి ఒక్క దమ్ముతో గాబులోని కుడితినంతా పీల్చి పారేసి నాలుకతో ముక్కుల మీద అంటిన తౌడును నాక్కుంటూనూ, తోకలతో వెన్నుల మీద విసురుకుంటూనూ నిలబడి యాకుబలీ వంకా గారాబంగా చూడసాగాయి.

చిన్న పిల్లల మాదిరిగా గారాబంగా తన వైపు చూస్తున్న ఎద్దుల గంగడోళ్ళు, మూపురాలు దువ్వుతూ "అరే బేటా! ఇక ఈ అతుకుల, గతుకుల బతుకు బండి లాగడం నా వల్ల కాని పనికొచ్చింది. ఇగ మీకూ మాకూ రుణం తీరి పోయే రోజులు దగ్గరికొచ్చాయి.

ఇన్నాళ్ళు నుండి వారానికి రెండు మూడు పొట్టు బండ్లు దొరికినా అంతే చాలు లెమ్మని రోజులు గడుపుకొస్తున్నాం. ఇయ్యాల ఆ రంగారెడ్డి సేట్ మళ్ళీ పొట్టుబండి రేటు పెంచడంతో కోపమొచ్చిన ప్యారేలాల్ సేట్ అసలు పొట్టే వద్దని తెగేసి చెప్పిండు.

ఇకమే మేం తినాలా? మీకేం పెట్టాల? నా దగ్గర ఉండి ఎండి చచ్చేదానికన్నా ఎవరి దగ్గరి కన్నా పొయ్యి మీరన్నా మంచిగా బతకండి" అనుకుంటూ ఎద్దులను మసీదు వెనుక రావి చెట్టుకిందికి తొలి వచ్చాడు యాకుబలీ.

వంటిమీద నాలుగు చెంబులు గుమ్మరించుకుని అన్నం ముందు కూర్చున్న యాకుబలీ భార్య మీరాతో పొద్దున జరిగిన విషయాన్ని వివరించి ఇక తనేం చేయాలనుకుంటున్నాడో కూడా తెలియజేశాడు.

ఎద్దుల మీద మమకారం వల్లనో బతుకు మీద భయం వల్లనో తింటున్న అన్నం గొంతు కడ్డంబడి కొరబోయి కళ్ళ వెంట నీళ్ళు కారుతుంటే నీళ్ళు చెంబు ఇవ్వమన్నట్టుగా భార్యకు సైగ చేశాడు యాకుబలీ.

అక్షయ పాత్ర లాంటి బండి, ఎద్దులు ఇక ఉండబోవన్న వాస్తవం గుండెల్ని మండిస్తుంటే మౌనంగా మంచినీళ్ళ చెంబు అందిస్తూ కళ్ళ నీళ్ళు పెట్టుకుంది మీరా.

అంతలోనే...

దేనికి సూచనోగాని గోడమీద బల్లులు రెండు పెద్దగా పలుకసాగాయి.

మసీద్‌లో నుండి గుండెలు ద్రవించి పోయేలా ఎవరో ప్రసంగిస్తున్నారు.

◆◆◆

చింతూరు వైపు నుండి వచ్చిన బేరగాళ్ళు ఎద్దులను కొనుక్కుపోయారు. కానీ, ఎడ్ల బండ్లుతోలేవాళ్ళే కరువై పోవడంతో పాటు బండి కూడా పాతదై పోవడంతో కొనేవాళ్ళు లేక పక్షికి రెక్కలు విరిచేసినట్టు చక్రాలు రెండూ ఊడదీసిన చట్రం శిధిల శిల్పంలా గొడకు ఎత్తి పెట్టి ఉంది.

ఎద్దులను అమ్మితే వచ్చిన డబ్బులతో యాకుబలీ వాళ్ళ అప్పులు చాలా వరకు సర్దుబాటయ్యాయి. ఆడపిల్లలిద్దరినీ అత్తగారి ఇండ్లకు పంపేశారు.

వంటరిగా మిగిలిపోయిన యాకుబలీ దంపతులు తిరిగీ, తిరిగీ చెరోపని సంపాదించారు. మీరాభీడా రామ్మోహన్‌రావు హాస్పిటల్లో ఆయాగా చేరిపోయింది.

ఇక యాకుబలీ భద్రాచలం రోడ్డులో అయ్యప్ప గుడి దగ్గర కొత్తగా కట్టిన ఐ.టి. పార్కులో వాచ్‌మెన్‌గా కుదురుకున్నాడు.

పడమర అస్తమించిన సూర్యుడు తూర్పున ఉదయించాడు. జీవితం మళ్ళీ మొదలయ్యింది.

●

## కవిత

# బహుదూరపు బాటసారిని...!

**కటుకోర్ఖ్వుల రమేష్**

భుజాన మోయలేని భారం
తలపై ముళ్ల కిరీటం
కళ్లల్లో రేపటి ఆశల దీపం
వొంటినిండా వెలేసిన మచ్చలు
నా ముందు ముందు తరం నడిచిన అచ్చులు
అన్నీ తడుముకుంటూ... తడుముకుంటూ...
నాతోపాటే చీకట్లను చీల్చుకుంటూ.....
సూర్యుడొస్తాడనీ
ఓపికల్ని కూడగట్టుకొని
అడుగేస్తున్న
బహుదూరపు బాటసారిని!
మజిలీ మజిలీకి
కాసింత ఓదార్పును తాగ
స్వేచ్ఛకోసం వెర్రిగొంతుల్ని విచ్చుకొని
విసిగి వేసారుతున్న వాణ్ణి
నా జీవన సంద్రం ఆటుపోటుల వలయం
నాలో ఎన్నో సునామీలు
అన్నీ అన్నీ చవిచూస్తూనే
వైయక్తికం నుండి సామూహికం వైపు
ఓ చైతన్య వీచికను
సృష్టించకపోతానా అనీ....
ఓ అభ్యుదయ అగ్ని కణాన్ని
రగల్చక పోతానా అనీ.....
అంతులేని స్వార్థాన్ని... బల్లకింది చేతుల్ని...
నా రహదారి సాక్షిగా ఎన్నిసార్లు ఖండించినా
అవే అంకురాలు
మళ్లీ మళ్లీ మొలవటం చూస్తున్నా
మనిషికీ మనిషికీ మధ్య
వ్యత్యాసాలు
ఓ రాచపుండై సలపటం చూస్తున్నా
ఈ అసమానతల అణచివేతల
వైకుంఠపాళిలో
నన్నెప్పుడూ పెద్ద పాము మింగుతూనే వుంటుంది.
ఎక్కడ నడక ప్రారంభించానో



అక్కడికే మళ్ళీ జారిపోతుంటాను
అయినా
ముందడుగు మానుకోను

గొంతెండీ కడుపెండి కళ్లు బైర్లు కమ్మి
అమ్మా! ఆకలి అన్నప్పుడల్లా
నా డప్పు డొక్కలో తన్నిన శబ్దమే
ఏ దండోరాలు ఏ మరణ మృదంగాలు
ఈ లేనితనాన్ని చాటింపు వేస్తాయి
ముదిగొండ అమరుల సాక్షిగా....
అభి"మానం" అల్లాడిన
వాకపల్లి గిరి మహిళల సాక్షిగా
అరవై వసంతాల స్వాతంత్ర్యం
సిగ్గుతో తలదించుకుంటుంది....!
ఇక్కడిక్కడ అంతా నిశ్శబ్దం!
కానీ.... ... ...
ఆలోచనల్లో... విస్ఫోటనం
గుండెను పిండుతున్న అలజడి
ఆలస్యం చేయలేనిక
మరిగే రక్తంలో దుఃఖాన్ని ఇంకించి
ఎండిన కళ్లను ఎడారుల్లో అతికించి
నేనూ ఓ ఇసుక తుఫానునై
అవినీతిని అణువణువుగా చీల్చి
ఆకాశంలో విసురుతాను
... ... ...
అదిగో
మానవత్వం ఓ సైకత చిత్రమై
దూరంగా దర్శనమిస్తుంది
ఇక చేజారిన హక్కుల్ని
బలవంతంగానైనా పిండుకుంటాను
ఈ కర్ణుణ్ని
ఏ గాయం మళ్లీ శపించినా!
ఎన్ని ఎండమావులు
ఈ దాహార్తిని వెక్కిరించినా!
సమానత్వ ఉషస్సుల ఒయాసిస్సుల కోసం
నిత్యాన్వేషినై నేల నేలంతా
నడుస్తూనే వుంటాను
నా చివరి రక్తపు బొట్టు వరకూ.....

●

## కవిత

# ఓ పాఠకుడి లేఖ

ఎమ్వీ రామిరెడ్డి

అత్యంత రహస్యంగా గాంధీ సందేశాన్ని మోసుకొచ్చిన
కరపత్రం సాక్షిగా నా అధ్యయనం ప్రారంభమైంది
వెలుగుకిరణం నా కంటిపొట్లాన్ని విప్పడం ఆలస్యం
ఆబగా అక్షరాల వెంట పరుగులు తీసేవాణ్ణి
అక్షరం నా ఒంటినిండా కితకితల్ని అమర్చేది
ప్రపంచాన్ని చాపలా చుట్టి నా చుట్టూ నిలబెట్టేది
అప్పుడు అక్షరమంటే ఆకాశం, పాతాళం, ఖగోళం, ఖండాంతరం
అక్షరమంటే వాయులీనం, మృదంగం, లలితగీతం, నృత్యకేతనం
అక్షరం ఠీవిగా ఇంతెత్తున నిలబడి
చీకటి భూతాలను తరిమికొట్టేది
ఆరిందాలా గొంతు విప్పుకొని
మట్టిలోంచి మానవీయకోణాల్ని వెలికితీసేది
బడుగుజీవి బాధల ప్రదర్శనకు
రంగస్థలాన్ని అలంకరించేది

◆

కాలంతోపాటు అక్షరం ఆధునికమైంది
రంగురంగుల సీతాకోకచిలుకల్లా
అక్షరాలు రెక్కలు విప్పుకోసాగాయి
ఇంట్రోల నుంచి ఫొటోల దాకా
సెంటర్‌స్ప్రెడ్ నుంచి స్పెషల్ ఫీచర్ల దాకా
సృజనాత్మక వయ్యారాల నడుమ
అక్షరం వేషాలు మార్చింది
అక్షరానికి మాటలొచ్చాయి
అక్షరానికి దృశ్యాలు మొలిచాయి
ఇంటింటికీ నెత్తిన కొమ్ములొచ్చాయి
అంటార్కిటికాలో మంచుతుఫాను మొదలు
ఆఫ్ఘనిస్తాన్‌లో బిన్‌లాడెన్ దాకా
రన్నింగ్ కామెంట్రీలు రచ్చబండలెక్కాయి

◆

ఆధునికతతో పాటు అక్షరం గాయపడింది



అక్షరానికి జెండాలు మొలిచాయ్
అక్షరాన్ని డబ్బులు తొలిచాయ్
అక్షరంలోకి వాణిజ్యసూత్రాలు చొరబడ్డాయి
పతాకశీర్షికలు పక్షపాతం బారిన పడ్డాయి
విశ్లేషణలు పెట్టుబడుల కోటలయ్యాయి
'పాలసీ'ల సుడిగుండాల్లో చిక్కిన కలాలు
'రుచికర' వంటకాల్ని వండివార్చే యంత్రాలయ్యాయి
సెన్సేషన్ జబ్బు సోకిన బుల్లిపెట్టెలు
ఆత్మహత్యల్నీ అత్యాచారాల్నీ 'క్లోజప్'లో కక్కేస్తున్నాయి
గోరంత కథనానికి కొండంత చక్కెరపూసి
వేలకొద్దీ ఎపిసోడ్లను కుమ్మరిస్తున్నాయి

◆

ప్రచురణ-ప్రసార ప్రయాణానికి
నూటొక్క ప్రతిబంధకాలుండొచ్చు
అచ్చొత్తే యంత్రాల అట్టడుగున
కనిపించని కష్టాల 'బండిళ్ళు' ఉండొచ్చు
దృశ్యాల్ని కక్కే ఉపగ్రహాల కోరల్లో
కోట్ల రూపాయలు కూరుకుపోయి ఉండొచ్చు
అయినా సరే
అక్షరం విడుదల కావాలి
సవాలక్ష సవాళ్ళను దాటుకొని
సామాన్యుడి వజ్రాయుధంగా ఆవిర్భవించాలి
సింగిల్ కాలమ్స్‌లో చిక్కుబడిపోతున్న పచ్చినిజాలు
పతాకశీర్షికలుగా పడగ విప్పాలి
అక్షరం ప్రశ్న కావాలి
అది జవాబును పిండాలి
అక్షరం దివిటీ కావాలి
అది రహదారిని కాంతిమంతం చేయాలి
దృశ్యం పురివిప్పాలి
రక్తమాంసాలతో మిళితమై జీవితాన్ని కీర్తించాలి
ఇంతెందుకు
నేను మళ్ళీ నిజమైన పాఠకుణ్ని కావాలి!

---

# పాలకుడా!

మాధవీసనారా

మేం మా న్యాయసమ్మతమైన కోర్కెల కోసం
గుర్తింపు కార్డుల్లాంటి జెండాలు పట్టుకొని
గొంతువిప్పి... రోడ్డెక్కినప్పుడల్లా
మేం నీ కళ్ళకి
శతృదేశపు సైనికుల్లా కనిపిస్తున్నప్పుడు
మేం అహింసా మార్గంలో కదిలినప్పుడల్లా
నువ్వు హింసా మార్గాన్నే ఎన్నుకుంటున్నప్పుడు
నోటితో గాంధీ వారసుడ్ననీ
అహింసా పూజారిననీ చెప్పుకుంటూ
నొసటితో హిట్లరులా
ఆజ్ఞలు జారీ చేస్తున్నప్పుడు
మేం 'యింక్విలాబ్ జిందాబాద్' అంటూ
ఎలుగెత్తి అరిస్తే
అది నీ చెవులకు



ఆంగ్లేయ పాలకుల్ని బెదరగొట్టిన
'వందేమాతరం' మంత్రంలా వినిపించినప్పుడు
ఉలిక్కిపడతావెందుకు
నిన్న 'వందేమాతరం' అయితే
నేడు ఇంక్విలాబ్ జనమంత్రం కదా!
అప్పుడు సుస్వరాలు పలికిన ఈ నోరే
నేడు గద్దెపై నుండి అపస్వరాలు పలుకుతుందేం!
మేమిచ్చిన అధికార అగ్గిపెట్టెలో
గడ్డివాముల్నీ
పేదల గుడిసెల్నీ
తగలబెట్టడం తెలిసిన నీకు
చీకటి బతుకుల్ని వెలుగుమయం
చెయ్యడం తెలీనప్పుడు... తెలీదంటున్నప్పుడు
తల్లి పక్షిలా... కోడిపెట్టలా
ప్రజల్ని నీ రెక్కల కింద సంరక్షించాల్సింది
పోయి
గండు పిల్లుల పాల్జేస్తున్నది కాక
అనకూడని మాటల ఉమ్మి తుంపర్లను
నీ నోరు మా మీద వెదజల్లినప్పుడు
ఇంకా మేమిచ్చిన అగ్గిపెట్టె పట్టుకుని
దిక్కులు చూడ్డం ఎందుకూ
నువ్వు అసమర్థుడివని ఒప్పేసుకున్నాక
ఇంకా నీ చేతిలో అగ్గిపెట్టెందుకు?
మేం లాక్కోక ముందే
మాది మాకిచ్చేసి నువ్వు తప్పుకో!

విశ్లేషణ

# గిరిజన బాలలకు సాహిత్యం

■ రెడ్డి రాఘవయ్య

*" ప్రతి భాషకూ సాహిత్యం ఉన్నట్లే షెడ్యూలు తెగలకు కూడా ఏ తెగకు ఆ తెగ సాహిత్యం ఉన్నది. కాని అది మౌఖికమేకాని లిఖితం కాదు. పాటలున్నాయి. కథలున్నాయి. పుక్కిట పురాణాలు, సామెతలు, పొడుపుకథలు, నీతి వాక్యాలు ఉన్నాయి. ఇవన్నీ జానపదసాహిత్యంలో భాగంగానే ఉన్నాయి."*

"గిరి"జనులు

భూమి నైసర్గిక స్వరూపం ఎంతో విచిత్రమైనది. ఎంతో వైవిధ్యంతో కూడుకొని ఉన్నది. కొండలు, కోనలు, పర్వతాలు, లోయలు, గుట్టలు, మిట్టలు, ఎగుడుదిగుళ్ళు, వాగులు, వంకలు, నదులు, సరస్సులు, సముద్రాలు, చెట్టు చేమలు, అడవులు మొదలైన వాటితో నిండి ఉన్నది.

గతంలో మానవులందరూ తెగలే! (Tribes) కొన్ని తెగలు, మైదానాలకు జేరి, ఆధునికమై గిరిజన లక్షణాలను పోగొట్టుకొని, మంచి సంస్కృతీ సంప్రదాయాలను అలవరచుకున్నాయి. దాని పరిసరాలు, ఆర్థికత, జీవనవిధానం, భాషా సంస్కృతులు పూర్తిగా మారాయి. అలా కాకుండా కొండలు, కోనలు, పర్వతాలు, లోయలు, అటవీ ప్రాంతాలలో కొన్ని తెగలు మిగిలిపోయాయి. వారి గ్రామాలు చాలవరకూ ఒకే చోట కేంద్రీకృతమయ్యాయి. ప్రత్యేకలోకంగా మిగిలిపోయాయి.వీటిల్లో కొన్ని తెగలు మూలాలు అతి ప్రాచీనమైనవిగా ఉన్నాయి. ఉదాహరణకు 'కోయ' జనాన్ని తీసుకుందాం! వీరి మూలాలు 25,000–10,000 సంవత్సరాల మధ్య గల "నూతన శిలాయుగం"లో ఉన్నాయంటారు. ఆస్ట్రో బాయిడ్ తెగలు– "కోయ సవర" ల వంటి గిరిజన జాతులుగా పరిణమించాయని "మానవ విజ్ఞాన శాస్త్రవేత్తలు" (Anthropologists) అంటారు.

వీరిని 'తెగలు' (Tribes) అనటానికి కారణం ఉన్నది. కొన్ని కుటుంబ సముదాయాల మధ్య సమైక్యత ఉండి ఒకే నిర్ణీత ప్రదేశాలలో నివసించేవారు. ఒకే భాష మాట్లాడుతూ ఒకే రకమైన ఆహారవిధానాన్ని అవలంభిస్తూ, వారి మధ్య పరస్పర అనుబంధం ఉంటే సమూహాన్ని "తెగ" అన్నారు, కొందరు. "ఒకే మాండలికాన్ని మాట్లాడుతూ, ఒకే నిర్ణీత ప్రాంతంలో నివసిస్తున్న సమూహాన్నే 'తెగ" అన్నారు మరి కొందరు.

1952లో "గిరిజన అభ్యుదయ కమిటీ" గిరిజనుల్ని (Tribes Wbc Fare Committee) నాలుగు వర్గాలుగా పేర్కొంది.

1. ఎవరి ప్రాంతంలో వారు నివసిస్తూ సాంప్రదాయక గిరిజన జీవితాన్ని వదిలి పెట్టకుండా ఉన్న తెగలు. వీటినే "గిరిజన సముదాయాలు" అంటున్నారు.

2. గ్రామీణ పరిసరాల్లో నివసిస్తూ, వ్యవసాయం దాని అనుబంధ జీవనాలను అలవరచుకున్న తెగలు, వీరిని " అర్ధ గిరిజన సమూహాలు (Semi Tribal Communities) అనవచ్చు.

3. నగర ప్రాంతాలకు వలసపోయి, అక్కడ స్థిరపడి, అక్కడి నాగరికత, వృత్తులను చేపట్టి, అక్కడి ప్రజల ఆచార వ్యవహారాలను అలవాటు చేసుకున్న తెగలు, వీటిని "సంస్కృతీకరణం చెందిన గిరిజన సముదాయాలు" అనవచ్చు.

4. ఇతర సంస్కృతులతో పూర్తిగా విలీనం చెందిన తెగలు.

ఈ వెనుకబడిన జాతుల అభ్యున్నతికి మొదట బ్రిటీష్ ప్రభుత్వం కొంత కృషి చేసింది. తరువాత సంఘ సంక్షేమ కార్యకర్తలు గౌరనీయమైన కృషి చేశారు.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ప్రభుత్వం వీరి అభ్యున్నతికి కొన్నిచర్యలు తీసుకున్నది. రాజ్యాంగంలో గిరిజనులకు, ఇతర వెనుకబడిన వర్గాలకు ప్రత్యేక సంరక్షణలను పొందుపరచటం జరిగింది. ప్రభుత్వానికి సలహాలను, గిరిజన అభ్యుదయ పథకాలు పని చేసే తీరును పరిశీలించటానికి "షెడ్యూల్ కులాల, తెగల, కమిషన్‌ను" నియమించింది. ఈ తెగలు ప్రపంచమంతటా విస్తరించి ఉన్నాయి. వాటిల్లో మన భారతదేశంలో 1967లో ANTHROPOLOGICAL SURVEY OF INDIA చేసిన అంచనా ప్రకారం 314 గిరిజన సముదాయాలు ఉన్నట్లు గుర్తించబడింది. 1961లో చేసిన జనాభా లెక్కలప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో 1, 324, 368 మంది షెడ్యూల్డ్ తెగల వారున్నారు. ఇటీవలి లెక్కల ప్రకారం ఆ సంఖ్య 50,24,104కు పెరిగింది.

**గిరిజన సాహిత్యం:**

"ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న గిరిజనుల్లో 33 రకాల తెగలు ఉన్నాయి" అని ప్రభుత్వం అంచనా! ఈ 33 తెగల్లో 3 తెగలు మైదాన ప్రాంతాలకు వలస వచ్చి అక్కడి సంస్కృతీ సాంప్రదాయాల్నీ, చదువు సంధ్యల్నీ అలవరుచుకున్నాయి అని అనుకోవచ్చు. వారిలో ఎరుకలు, యానాది, లంబాడీ (బంజారా)లు మన మధ్యనే నివసించటం మనకు తెలిసిన విషయమే!

ప్రతి భాషకూ సాహిత్యం ఉన్నట్లే షెడ్యూలు తెగలకు కూడా ఏ తెగకు ఆ తెగ సాహిత్యం ఉన్నది. కాని అది మౌఖికమేకాని లిఖితం కాదు. పాటలున్నాయి. కథలున్నాయి. పుక్కిట పురాణాలు, సామెతలు, పొడుపుకథలు, నీతి వాక్యాలు ఉన్నాయి. ఇవన్నీ జానపదసాహిత్యంలో భాగంగానే ఉన్నాయి. ఇవి ఒకరి నుండి ఒకరికి, నోటి నుండి చెవికి ఇలా ప్రయాణం చేస్తూ చిరస్థాయిగా ఉన్నాయి. వీటిని సేకరించి కొందరు ఆంగ్లంలోకి అనువదించారు. మరొ కొందరు యథాతథంగా పొందుపరిచారు. ఇంకొందరు వీటిపై పరిశోధన చేసి డాక్టరేట్లు తీసుకున్నవారు ఉన్నారు.

దీనికి గాను ఆయా భాషల్లో ఉన్న వాటిల్లో కొన్ని ఉదాహరణలు.

కోయ భాషలో "వాన వాదనద్ – ప్రాణం అందానద్ – బేనోంకి తెలియే" అనే సామెత ఉన్నది. దీనికి అర్థం మన కందరికీ

తెలిసిన 'వాన రాకడ ప్రాణం పోకడ ఎవరికీ తెలియదు'. అట్లాగే అదే భాషలో ఒక పొడుపు కథ "లోను అంతా ఉడ్డీమూలాతేకుద్దితె" దీనికి జవాబు "ఏపుర్ కట్ట" దీనికి మన తెలుగులో " ఇల్లంత తిరిగి మూల కూర్చుంటుంది." అని ఉన్నది. దీనికి జవాబు మనకందరికీ తెలిసిందే" చీపురు కట్ట".

"ఆదివాసి ఒరియా" భాషలో ఉన్న కొన్ని నీతి వాక్యాలు, పొడుపుకథలు, సామెతలు పరిశీలిద్దాం!

మనం " సత్యమే పలుకుము" అనే నీతి వాక్యాన్ని ఉపయోగిస్తాం! ఇదే ఆ భాషలో... 'సోతేసే పలొక్' అయ్యింది. అలాగే "దొంగతనం చేయరాదు" ఉన్నది. దీనిని వారు "చోర్ ఏయ్‌టి కొల్‌బర్‌నాయ్" అంటారు.

ఇక పొడుపు కథల సంగతి, "చెయ్యని కుండ పొయ్యని నీళ్ళు వెయ్యని బెల్లం– తియ్యగానుండు" అన్నది "కొబ్బరినీళ్ల"కు పొడుపు . దీనిని ఆదివాసి ఒరియావారు "నోసజ్‌ల అండి–నో రొకోయ్‌ల పని నొపకయ్‌లు గూడ్– కమ్‌లె బస్సిసువాద్' దీనికి జవాబు "నొద్యపని" "నొద్యగోచ్" అంటే "కొబ్బరి చెట్టు" దాని నుండి వచ్చిన కాయ 'పని' అలాగే ఇంకొక్కటి "రెక్కలేని పిట్ట తోకతో నీళ్ళు త్రాగును". దీనికి జవాబు "ప్రమిద దీపం". ఇదే ఆ భాషలో "డెనసోయ్‌ల బాడోయ్ లేంజ్ సొంగె పనికయసి" జవాబు "సొలిత"

'నోరు మంచిదైతే ఊరు మంచిదౌతుంది" అనే సామెత ఉన్నది. దీనినే ఆ భాషలో "టోండ్ బోల్‌రేయ్‌లె –గ్రావ్ బోల్‌రోయేసి". అలాగే "అరచేకుక్క కరవదు"ను, వారు "బుక్ బ కకూర్ –కె.బె.చె బెనాయ్" అంటారు.

ఇక పాటల సంగతికి వస్తే. మన జానపద పదం పాటల లాగే వారి పాటలూ ఉన్నాయి. మన గీతాలలాగానే అవీ జీవనశైలి గీతాలు, ఋతువుల గీతాలు, సరస గీతాలు, ప్రేమ గీతాలు, పెండ్లిగీతాలు, భక్తి గీతాలు – మొదలైనవి ఉన్నాయి.

ఇవి కాక నృత్యం చేస్తూ పాడే పాటలూ ఉన్నాయి.

వీటిల్లో చాలా వాటికి "మన తెలుగు గీతాల పోలికలు ఉన్నాయని" పరిశోధకులు అంటారు. అందుకు ఉదాహరణగా మన పిల్లలు "బొమ్మలపెండ్లి" చేస్తూ పాడుకునే పాటను చూద్దాం!

'గుజ గుజ రేకులు పడుచుందా?
గుజ్జ రేకుల పడుచుందా?
స్వామిదండలా పడుచుందా?
సహరాజులు మెచ్చ పడుచుందా?" తామర మొగ్గల్లా అనే పాదాలు ఉన్నాయి

నల్లమల అటవీ ప్రాంతంలో నివసించే చెంచువారి జానపద సాహిత్యంలో పై పాట ఈ విధంగా వుంది

"గిజ గిజి రైకల పిల్లుందా
ప్రద్రోజులచ్చ పిల్లుందా
స్వామి దండలా పిల్లుందా
గిజ్జ రైకుల పిల్లుందా....'

అని పెండ్లి కొడుకు వారు పిల్ల వాళ్లను అడుగుతారు. దీనికి పెండ్లి పిల్ల వాళ్ళు జవాబిస్తారు. ఇదే విధంగా కథాసాహిత్యం కూడా ఉంది.

**గిరిజనులు– విద్య– ప్రయత్నాలు:**

గిరిజన బాలలకు సాహిత్యం కావాలంటే ముందు వారిని విద్యావంతులుగా తీర్చిదిద్దాలి. దానికి తగిన ప్రయత్నాలు ముఖ్యంగా ఆధునిక సమాజంలో అడుగుపెట్టని తెగల కోసం – జరుగుతున్నాయని అనుకోవచ్చు. రాజ్యాంగంలో ఆదేశిత సూత్రాలు ఆర్టికల్ 40 ప్రకారం గిరిజనులకు సరైన విద్యను అందించాలి.

అసలు ఆయా గిరిజన ప్రజలు మాట్లాడే భాసలకు "లిపి" లేదు. సవర, కోయలాంటి భాషలకు లిపి కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయి. కాని అవి ఇంకా కార్యరూపం దాల్చలేదనే అనుకోవచ్చు. అందువల్ల ఆయా భాషల్లో విద్యాబోధన కనీసం ప్రాథమిక స్థాయిలోనైనా జరగటం లేదు. ఈ అవసరాన్ని గుర్తించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గిరిజన భాషల్లో ప్రాథమిక స్థాయిల్లో విద్యా బోధన కోసం చర్యలుచేపట్టింది.

అసలు ఆయా గిరిజన ప్రజలు మాట్లాడే భాసలకు "లిపి" లేదు. సవర, కోయలాంటి భాషలకు లిపి కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయి. కాని అవి ఇంకా కార్యరూపం దాల్చలేదనే అనుకోవచ్చు. అందువల్ల ఆయా భాషల్లో విద్యాబోధన కనీసం ప్రాథమిక స్థాయిలోనైనా జరగటం లేదు.

ఈ కార్యక్రమాన్ని "గిరిజన సంస్కృతి పరిశోధన– శిక్షణా సంస్థ– ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక విద్యా పథకం" సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. 1986 నాటి జాతీయ విద్యావిధానాన్ని అనుసరించి గిరిజన భాషా వాచకాల తయారీ ప్రారంభించబడింది.

దీనికోసం ప్రధానమైన గిరిజన భాషలు ఎన్నుకోబడ్డాయి. అవి " గోండీ, కొలామి, కోయ, కొండ, కువి, బంజారా, ఆదివాసి, ఒరియా, సవర", వీటిల్లో మొదటి 5 భాషలు "ద్రావిడ భాషా కుటుంబానికి చెందినవి తరువాతి రెండు "ఇండో ఆర్యన్ భాషల"కు చెందినవి. మూడవది "మూడా" (Astro Asiatic) భాషా కుటుంబానికి చెందినది. తెలుగులో వర్ణమాల 56 అక్షరాలతో కూడి ఉన్నది. కానిపైన చెప్పుకున్న గిరిజన భాషల వర్ణమాలలో అక్షరాల సంఖ్య తక్కువ. కోయ భాషకు 30 లక్షరాలు.... సవర భాషకు 29,కు వి సి భాషకు 33 ఇలా అన్ని భాషలకూ 30 అక్షరాలకు మించి ఉండవు. వీరికి లిపి లేదు కాబట్టి తెలుగు లిపిలోనే I నుండి VI వరకు పాఠ్యపుస్తకాలు తయారు చేయటం జరిగింది. రెండవ తరగతి నుండి తెలుగు నేర్చుకోవటాన్ని ప్రవేశపెట్టింది.

రెండవ తరగతి నుండి పాటలు, కథలు, పొడుపుకథలు, సామెతలు నేర్పుతున్నారు. 3వ తరగతిలో జాతీయ పండుగలు, జాతీయ నాయకులు అంశాలుగా తీసుకొని కొన్ని పాఠాలు రూపొందించబడ్డాయి.

2003 నాటికి గిరిజన పిల్లలంతా బడి /బ్రిడ్జి కోర్సు కేంద్రాలలో ఉండాలనీ, క్రమంగా 2010 నాటికి ఎనిమిది సంవత్సరాలు ఎలిమెంటరీ విద్యను పూర్తి చేయించి "సార్వత్రిక నిలకడ" సాధించాలనీ కృషి జరుగుతున్నది. గిరిజన ప్రాంతాలలో 1970లో అక్షరాస్యత 7 శాతం మాత్రమే ఉన్నది. అదే 2001లో నాటికి 37 శాతానికి పెరిగింది. ఇప్పుడు ప్రవేశపెడుతున్న నూతన వాచకాల వలన, నూతన

విద్యా విధానం వలన  ఆ శాతం ఇంకా పెరగవచ్చని అంచనా....

**గిరిజను బాలలకు ఏం సాహిత్యం కావాలి?**

గిరిజనులు, గిరిజన సాహిత్యం, గిరిజనుల - విద్య-ప్రయత్నాలు అన్న విషయాలతో  గిరిజన బాలలకు ఏం సాహిత్యంకావాలి?" అన్నది ముడి పడి వున్నది. ఈ విషయాల గురించి తెలుసుకుంటేనే సాహిత్యం గురించి ఆలోచించవలసి ఉంటుంది. అన్న ఉద్దేశ్యంతో ఇంత వరకూ ఆయా విభాగాల గురించి వివరించటం జరిగింది. "సాహిత్య" మనేది అడవిలో నివసించే గిరిజన బాలలకైనా మైదానాల్లో నివసించే ఇతర బాలలకైనా ఒకటే లక్ష్యంతో ఉంటుంది. కాని వేరుగా ఉండటం జరగదు.

పరమానందయ్య శిష్యుల కథలు, తెనాలి రామకృష్ణుని కథలు, అక్బర్-బీర్బల్‌కథలు... లాంటి కథల్ని వారి భాషలోకి పరివర్తన చెందించి అందించాలి. భట్టి విక్రమార్కుని కథలు, అరేబియన్ నైట్స్ కథలు మొదలైన వాటిల్లోని సాహసోపేతమైన కథల్ని, చక్కని శైలిలో పరిచయం చేయాలి".

"బాల బాలికల కానందముగా
బాలల హృదయమాలు అలరునట్లుగా
బాలల చిత్తములు చిగుర్చునట్లుగా....
పాటలు పాడండీ.!
పదములు కూర్చండీ....!

అంటారు. క్రీ.శే॥ గిడుగు వెంకట సీతాపతి గారు, బాలలకు ఆనందాన్ని అందించాలి. వాళ్ళ హృదయాలు అలరాలాలి. వారి చిత్తాలూనిగుర్చాలి... అన్నది బాలసాహిత్య లక్షణమై ఉండాలి.

అందుకని ఆయనే అంటారు
"పిల్లల చెవులకు ఇంపగు పలుకులు
పిల్లల మదిలో నిలిచే నీతులు
పిల్లల కోసం కట్టు కథలుగా...
పెద్దలు చెప్పండీ....
సుద్దులు పలకండీ.....

వారికి ఇంపైన మాటలు ఉండాలి. వాళ్ళ మనస్సుల్లో నిలిచి పోయే నీతులు ఉండాలి. దాని కోసం కట్టుకథలుగా పెద్దలు చెప్పాలి. అన్నదే గిడుగువారి అభిమతం.

"నోరెరుగని మానసిక వికాసం పొందని పసివారలను ఆకర్షించి, ఆనందింపచేసే వారిలో ఉత్తమ సాంస్కృతిక బీజాలు వేయునదే బాల సాహిత్యం" అన్నారు. జానపదవాఙ్మయ బ్రహ్మ నేదునూరి గంగాధరం గారు.

గిరిజన బాలలు అనగానే... కొండ... కోనలు.... అడవులు, లోయలు మొదలైనవి ముందుగా గుర్తుకు రావటం సహజం.... అందుకని వారికి అడవి గురించీ, దానిలో వున్న వృక్షాల గురించీ వాటి వలన లాభాలగురించీ చక్కగా తెలియజెప్పాలి. అడవిలో నడయాడే జంతువుల వివరాలు రకరకాల పక్షులు, వారితో సహజీవనం చేసే పెంపుడు జంతువుల గురించి తప్పకుండా సమాచారాన్ని అందించాలి.

వారిలో ఎన్నో తెగలున్నాయనుకున్నాం. ఏ తెగలోని బాలలకు ఆయా తెగలలోని జీవిత విధానాలను వివరిస్తూ కథలుగా చెప్పాలి. అలాగే పొరుగున ఉన్న తెగల వారి జీవిత విధానాలనూ తెలియజెప్పాలి. వారి సంస్కృతిలో నిలిచిఉన్న కొన్ని విలువైన అంశాలుగల సంప్రదాయ బద్ధమైన జానపదగేయాలను పరిచయం చేయాలి. వారిలో మౌఖిక రూపంలో ప్రచారంలో ఉన్న కథల్నికూడా గ్రంథస్థం చేసి వారికి అందుబాటులోకి తేవాలి. పదజాలం గురించి వారిలో ఉన్న బెరుకును పోగొట్టాలి. ఆయా తెగల్లో రాణించిన పూర్వ నాయకులు, ధీరోదాత్తులైన వీరుల కథలు బాలల కనువైన భాషలో రాసి అందించాలి. కథల్లో ఎక్కువగా ఆకర్షించేవి హాస్య, వినోద, సాహస కథలు... కాబట్టి ఆయా తరహా కథలకు ప్రాధాన్యతనివ్వాలి. ప్రాచీన కాలం నుండీ బాగా ప్రచారంలో  ఉన్న పంచతంత్ర, యాసపు, జాతక కథలు మొదలైన వాటిని సరళీకృతం చేసి అందించాలి.

పరమానందయ్య శిష్యుల కథలు, తెనాలి రామకృష్ణుని కథలు, అక్బర్-బీర్బల్‌కథలు... లాంటి కథల్ని వారి భాషలోకి పరివర్తన చెందించి అందించాలి. భట్టి విక్రమార్కుని కథలు, అరేబియన్ నైట్స్ కథలు మొదలైన వాటిల్లోని సాహసోపేతమైన కథల్ని, చక్కని శైలిలో పరిచయం చేయాలి".

పైవాటితో పాటు జానపద, సాంఘిక, పౌరాణిక, ఇతిహాస, వైజ్ఞానిక, చారిత్రక ఇతి వృత్తాలకు కూడా ప్రాధాన్యతనివ్వాలి. తాము నివసిస్తున్న రాష్ట్ర చరిత్రతోపాటు,మన దేశ చరిత్రనూ, ఇతరదేశాల గురించీ కూడా విరివిగా పుస్తకాలు రావాలి. వారిలో దేశభక్తిని పెంపొందించాలి. దేశనాయకులు, స్వాతంత్ర్య సమరయోధులు మొదలైన వారి గురించి జ్ఞానాన్ని పెంచే విషయాలు కూడా చెప్పాలి. దైవభక్తిని పెంపొందించేందుకు కూడా ప్రయత్నించాలి. వారు పూజించే దేవతలు, జరిపే జాతరలు, ఉత్సవాలు, నృత్యాలు, మొదలైన వాటిని కూడా పరిచయం చేయాలి. అన్నింటిలో కల్పన, వినోదం, మానవత్వం, చమత్కారం, పర్యావరణం, మతసామరస్యం, భూత దయ, ప్రేమాను రాగాలు, సహానుభూతి, పెంపొందించే విధంగా తీర్చి దిద్దాలి. పద్యాలు, గేయాలు, పొడుపు కథలు, ఆత్మకథలు, నవలలు, లేఖాసాహిత్యం తదితర వైవిధ్యం ఉన్న ప్రక్రియలనూ పరిచయం చేయాలి.

"పిల్లల్లో పఠనాసక్తిని పెంపొందించడానికి, పఠనం, ఒక అలవాటుగా చేయడానికి, పిల్లలు అవసరాలను తీర్చ గలిగే సంఖ్యలో బాలసాహిత్యాన్ని అందించవలసిన అవసరం ఉంది. " అన్న దృక్పథంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సర్వ శిక్షా అభియాన్ తరపున వివిధ వర్గాలకు సాహిత్యాన్ని అందించే కార్యక్రమాన్ని చేపట్టింది.

విశాఖ, నిజామాబాద్, విజయనగరం, శ్రీకాకుళం, ప్రకాశం, పశ్చిమగోదావరి, ఖమ్మం, రంగారెడ్డి జిల్లాలలో గిరిజన బాలల కోసం వారి వారి భాషల్లో సాహిత్యం తయారు చేయటం జరుగుతున్నది.

ఆ పుస్తకాలలో పంచతంత్రం, జిల్లా వెలుగులు, దర్శనీయ స్థలాలు, జానపద కళారూపాలు, పాపాయి ఊసులు, పుణ్యక్షేత్రాలు మొదలైన ఇతి వృత్తాలు గల పుస్తకాలున్నాయి. ఇవి రూపొందితే ఈ పుస్తకాలే ఆయా భాషల్లో  తొలిబాలసాహిత్యం పుస్తకాలవుతాయి.

ఇలా గిరిజన బాలలకు సాహిత్యాన్ని అందించేందుకు

**చెంచుల జానపదకథ**



# చేప - తాబేలు- కప్ప





ఒకానొకప్పుడు చేప, తాబేలు, కప్ప ఒక నదిలో కలుసుకున్నాయి. అలా అవి చాలా రోజుల తర్వాత కలుసుకున్నాయి. అందుకని ఒకరి క్షేమాలు, ఒకరు తెలుసుకోసాగారు. "సోదరా! నీవు ఎలా ఉన్నావు? చాలా రోజుల వరకు నిన్ను చూడటం పడలేదు." "సోదరా! నీవు ఎక్కడ వున్నావు? ఏం చేస్తూ వున్నావు?"

ఈ విధంగా ఒకరి నొకరు పలుకరించుకున్నారు.

"సోదరా చేపా! నీవు ఈ నదిలో ఎంత కాలం నివసిస్తావు?" అని తాబేలు అడిగింది.

"ఓహ్! నేను చాలా పెద్దదానిని. నున్నగా మెరుస్తూ ఉన్నాను. తప్పకుండా నూట పది సంవత్సరాలు ఈ నదిలో నివసిస్తాను" అని చేప జవాబు ఇచ్చింది.

చేప మళ్లీ తాబేలును అడిగింది. " సోదరా! తాబేలూ...నీవు ఈ నదిలో ఎన్నాళ్ళు నివసించబోతున్నావు?"

"ఓహ్! అన్ని అపాయాల నుండి రక్షించుకోగల గట్టి పెంకును కలిగి ఉన్నాను. అందువలన తప్పకుండా వేయి పది సంవత్సరాల వరకూ నివసించగలను." అని తాబేలు చేపకు బదులుఇచ్చింది.

తరువాత "సోదరా! కప్పా! నీవు ఎంతకాలం జీవించగలవు" అని తాబేలు కప్పను అడిగింది.

"నేను ముసలిదానను. నేను ఏ రోజునైనా చనిపోవచ్చు. బహుశా ఈ రోజు లేక రేపు ఎవరికి తెలుసు?" కప్ప జవాబు ఇచ్చింది

అవి ఈ విధంగా మాట్లాడు కుంటూ ఉండగా ఓ చేపలు పట్టేవాడు ఆ నది ఒడ్డుకు వచ్చాడు. వలను నీటిలో విసిరాడు. చేప, తాబేలు, కప్పలు వలలో చిక్కుకున్నాయి. వలలో ఏం పడ్డాయో తెలుసుకోవటానికి బయటకు లాగాడు. వలలో ఉన్న చేపను చూసి సంతోషించాడు.

"ఇంత పెద్ద చేపకు తప్పకుండా మంచి వెల వస్తుంది". అని అనుకున్నాడు. చెట్టు నుండి ఒక చిన్న కొమ్మను విరిచి చేపనోట్లో నుండి దూర్చాడు. దానిని చెట్టుకు వేలాడదీశాడు.

తరువాత తాబేలు వైపు తిరిగాడు."ఇటువంటి తాబేలు పెంకుకు ఎంతో డబ్బు వస్తుంది." అని ఎంతో సంతోషించాడు. దానిని బోర్లా వేశాడు. ఓ పెద్ద రాయిని దానిపైన పెట్టాడు.

వల వైపు తిరిగాడు. మిగిలి ఉన్న కప్పను చూశాడు. "ఓహో! ఇది పనికిరాని జీవి. తినటానికి పనికి వచ్చే ఆకు పచ్చ రంగుల కప్పకూడా కాదు." అనుకొని ఆ కప్పను మళ్ళీ నదిలోకి విసిరివేశాడు. కప్ప ఎంతో సంతోషించింది. వెంటనే ఈదుకుంటూ దూరంగా వెళ్ళింది.

"ఓ సోదరా! చేపా, నీవు ఈ నదిలో నూట పది సంవత్సరాలు జీవిస్తానన్నావు. అది ఎలా సాధ్యం?" అని కప్ప చేపను అడిగింది.

చేప నోట్లో చెట్టు కొమ్మ ఉండటం వల్ల అది మాట్లాడలేక పోయింది.

కప్ప "సోదరా! తాబేలూ! మరి నీవు వేయి పది సంవత్సరాలు ఈ నదిలో నివసించగలను అన్నావు. అదెలా జరుగుతుంది?" అని గట్టిగా అరిచి ఆ తాబేలును అడిగింది. తాబేలు పొట్టమీద రాయి ఉన్నందువల్ల అది మాట్లాడలేకపోయింది.

"మంచిది' అని కప్ప అన్నది."నేను ఈ రోజు చనిపోతాను, లేక రేపు చనిపోతాను, అని చెప్పాను. నేనింకా బ్రతికే ఉన్నాను. నేను ఎంతో అదృష్టవంతుడిని" అని ఈదుకుంటూ వెళ్ళిపోయింది.

**(మూలం: ఫురెర్ హైమండార్ఫ్ వాన్, అనుసరణ: రెడ్డి రాఘవయ్య)**

---

ముందుగా 1,2 తరగతులకు కథా కార్డులు, కథావాచకాలు తయారయ్యాయి.ఖమ్మం జిల్లా వారు కోయ భాషా బాలల కోసం తయారు చేసిన కథా పుస్తకాలలోని కొన్నికథల పేర్లు గురించి తెలుసుకుందాం!" పెద్దల మాట, వేట, అడవితెపిట్ట (అడవిలో పిట్ట) ఎత్తేవేట (ఏటిలోవేట) పేదరాశి బెరియద్వాకథ (పేదరాసి పెద్దమ్మ కథ (వేట గానినే కథ (వేటగాని కథ) నిల్వ మందాని తిండి (నిలువ ఉన్న తిండి) పిల్లాన్‌తెల్వ్ (పిల్లల తెలివి) పెంపాడు జీవాకు (పెంపుడు జీవాలు) కాకాడ్ –నక్క (కాకి–నక్క) ఇలా వున్నాయి.

కోయ భాషలో కుక్కను "నెయ్" లేక "నయ్యూ" అంటారు. "మాంసం"ను "అవ్వి" అంటారు. మన కథల్లో ఉన్న "కుక్క మాంసం ముక్క" కథను వాళ్ళ భాషలో "నైయ్యి – అవ్వి" అంటూ రాశారు. దానిని పరిశీలిద్దాం.

"బర్రో నైయ్యి దేకీ అవ్వి ముక్క దొర్క్తె, ఆ అవ్వి ముక్క వేన్ పాటె కచ్చి ఎత్తె పొర్రొతత్తె బల్ల కట్టుదాటోరె, మత్తె ఆ నైయ్‌దె నీడ ఇంకొర్రొ నైయ్‌న తోస్‌తె, ఆ అవితిన్ కూడ లాగీ తిందంజోర్ "భౌ...భౌ" భుచ్‌తె. పాటె మత్తె అవ్వి ఎత్తె అరిసత్తె".

దీనికి తెలుగులో రూపం "కుక్కకి మాంసం ముక్క దొరికింది, అది వంతెన మీద పోతుండగా, దాని నీడ నీటిలో ఇంకొక కుక్కలాగా కనబడింది. ఆ కుక్క దగ్గిర ఉన్న మాంసం ముక్కను కూడా లాగి తినాలని 'భౌ... భౌ" మని మొరిగింది. నోటిలో ఉన్న మాంసం ముక్క నీటిలో పడిపోయింది!!

ఇదండీ సంగతి! నల్లమల చెంచులు "చెప్పుకునే ఒక జానపదకథను తెలుగులో పైన చేర్చడం జరిగింది. దానిని కూడా చదవండి.

ప్రభుత్వం వారి ప్రయత్నాలలో గిరిజన బాలసాహిత్యం, ప్రచురించబడి.... ఆయా బాలలకు అందుబాటులోకి వస్తుందని ఆశిద్దాం!.

**( ఈవ్యాస రచనకు తోడ్పడినవారు. డా॥ ఎన్. ఉపేంద్రరెడ్డి గారు, స్టేట్ అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్, వాడ్రేవు చినవీరభద్రుడు గారూ సంయుక్త సంచాలకులు, గిరిజన సంక్షేమశాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, జి.వి.రమేష్, ఎం.ఎల్.ఇ. లింగ్విస్ట్, సర్వశిక్షా అభియాన్, వారికి కృతజ్ఞతలు)** ●

## కవిత

# ముందడుగే మనుగడ



**ఆచార్య నరేంద్ర**

ప్రేమంటే
ఇదేనా?
నన్ను నేను
ప్రేమించని వాణ్ణి
ఇంకెవర్ని
ప్రేమిస్తాను?
స్వార్థమే
ప్రేమయితే
నాకెందు కది?
రాజకీయ
రొంపిలో
దిగమంటే
నాకెందు కన్నాను!
మీడియాతో
దోస్తి చేయమంటే
నాకేం తెలుసని
మిన్నకుంటే
నేరమన్నారు!
ఈ లోకంలో
మోసాన్ని
జయించాలని
అనుకుంటే
నేనసమర్థుణ్ణనుకొని
దూరం చేసారు!
భూకబ్జా కోసం
మంత్రి రమ్మంటే
పోనందుకు
జైల్లో వేసారు!
నే కోరిన
నా వాళ్ళేనాకు
దూరమయితే
ఇంకెందుకీ
జీవితమని
ఆత్మహత్యే
మూలమా?
కాదు. కానే కాదు!
జీవిత బధ భాగ్నిని
చల్లార్చడానికి
కఠినుడవ్వాలి!
లోకంలోని
కుళ్ళ కుతంత్రాల
కడిగేసే
మనో ధైర్యంతో
అడుగు
ముందుకెయ్యాలి!
అమానుషాన్ని
మానుషము
చేసే ధైర్యం
కావాలి!
ముందడుగేసే
మానసికత
లేకుంటే
మనుగడేముంది?

# తపోయోగం!

**గుర్రాల రమణయ్య**



అనంత విశ్వంలోని
నిశ్శబ్దాన్ని
ప్రసన్నం చేసుకోగలమా!
గుండె గుడిలో కదలాడే
రాగవిరాగాలను
ముంగిట్లో నిలుపగలమా!
తీయ తేనియలు పల్లవించే
వసంతాగమనాన్ని
అడ్డుకోగలమా!
యెదలో ఉప్పొంగే
ప్రేమానురాగాన్ని
ఆగమంటే ఆగుతుందా!
సహజ నైజాన్ని
నటించమంటే సాధ్యమా!
స్వతహాగా ఉద్భవించే శక్తిని
కొంత తడవు ఎదుర్కోగలమా!
సహజ కవితాధురంధరుని
కవితాకన్యతో
సరాగాలొద్దని వారించగలమా!
అది
జన్మతా అణువణువున
అనుక్షణం ముచ్చటించే
ఒక తపోయోగం!
అతని నిరంతర
కవితాగాన కృషి!
నరనరాల జీర్ణించిన
కవితామాధురిని
తనవిధీర గ్రోలినాక
మనసు
నిండుగా శ్వాసించాల్సిందే!

# సంవత్సరానికి...

**డా॥ ఎస్. షమీఉల్లా**

నాలుగాకులైనా
రాల్చిఉంటే
బ్రతుక్కి అర్థమన్నా చేకూరేది
ఈ పాటికి
రోజూ కాకపోయినా
ఏ యేటి కాయేడు
ఆకులన్నీ రాల్చి
తనను తాను ప్రక్షాళనం చేసుకొంటుంది.
చెట్టు - కణుపు, కణుపుని పగల్దీసి
ఏటేటా ఒళ్ళంతా వసంతం
నింపుకుంటుంది
ఒకటా! రెండా? అనాదిగా
మర్నేనూ...
ఉన్న ఆకులకు తోడు
కొత్త ఆకుల కుబుసం తొడుక్కుంటూ
ముదిరి ముస్తాబవ్వడం మినహా
కనీసం
పిడికెడాకులు రాల్చుకున్న స్పృహ
నాలో ఎక్కడా కన్పించదు
ఇప్పటికీ



# చేతనుడు

**అడిగోపుల వెంకటరత్నమ్**

అతడు ఎప్పుడూ ప్రయాణమే
కూర్చొని నడుస్తూ వుంటాడు
నడుస్తూ పరుగెత్తుతూ వుంటాడు
పరుగెత్తుతూ పైకి ఎగురుతూ వుంటాడు
సముద్రాన్ని ఒడకు కట్టి గట్టుకు లాగుతాడు!
రహదారులు నిర్మించబడతాయి
లోతులు కొలిచి రాతిని గుర్తించి
ప్రమాద సంకేతాలు నాటబడతాయి
సముద్రం సంపద ముంజేతి
కంకణమౌతుంది!
నదికి ముక్కుతాడేసి
కరకట్టలు దాటిస్తాడు
మిట్ట పల్లాలు మునిగి
రిజర్వాయర్లు తయారౌతాయి
పంట కాల్వలు పొలాలకు పారి
పసిడి పండుతుంది
దప్పిక చిరునామాల
దాహార్తి తీరుతుంది!
సౌరకుటుంబంలో బాటసారై
గ్రహాల్ని ఉపగ్రహాన్ని



అడ్డుకోత పటం గీస్తాడు
గాలి నీరు ఉనికి తెలుస్తుంది.
రాళ్ళ రప్పలు చరిత్ర చెబుతాయి
జీవజాడల రహస్యాలు విప్పుతాయి
భూమ్యాకర్షణ శూన్యాలు
పాఠాలు నేర్పుతాయి!
పారిపోయే జారిపోయే
నిద్రలో నిలిచిపోయే
మాచకమ్మ మేఘాల్ని పట్టుకుంటాడు
ఉన్న తడి ఊడ్చే వరకు
మనిషి చేతిలో మర బొమ్మలౌతాయి
ఎండిన నేలకు ఎండిన భూమికి
ప్రాణం పోస్తాయి
మనిషి శోధకుడు
చోదకుడు
నిషణుడు
నిర్వర్తకుడు.....

# సాహసి

◆ కథ

■ ఎ. అన్నపూర్ణ



*"యాదగిరీ... రాజస్థానంట అదేదో వేరే దేశమంట. అక్కడ కూలీ పన్లకి చాలా మంది జనం కావాలంట. మనూరి వాళ్ళు రెండు లారీల్లో ఎల్తున్నారు. నేనూ ఎల్తన్నా. నువ్వు కూడా రారాదూ? అడిగాడు రాజేషు.*

భార్యా పిల్లలతో ఎల్లాలా, కూలీ పైసలు ఎంతిస్తారంటా?

"మొగోల్లకి రోజుకు ఐదు వందలు. ఆడోళ్ళకి రెండొందల ఏబై. పిల్లలకైతే వందా, ఎనభై, పనిని బట్టి బాగానే ఇస్తారు. నెల తిరిగేసరికి ఎంత లేదన్నా పదిహేను వేలు ఏసుకో! అన్నాడు రాజేషు.

"అబ్బో బాగుందే! అయితే ఏం చేయాలో చెప్పు". అన్నాడు యాదగిరి.

"రేపు పటేలు దగ్గరికి తీసుకెడతా పేరు రిజిష్టరీ చేస్తాడు. వివరాలు చెబుతాడు. నాతోరా! అంటూ చెప్పి వెళ్ళాడు రాజేషు.

చంద్రమ్మకి విషయమంతా చెప్పి కూతురు బిజిలీని కూడా తీసుకెడదాం అన్నాడు. కొడుకు మున్నాని అక్కడే ఇంగ్లీషు స్కూల్లో వేద్దాం అన్నాడు.

చంద్రమ్మకి గుండెల్లో బండ పడింది. బిజిలీ తెలివైంది. చదువంటే ప్రాణం. వచ్చే ఏటికి పదిలోకి వెదుతోంది. ఇప్పుడు చదువు మాన్పించి కొత్త చోటుకి తీసుకెళ్ళడం. అదీ కూలి పని చేయించడం సుతారమూ ఆమెకి ఇష్టం లేదు. ఈ మాటే చెప్పింది. "బిజిలీకి బండపన్లు చేతకావు. దానికి చదువుకోవడమే ఇష్టం!!

"నాలుగు రోజులు పోతే అదే అలవాటు అవుతుంది. ఇలా సంపాదించే అవకాశం రావడం అదృష్టం. మాటాడక సిద్ధంగా వుండమని" హెచ్చరించాడు.

మర్నాడు రాజేషు, పటేలు దగ్గరికి తీసుకెళ్ళి పేరు నమోదు చేయించాడు. మళ్ళీ వారానికే ప్రయాణం ఖరారైపోయింది. లారీల్లో బైలుదేరే ఏర్పాట్లూ జరిగిపోయాయి.

చంద్రమ్మ అత్త యాదమ్మతో విషయమంతా చెప్పి భోరుమంది.

"నువ్వే దిగులు పడమాక! నేను బతికుండీ బిజిలీని పంపనే పంపను ధైర్యంగుండు" అంటూ భరోసా ఇచ్చింది, యాదమ్మ.

కొడుకు ప్రయాణం మాట చెప్పినపుడు 'మంచిగా ఎల్లిరండి' అంది. అయితే బిజిలీని తీసుకెడుతున్నానని యాదగిరి చెప్పలేదు. చంద్రమ్మనైతే భయపెట్టి ఒప్పించాడు కాని తల్లితో చెప్పాలంటే ధైర్యం చాల్లేదు. ఎళ్ళటానికి తయారైనాక పదిమంది ముందూ మాటాడదులే అనుకున్నాడు.

ఊరి పొలిమేరలో లారీలు సిద్ధంగా వున్నాయి. ఒకక్కరే ఆ ప్రాంతాలకు చేరుకుంటున్నారు.

యాదగిరి భార్యా, బిడ్డల్ని తొందర చేశాడు. "పదండెహె... ఇంకా సిద్ధంకాలే అంటూ రంకెలేశాడు.

"అమ్మా నేను పోనే! చదూకుంటానే అంటూ కన్నీళ్ళు పెట్టింది, బిజిలీ.

"ఆ సదువుకుందూగానీ నీ కోసం అక్కడ కలట్టరుద్యోగం ఎదురుగ్గా వుంది. ఎవడు సెప్పిపెట్టాడే నీకు? డబ్బు సంపాదించుకునే దారి కనబడ్డప్పుడే సంపాయించాలి.

లేకుంట ఎట్టా గడుస్తాదీ. అన్నాడు నచ్చచెప్పే ధోరణిలో యాదగిరి.

"పోనీ హైస్కూలు చదువన్నా పూర్తి కానీయరాదూ..." భయంతో గొణిగింది చంద్రమ్మ.

"అంతటితో ఆగుతాదా? సారువాళ్లతో చెప్పిస్తాది. కాలేజీకి పోతానంటది. మున్నాగాణ్ని సదివించాలా ఆడికో బతుకు తెరువు సూపాలా?

"చదువుకి ఆడ మగా తేడా ఎందుకు నాయనా. నేను మంచిగా చదివి వుద్యోగం చేసి తమ్ముణ్ణి చదివిస్తా కదా!"

"ఇదేవన్నా సినిమాయా హీరోయిన్లా కలట్టరుద్యోగం చేసేడానికి? అయన్నీ గొప్పోళ్ళకి మన బతుకులు ఇంతే!

"అదేం లేదు. అందరికీ చదువుకునే అవకాశం వుందని మా టీచర్లు చెప్పారు. మనమే భేదాలు చూపించుకుంటున్నాం."

"నీకు మా బాగా నూరిపోశారే! నా మాటకి ఎదురు చెబుతావ్. నోరుమూసుకుని రెడీకా!"

బిజిలీ అక్కడ్నించి కదల్లేదు. కళ్ళు తుడుచుకుంటూనే చేతిలో వున్న క్లాసు పుస్తకాన్ని చదువుతోంది.



చంద్రమ్మ కడుపు తరుక్కుపోయింది. దిగులుగా అత్త దగ్గరికి పోయింది.

చంద్రమ్మని తండ్రి గారంగానే చూశాడు. తన కూతురు చదువు కోవాలని పదో క్లాసు చదివించాడు. పన్నెండో తరగతికి పట్నం పంపే ఏర్పాట్లు చేశాడు. దురదృష్టం తరుముకొచ్చి పొలాలకు నీరు పెట్టడానికి మోటారు ఆన్ చేస్తే చెడిపోయిన మోటార్ షాక్ తగిలి ప్రాణాలు వదిలాడు. అప్పటికే అనారోగ్యంతో తల్లి తీసుకుంటోంది. ఆమె మందులకీ, పంటల కోసం చేసిన అప్పు తీర్చడానికి పనికి వెళ్ళాల్సి వచ్చింది చంద్రమ్మ. యాదగిరి కూడా అక్కడే తోటమాలిగా పనిచేసేవాడు. చంద్రమ్మను చూసి ఇష్టపడి యజమానురాలితో చెప్పాడు. కానీ అప్పటిదాకా చంద్రమ్మ పెళ్ళి చేసుకోనంది. ఆ తర్వాత ఇద్దరికీ పెళ్ళయింది. రెండేళ్ళ తర్వాత యజమానురాలికి వేరే ప్రాంతాలకి బదిలీ కావడంతో ఆ కుటుంబం వెళ్ళిపోయారు. అదే సమయానికి గ్రామంలో వుండే యాదగిరి అమ్మా, అయ్యలు అనారోగ్యం బారిన పడటంతో వారికి తోడుగా చంద్రమ్మ, యాదగిరీ పల్లెకి వచ్చేశారు. బిజిలీ మున్నాలు పుట్టారు. తిండికీ, బట్టకీ, తలదాచుకునేందుకు లోటు లేకుండా బాగానే గడిచిపోయింది. ఈ సంవత్సరం వర్షాలు లేక కరువు కాటం వచ్చిపడి పరిస్థితి దిగజారిపోవడంతో దూరపు రాష్ట్రానికి కూలీ పన్లకి పోవాలని వూళ్లో వాళ్ళు సిద్ధమయ్యారు.

రాజేషు ఎంత సంపాదించుకోవచ్చో లెక్కలు చెప్పినప్పట్నించీ యాదగిరికి డబ్బాశ పెరిగి, చివరికి కూతుర్ని వెంటపెట్టుకుని పోవడానికి సిద్ధమయ్యాడు. వృద్ధాప్యంలో వున్న అత్తా మామలను వదిలి పోవడం చంద్రమ్మకి ఇష్టం లేదు. అయితే యాదగిరి మనసు మార్చడం సాధ్యమూ కాదు. వేరే దారీ లేదు. బిజిలీని ప్రయాణం మాన్పించడానికి అత్తా కోడలూ కలిసి ఆలోచన చేశారు. లారీలు బైలుదేరే టైం కావడంతో యాదగిరి తల్లితో చెప్పడానికి ఆమె గదిలోకి వెళ్ళాడు.

"అమ్మా మనం చాలా ఇబ్బందుల్లో వున్నాం. వూరివాళ్ళతో బాటు నేనుకూడా వేరే ప్రాంతానికి కూలీకి వెడుతున్నాను. మంచిగా పైసలు సంపాదించుకునే అవకాశం వచ్చింది. మేం తిరిగి వచ్చేదాకా మన పొరుగువాళ్ళు మీ ఇద్దర్నీ కనిపెట్టి వుంటారు. నెలకి అయిదు వేల రూపాయలు నీ మందులకీ అవసరాలకీ పంపుతాను. జాగర్తగా వుండు." అన్నాడు.

"అట్టానే వెళ్ళిరా బిడ్డా! బిజిలీ తోడున్నాదిగా అంది యాదమ్మ తెలివిగా."

"అదేంటమ్మా బిజిలీ మాతోబాటే వస్తుందిగా...! అన్నాడు యాదగిరి ఆశ్చర్యంగా. అంతదాకా సౌమ్యంగా వున్న యాదమ్మ రౌద్రరూపం దాల్చింది.

"ఏందిరా వయసొచ్చిన బిడ్డని ఎంట బెట్టుకొని ఏడకో వెళ్ళటానికి సిగ్గులేదూ?

మేం కాటికి కాళ్ళు సాసుకున్నోళ్ళం... సరే... పొరుగోళ్లకి అప్పగించావ్. నీ దారిన నువ్వు పోతున్నావు. పో! కానీ బిజిలీ రాదు. అంతే! అంటూ విరుచుకుపడింది. అదిరిపడ్డాడు యాదగిరి.

తల్లి ఎప్పుడూ ఇంతగా కోపగించలేదు. అందుకని అతను కొద్దిగా జంకాడు. ఒకడుగు వెనక్కి వేశాడు.

"అదికాదే.. నువ్వా ముసిలిదానివి...అయ్యకా కళ్ళు మసకలు పడ్డాయి. ఆడపిల్లతో ఎట్టా వేగుతావని తీసుకెళ్ళాలనుకున్నా... అన్నాడు. 'కూలిపనికి అంటే అక్కడే నరుకుతా నంటుందని భయమేసి.

"ఏటి నేను కాసుకోలేనూ? నీ ఏసాలు నాకు తెలియవనుకోకు. నీకు డబ్బు యావ పట్టుకుంది. మస్తుగా పైసలు సంపాదించాలని ఆశపడుతున్నావ్. మంచిదే నువ్వూ, నీ పెళ్ళాం సంపాదించుకోండి. నీ ముద్దుల మగ బిడ్డని ఇంగ్లీషు చదువు చదివించుకో. ఆడబిడ్డని చులకన చేసి కూలి పని చేయిస్తావంటారా? అది మాత్రం పడనీయను. ఈల్లేదంతే! అంటూ రంకెలు వేసింది.

"ఓయ్ యాదగిరి ఇంకా ఎంతసేపు? అందరూ రెడీ! నీదే ఆలస్యం!" అంటూ కేకపెట్టాడు పటేలు.

ఆ పక్కన పటేలు ఈ పక్కన యాదమ్మ ఒకేసారి గొడవ చేస్తుంటే పాలుపోని యాదగిరి "అమ్మా నా మాటినే ఒక్క సంవత్సరంలో తిరిగొచ్చి, బిజిలీని నీకాడ వదులుతా. ఇప్పుడిక గోల చెయమాకు. పేచీ పెడతావేందే" బతిమాలే ధోరణిలో అన్నాడు యాదగిరి.

"నీ కల్లిబొల్లి కబుర్లు నా దగ్గర సాగవ్. బిజిలీని నేను చదివిస్తారా! నీ దారిన నూ పో! అంది కఠినంగా యాదమ్మ.

ఇక చేసేది లేక బైలుదేరాడు యాదగిరి. పొరుగువారికి అప్పగింతలు పెట్టాడు.

"యాదగిరీ మీ అమ్మా అయ్యల గురించి ఏం బెంగలేదు. మేం చూసుకుంటాం. కానీ అయిన వాళ్ళంటూ వుండటం మంచిది. బిజిలీ కూడా బాగా చదువుతోందని స్కూల్లో మాస్టరు గారూ చెబుతున్నారు. మీ అమ్మ అయ్యల కోసం సిటీ నుంచి వచ్చేవు. ఇప్పుడు ఒంటరిగా విడిచి వెళ్ళడం మంచిదీ కాదు. మీ అమ్మ మంచి మాట చెప్పింది. ఆవిడ మీరు రాక ముందు ఒంటిచేత్తో అన్నీ చక్కబెట్టుకున్న తెలివైన మనిషి. ఇప్పట్లో ఆమె ఆరోగ్యానికేమీ ఢోకాలేదు. అందుకే అంతరాలు చెరిపేసి బిజిలీని చదివించాలని పట్టు పట్టింది. ఆవిడ వయసుకి మెచ్చతగిన ఆలోచ చేసింది. బిజిలీని బాగా చదువుకోనీ, నువ్వు సుకంగా వెళ్ళిరా! అంటూ వీడ్కోలు చెప్పారు. చంద్రమ్మ అత్త కాళ్ళకు నమస్కరించి కృతజ్ఞతగా చూసింది.

భర్తతో బాటు నిశ్చింతగా లారీ ఎక్కింది. ఆనందంతో బిజిలీ నాయనమ్మను కౌగిలించుకుంది. విజయ దరహాసంతో మనవరాల్ని గుండెలకు హత్తుకుంది యాదమ్మ. అవును యాదమ్మ ఆడ-మగ అంతరాన్ని చెరపేసిన సాహసి

●

# సాహితీ స్రవంతి

## బొమ్మరాత యల్లయ్య



పల్లవి: సాహితీ స్రవంతీ.... సాహితీ స్రవంతీ
సాహిత్యపు సౌరభాలు గుబాళించు చేమంతి
అరుణారుణ ప్రాంగణాన విరబూసిన పూబంతి
నవ్య భవ్య పథం వైపు నడిపించే దివ్యక్రాంతి
కోరస్: స్రవంతి... స్రవంతి... స్రవంతి... (సాహితీ)
చరణం: అభ్యుదయ భావ కవులు
సమ సమాజ హితైషులు
కలమును వడి హలము చేసి
సాహితి సేద్యము చేసి
రచన రణం గావించెడు
అగ్ర గణ్యులందించిన
అక్షరాయుధముల చేత
అవినీతిని బరి మార్చెడు
కోరస్: స్రవంతి... స్రవంతి... స్రవంతి... (సాహితీ)
చరణం: సమాజాన్ని పీడించే
సమస్యల్ని వివరించి
సమంజసమ్మైనట్టి
విధానాల సూచించి
ప్రజలను చైతన్య పరిచె
రచనలెన్నో వెలుగుతెచ్చి
జాగృతినీ ఎరుగ నట్టి
జనావళీ వెన్ను తట్టె
కోరస్: స్రవంతి... స్రవంతి... స్రవంతి... (సాహితీ)
చరణం: సామ్యవాద సమైక్యతా
సమున్నతా భావాలను
అక్షర బద్ధం చేసి
అనుగమించు రస వాహిని
అణగారిన జనం పైన
జరుగు అక్రమాల పైన
కలం కన్ను ఎర్ర చేసి
నిజం వైపు నిలిచి సాగే
కోరస్: స్రవంతి... స్రవంతి... స్రవంతి... (సాహితీ)

# మౌనీలు (నానీలు)

## డా॥ మౌని



ప్రేమంటే
'అదే' అనుకున్నా
"మదర్ థెరిస్సా" కథవిని
మౌనముద్ర దాల్చా.....

కడుపు
తరుక్కుపోయింది
బిడ్డ కడుపుచూచి
తల్లిపేగు చెమర్చింది

గుండె (ఎస్) మార్కు
బ్లడ్‌లో పిరికితనం
ఇక బైపాస్ చేసినా
"వేస్టే"

రైలు తల్లికి
పెట్టెల నిండా బిడ్డలే
చివర్లో ఒక్కడూ
తోడుండడు...!

నమ్మకమే
ఆస్థి అనుకొన్నా
అదేమిటో
అదికూడా కరిగిపోతుంది

ధనమా...? కులమా....?
.... రెండూనూ...!
అయితే ఈదేశం నీదే
ముమ్మాటికీ...!

నీళ్ళ కడవ, కాకి
రాళ్ళునింపుతూ
రాయలసీమ గుర్తొచ్చి
నిట్టూర్చింది

పొగరు తలకెక్కిందా?
కళ్లు కనబడవు
పాపం! కళ్లుండీ
కబోది

మనిషి నరాల్లో
పారేది
నెత్తురా? కాదు
అవకాశవాదం

నంగిమాటల్లో
గూని నడకల్లో
వ్యక్తిత్వం గుండుసున్న
తాటిచెట్టే మేలన్న!

అది... కొండ
"కో" అంటే "కో"... అంది
చెవులు, నోరుండే వారికంటే
మేలే కదా!

సింహాసనంపై
చీకటి
దానిపాలన ఎంత సేపు?
సూర్యుడొచ్చే వరకే...!

# జీవితం

## ఊర్వశి

పరుగుల జీవితం
పరుగెత్తే జీవితం
పడి పడి లేచే జీవితం
పరుగెత్తలేని జీవితం
వడి వడి చేసే జీవితం
పండు టాకుల జీవితం
పండంటి జీవితం
బ్రతుకు పండని జీవితం

బతుకులు ఎండిన జీవితం
గతుకుల జీవితం
అతుకుల జీవితం
కులాన్ని పాలించి, శాసించే
జీవితం
బ్రతకనివ్వని
బ్రతుకు నివ్వని జీవితం
అయినా.....
అది జీవించే జీవితం.

◆ కథ

# ఇంటింటి కథ

■ మీనాక్షి శ్రీనివాస్



***"ఇదిగో...రామం....యిప్పుడంత ఏం కొంప మునిగిపోయిందని ఆ శోకన్నాలు... కాస్త యింక ఆ ఏడుపాపి... ముఖం కడుక్కుని...వంట చేసి అఘోరించు... ఆకలితో యిహనో యిప్పుడో అన్నట్లున్నాను." కాస్త గట్టిగానే కసురుకున్నాడు జగన్నాథం.***

***"ఆకలా....మీకు నోరెలా వచ్చింది ఆ మాట అనడానికి... అసలే పిల్లలు అంతంత దూరాభారాలు వెళ్ళిపోయారని నేనేడుస్తుంటే..." మళ్ళీ అందుకుంది రామలక్ష్మి.***

"బానే ఉంది సంబడం...మొన్నటిదాకా వాళ్ళబ్బాయి అమెరికాలో ఉన్నాడు. వీళ్ళబ్బాయి జర్మనీ వెళ్ళాడండోయ్... గోపాలం గారి అల్లుడు ఆస్ట్రేలియాలో ఉద్యోగం అట...శివానందం గారి చిన్నమ్మాయి జపాన్ వెళ్ళిందట..." అంటూ అంతర్జాతీయ వార్తలు తెగ వినిపించావు. నా ప్రాణం తీసి పల్లెలో ఉన్న పదెకరాలు... ఉన్న కాస్త యిల్లు తెగ నమ్మించి మరీ నీ కొడుకుని అమెరికా పంపించావు కదా... మరి యిప్పుడెందుకే ఏడుపు... ఇన్నాళ్ళు పంపలేదని... తండ్రిగా వాళ్ళ నుద్ధరించలేదని ఏడ్చావు.. సాధించావు...యిప్పుడింక ఇదో ఏడుపా.. నా ముఖానికింత తిండి తిప్పలూ లేవా...లేకేం... తిండి మాటెలా ఉన్నా తిప్పలకి లోటేమిటి... మహారాజులా ఉన్నాయ్.." ఏడవలేకనవ్వుతూ అక్కసు వెళ్ళగక్కాడు జగన్నాథం..

"అది కాదండీ... ఏదో కొన్నాళ్ళుండి నాలుగు రాళ్ళు వెనకేసుకుంటాడనుకున్నా గానీ... యిలా పెళ్ళాం. పిల్లలతో సహా అక్కడే ఉండి పోతాడనుకున్నానా ఏమిటీ.. అయినా వాడినని ఏం లాభం.. ఆ మహాతల్లి ననాలి... ఏ ముహూర్తాన పెళ్ళయిందో కానీ....పట్టుమని పదిరోజులు ఈ యింట గడపనీయలేదు పిల్లాడిని... "మళ్ళీ దుఃఖం ముంచుకొచ్చింది.

"ఏ ముహూర్తమేమిటే.. మనం మంచీ చెడ్డా చూసి పెట్టిన ముహూర్తమే.. అయినా యిదేదో యివాళ కొత్తగా నీకే అయినట్లు ఏడుస్తావెందుకు మన పెళ్ళయిన కొత్తలో వెధవ పల్లెటూరు... వెధవ పల్లెటూరు అంటూ నా కాళ్ళకింద నిప్పులేసి...పట్నం కాపురం పెట్టించలేదూ నువ్వు..."అప్పుడు ఆ పల్లెటూరు... ఆ అత్తమామలూ నీకు చేదయ్యారు యిప్పుడు ఈ వెధవ పట్నం... ఈ అత్తమామలూ నీ కోడలికి చేదయ్యారు.... పెద్దగా తేడా ఏం లేదు." ఎప్పటి నుంచో మనసులో ఉన్న మాట అక్కసు తీరా బయటకొచ్చేసింది జగన్నాథానికి.

"అనండి...అనండి...మీకు నేనేకదా లోకువ..ఏం పట్నం వచ్చి ఏం చేదుచేసారు...మీరు ఆ పల్లెటూరు వదిలి ఏదో ఆ నౌకరీ వెలగబెట్టబట్టే ఈ మాత్రంగా ఉన్నాం...మీ కొడుకూ ప్రయోజకుడు అయ్యాడు... లేకుంటే వాడూ మీ తమ్ముడి పిల్లల్లాగే ఉందురు" కాసేపు ఏడుపు మర్చిపోయి ఎటాకిచ్చింది రామలక్ష్మి.

"...ఆ.... అవేనే నేను చెప్పేదీనూ.. యిప్పుడు నీ కోడలూ అదే ముక్కంది.. పాపం అంతకంటే ఏం చేసింది వెర్రిపిల్ల, అది మాత్రం సాటి వాళ్ళంతా ఖండాంతరాలు వెళ్ళి కోటీశ్వరులై పోతుంటే .... పాపం వీళ్ళు మాత్రం చదివిన చదువుల్ని ... సంపాదించగల తెలివి తేటల్నీ వృధా చేసుకుంటారా... ఏమిటి? అది గాక అక్కడే పుట్టి పెరిగిన నీ మనమలు మాత్రం పాపం యిక్కడ ఎలా ఉండగలరు చెప్పు"..... ఇదిగో... ఏదో అర్భకుడిని... నన్నిలా హింసపెట్టకే కాస్త తిండి సంగతి చూడు... లేకపోతే నిష్కారణంగా చచ్చిపోతాను."

"మీ తిండి తగలెయ్యా... నన్ను తినండి పీడా పోతుంది." గయ్యిమంది. "అమ్మా... సుధా... యింక మీ అమ్మతో లాభం లేదు గానీ... కాస్త నువ్వయినా ఆ వంట సంగతి చూడు తల్లీ..."

అబ్బ.... ఉండండి నాన్నా ... నాకు రేపటి నుండి ఫైనల్ ఎగ్జామ్స్... నే చదువుకోవాలి... "అప్పటి దాకా స్టార్ టీవి ప్రోగ్రాం చూస్తున్న సుధకు సడన్‌గా పరీక్షలు గుర్తొచ్చాయి. లేచి టీవీ కట్టేసి గదిలోదూరి తలుపేసేసుకుంది.

"ఇదిగో ఈ పూటకు హోటల్ నుంచి తెస్తా గానీ... యింక ఆ ఏడుపాపి కాస్త నిదానించు"... రెండు రోజుల క్రితం కొడుకు ఫోను చేసి అమెరికా లోనే యిల్లు, అదీ కొనుక్కొని సెటిల్ అవుతున్నానని

చెప్పినప్పటి నుండీ కంటికి మంటికీ ఏకధారగా ఏడుస్తూనే ఉంది రామలక్ష్మి. నిత్యం యిలాంటివి ఎన్నో చూస్తున్న జగన్నాధానికి మాత్రం అదేం కొత్తగా అనిపించలేదు.



"వెధవ...వెధవన్నర వెధవ.... పాతికేళ్ళు పెంచిన తల్లి తండ్రి కంటే నిన్న మొన్న వచ్చిన 'అది' నెత్తి మీద దేవత అయిపోయింది. ఇదిగో వస్తాం అదిగో వస్తాం అంటూనే మూడేళ్ళు అయిపోయింది... కోడలు మనవలూ అంటూ ఫోన్లో ముచ్చట్లు వీడియో టేపులే కానీ ఆ పిల్ల వెధవల్ని కంటితో చూడనూ లేదు...ఓ... అచ్చటా ముచ్చటా లేదు... పెళ్ళాం చెబితే మాత్రం.... వీడి వివేకమేమయిపోయింది... కావాలంటే యింకా కొన్నాళ్ళుండి సంపాదించుకుని యిండియా వెళ్ళిపోదాం...పాపం... అమ్మా నాన్న... ఒకళ్ళనీ వదిలేసి యిక్కడెందుకు మనకీ యిల్లా... అని చెప్పడం మానేసి... తానా ... అంటే తందానా అని ఆడంగి వెధవ..."

"మరి వాడూ ఓ 'ఆడంగి వెధవ' కొడుకేగా... పాపం... ఏం చేస్తాడు" సన్నగా గొణిగాడు.

వినబడి... చురా చురా చూసింది కాల్చేసేటట్లు...

కాలం ఎవరి కోసమూ ఆగదు... అలాగే ఏ బాధ గడుస్తున్న రోజులతో బాటుగా కరిగిపోక తప్పదు.

సుధ ఇంజనీరింగ్ పూర్తయి... తనతో బాటే చదివే తన క్లాస్‌మెంట్ ఆనంద్ అంటే యిష్టపడటం... పెళ్ళి చేసుకుని బెంగుళూరు లోనే భార్యభర్తలిద్దరూ ఉద్యోగాలలో స్థిరపడటం జరిగిపోయింది.

"ఏవండోయ్.... దీనికేమయినా మతుందంటారా.... తరుగుతూ తరుగుతూన్న ఆనపకాయని అలాగే పట్టుకుని వంటింట్లోంచి వచ్చింది.

"దేనికి ఆనపకాయకా...చాకుకా" సీరియస్‌గా అడిగాడు జగన్నాధం. "మీ కంతా వేళకోళమే... మీ ముద్దుల కూతురి సంగతినే చెప్పేది" "ఏం ... దాని మతికేమయింది... బంగారం లాంటి పిల్ల..."

చేతిలో పేపరు తీసి పక్కన పెడుతూ అడిగాడు...

"వాళ్ళ... అత్తగారిని... మామగారినీ వాళ్ళతో బాటుగా బెంగళూరు లోనే ఉండమని ఎప్పటి నుంచో చెబుతున్నాం... యిదిగో యిప్పటికి సర్దుకుని వస్తున్నారు.... అంటూ తెగ సంబరపడిపోతోంది."

"మంచిదేగా... కనీసం వాళ్ళయినా కొడుకూ, కోడలూ మనవలతో ఉంటారు పైగా పాపం వాళ్ళూ పెద్ద వాళ్ళయిపోయారు... ఈ మధ్య ఆవిడ బాగా సుస్తీ పడ్డారట కూడా కదా" యిప్పుడేమంటావ్ అన్నట్లు అడిగాడు.

"అదే కదా చెప్పేది... అసలే ఉద్యోగం ... యిటు యింట్లో చాకిరి... యిప్పుడీ లంపటం కూడా ఎందుకూ అనే..."

"అందరికీ నువ్వూ... నీ కోడలే ఆదర్శం కాదుగనకే.. యింకా అక్కడక్కడ నాకూతుళ్ళ లాంటి వాళ్ళు కూడా ఉన్నారు.... అది చేసే మంచిపనికి తల్లిగా ఆనందించు... అంతే కాని అయినవీ కానివీ నూరి పోయ్యకు" "ఏం... నా వలన ఏం చేదుచేసారు... అయిన దానికీ కాని దానికీ నన్నాడిపోసుకుంటారు.. అయినా మీ వాళ్ళకు మనమేం తక్కువ చేసాం. నెలనెలా బిళ్ళ కుడుముల్లా డబ్బు పంపేవారు... మూడు నెల్లకి, ఆర్నెల్లకి వెళ్ళి చూసొచ్చేవారు...."

"చూడు రామం... పోనీ అప్పుడు చిన్నదానివి... అనుభవం, ఆలోచన లేదు... కానీ యిప్పటికీ అదే మాట... అదే తీరు తగదు... తల్లి దండ్రులుగా వృధాప్యంలో వాళ్ళు ఆశించేది... కొడుకు పంపే ముద్దకుడుములు .... చుట్టపు చూపు రాకపోకలూ కాదు. తమని పెంచి పెద్ద వాళ్ళని చేసిన పిల్లల ఆత్మీయత ... మమత పంచవలసినది.... అంతే కానీ వాళ్ళు విదిల్చే రాళ్ళూ కావు... దయా ధర్మం కాదు" కళ్ళ ముందు తల్లి తండ్రి పడిన ఆవేదన కథలాడగా బాధగా అన్నాడు.

"ఎంతసేపూ నన్నాడిపోసుకోవడమే గాని... మనం అంటే పోనీ ఉద్యోగ ధర్మంగా దూరంగా వచ్చేసాం కానీ... ఊళ్ళోనే ఉన్నారుగా మీ తమ్ముళ్ళు... చెల్లెళ్ళు... వాళ్ళేం ఒరగబెట్టారు. పెడసరంగా అంది.

"అదే మరి.. నలుగురున్న వాళ్ళకే పెద్దతనంలో ఒంటరితనం తప్పక పోతే యిక ఒకళ్ళూ... యిద్దరూ ఉన్న మనలాంటి వాళ్ళ గతీ చెప్పాలా... యింటికి పెద్ద కొడుకు.. ఉద్యోగాలు... ఊళ్ళేలాలి అని వెళ్ళిపోతే మనకేనా పట్టింది.... అంటూ తమ్ముళ్ళని రాచిరంపాన పెట్టి ... వేరింటి కాపురాలు పెట్టించిన మరదళ్ళు కళ్ళ ముందు మెదిలారు.

"బానే ఉంది సంబడం... వాళ్ళు చూడకపోతే దానికి నేనేం చేస్తాను. అయినా ఆ చెప్పేదేదో మీ తమ్ముళ్ళకు చెప్పాల్సింది.... అయినా ఏదో సామెత చెప్పినట్లు... వాళ్ళు కాలం చెల్లి వెళ్ళిపోయారు... కనీసం పోయే ముందయినా పట్టించుకోని మీ వాళ్ళంత బాగానే ఉన్నారు. మధ్యలో యిప్పుడు నన్నంటారేం..." ఆ గొంతులో కాస్తంత అయినా తప్పు చేసిన భావన మచ్చుకయినా లేదు.

"ప్చ్" యిప్పుడేం అనుకుని లాభం... అప్పుడే కాస్త గట్టిగా పట్టుబట్టి నిలబడాల్సింది... కొడుకుగా వాళ్ళు నా బాధ్యత... భారం కాదు అని... బహుశా... నేనే కాదు ప్రతి మగాడు... కొడుకు చేసే తప్పేనేమోయిది... భీష్ముడు శిఖండిని అడ్డుపెట్టుకున్నట్లు.... భార్యలను అడ్డుపెట్టుకుని తల్లితండ్రుల బాధ్యత వదిలించుకుంటున్నారా?

"బానే ఉంది... విషయాన్ని పక్కదారి పట్టించడం... మీ కొచ్చినట్లు ఎవరికీ రాదు... యిప్పుడు నే చెప్పేది ఏమిటీ.... మీరు మాట్లాడుతున్నదేమిటి... అయ్యో రామచంద్రా చదివేస్తే ఉన్న మతి పోతోందని..."

"నాకు మతి యిప్పుడు సరిగానే ఉంది. సుధ... ఆనంద్ చేసేది మంచి పని... ఆ పెద్దవాళ్ళు వాళ్ళకి బాధ్యతే కాని.... బరువు కాదు.... సరేకాని ఏమిటి ఈ వేళా మళ్ళీ ఆనపకాయేనా... చావగొడుతున్నావ్ మూడు రోజుల నుంచి.. ఎంత యింట్లో కాస్తే మాత్రం...."

మహానుభావా యింట్లో కాయని కాదు... యింటో యింకో కూర లేక... పేపర్ పట్టుకు కూర్చోవడం... నాకు నీతి పాఠాలు చెప్పడం తప్పితే యింట్లోకి ఏం కావాల్నా తమరు పట్టించుకుంటే

కదా..."

"నువ్వు చెబితే కదా నాకు తెలిసేది... అయిన నీ వార్తలహరి... అదే దేశ విదేశీయ ముచ్చట్లు చెప్పే కూరల బండీ అమ్ములు రావడం లేదా... లేకపోతే అది కూడా అమెరికాలో కూరలు అమ్ముకుంటే మంచిదని వెళ్ళిపోయిందా...."



"మీ కంత వెటకారమే... పాపం దాని కొడుకూ కోడలూ వీళ్ళతో గొడవపడి వేరే వెళ్ళిపోయారట... ఉన్నదంతా ఊడ్చి... కడుపు కట్టుకు చదివిస్తే... వాడు చేసిన నిర్వాకమిది... వెళ్ళిది.. తట్టుకోలేక పోతుంది. నాలుగు రోజులుగా కూరల బండీ వెయ్యడం లేదు."

"హతవిధీ"....భూమి గుండ్రంగా ఉందని ఎటు తిరిగినా ఈ పాయింటు దగ్గరేకే వస్తున్నాం... వర్ణ విభేదాలు... వర్గ విభేదాలు లేని యూనివర్సల్ ప్రాబ్లమ్ యిదొక్కటేలావుంది. "భిన్నత్వంలో ఏకత్వం... ఏకతాటి మీద నడుస్తున్నది ఒక్క ఈ విషయంలోనే అన్నట్లుంది. "సగం పరిహాసం... సగం పరితపం కలగలుపుగా అన్నాడు జగన్నాథం.

"బానే వుంది సంబడం... ఒళ్ళు కాలి ఒహడేడిస్తే... నీళ్ళు కాచుకుంటా నుండరా అబ్బీ అన్నాడట వెనకటి మీలాటి వాడే... చేతికందిన చెట్టంత కొడుకు... ఉద్ధరిస్తాడని ఉన్నదంత ఊడ్చి... చేతికందిన అప్పులన్నీ చేసి చదివిస్తే... ఏరు దాటి తెప్ప తగలేసిపోయాడు వాడు... మీకేమో అంతా వేళాకోళం... పైగా చచ్చు వెధవ వేరు పడటానికి కారణం చూడండి... తల్లీ తండ్రి కూరగాయలమ్ముకోవడం వాడికీ... పెళ్ళానికి చిన్నతనంగా ఉందట.. ఆ కూరలమ్మే కదా వాడినింత వాడిని చేసింది పోనీ అంటే యిన్నాళ్ళూ కష్టపడ్డారు యింకనే సంపాదించి సుఖపెడతా... కూరలు బండీ మానెయ్యండి అన్నాడా.... అది లేదు... నామర్దాగా ఉంది గాబట్టి వాడి పెళ్ళాన్ని తీసుకుని దూరంగా వేరే చోట ఉంటాడట... కృతఘ్నుడు....

"అంత పెద్ద పదాలెందుకులే... కన్నందుకు పెంచి పెద్ద చేయడం చదువూ సంధ్యా చెప్పించడం... ఆ కన్నవారి బాధ్యత... అయితే చిన్నప్పటి నుండీ మంచీ చెడ్డా చెప్పకపోవడం.... తామునడచిన దారిలోనే రేపొద్దున వాళ్ళూ నడుస్తారని గ్రహించకపోవడం అవివేకం. ఆ పెద్దాయనెవరో రాసాడు చూడు ఓ పాట.... 'తాత-మనమడు' అనుకుంటా.. "నాన్న... మరి నీకెందుకురా ఆ గొయ్యా..." మీ అయ్యకు చేసిన ఈ మరియాదా రేపు నీకు నే చెయ్యాలి గదయ్యా" అని... అంతే మనము చేసినప్పుడు తప్పనిపించనవి మన దాకా వస్తే తప్పులవుతాయి.... అదీ లోక సహజం యిది నాకు సహజమే.. ఆ కూరలు బుట్ట యిటియ్యి నే వెళ్ళి కూరలు తెస్తాను."

"ఏమిటో ఈయన ఎప్పుడే ఏం మాట్లాడినా అర్థం అయీ కానట్లుంటుంది...." సన్నగా గొణుక్కుంటూ కూరలు బుట్ట అందించింది.

"ఇదిగో... అమ్మాయి అన్ని రకాల కూరలూ తలో పావు... కాస్త మంచివి ఏరి వేసేయ్..." బుట్ట అందించేసి... పనయిపోయినట్లు నించున్నాడు జగన్నాథం.

"......మీరు ..... నువ్వు...... జగన్నాథం కదూ... కూరలు కొనడం అయిపోయి డబ్బులు అందిస్తూ... ఎప్పుడో ఎక్కడో విన్న గొంతులా అనిపించి యధాలాపంగా పక్కకి చూసిన ఆ పెద్దాయన ఆశ్చర్యంగా.... ఆనందంగా.... గాభాలున జగన్నాథం చెయ్యి పట్టుకు మరీ అడిగాడు... ఆలస్యం అయితే అతను వెళ్ళిపోతాడేమో అన్నట్లుగా.

"మీరు...మీరు... రంగడన్నయ్యా... అప్పటికే ఆయనను గుర్తుపట్టేసి ఆనందంగా అడిగాడు జగన్నాథం.

"అవునయ్యా... ఏమిటి నీవింకా ఈ ఊళ్ళోనే ఉన్నావా... ఎన్నాళ్ళయింది నిన్ను చూసి... సుమారుగా ఓ పదేళ్ళయిందనుకుంటా... పిల్లలు ఎలా ఉన్నారు... ఏమి చేస్తున్నారు?..."

"అంతా బాగానే ఉన్నారు కానీ... గగన్ ఎలా ఉన్నాడు? ఎక్కడున్నాడన్నయ్యా".... ఆత్రంగా అడిగాడు జగన్నాథం....

"ఇంకా ఎక్కడి గగన్... ఎనిమిదేళ్ళు అయింది వాడుపోయి తమ్ముడు జ్ఞాపకాలతో ఆ పెద్దాయన కంట నీరు తిరిగింది."

"గగన్... పోయాడా... ఎప్పుడు? ఎలా..." షాక్ అయ్యాడు జగన్నాథం.

"అయ్యగారు.. నూటయాభై అయింది... కూరలు బుట్ట అందిస్తూ అంది కూరలమ్మాయి.

"ఆ....ఆ....యిదిగో" గబగబా డబ్బు ఆ అమ్మాయి చేతిలోపెట్టి కూరల బుట్ట అందుకున్నాడు జగన్నాథం....

"రావయ్యా... చాలాకాలం అయింది మనం కలిసి... యిక్కడకు దగ్గరే మాయిల్లు... పదవెడదాం...." అంటూ చేయి అందుకున్నాడాయన

"అన్నయ్యా...గగన్...."

"చెబుతా... యిప్పుడేం మాట్లాడకు... పద..."

"చరమకాల విరామ విశ్రాంతి ఆశ్రమం" అన్న ఆర్చ్‌లో ముందుకు నడిచాడాయన... అదేదో ఆశ్రమం అని చూడగానే తెలుస్తోంది.. కానీ పేరే గమ్మత్తుగా ఉంది ఎన్నో వృద్ధాశ్రమాల గురించి విన్నాకానీ యిలాంటి పేరు యిదే మొదటిసారి.... మనసులోనే అనుకున్నాడు జగన్నాథం.

"అయ్యగారూ ఇదిగో మీరు యిచ్చిన లిస్టు ప్రకారం కూరలన్నీ, లోపల యిచ్చేయ్యమంటారా..." వీళ్ళు అక్కడకు చేరేసరికే సైకిల్ మీద పెద్ద గోనె బస్తాతో నా పక్కగా నిలబడి ఉన్నాడు ఒకతను. "అలాగే" అంటూ అతనికి సైగ చేసి జగన్నాథం చెయ్యపట్టుకుని ఓ పక్కగా తోటలో కుటీరాల్లా ఉన్న ఓ గది దగ్గరకు తీసుకెళ్ళాడు. మంచినీళ్ళు తాగి సేదదీరి నిట్టూర్చాడాయన. జగన్నాథం ఆయన చెప్పేది వినడానికన్నట్లు రెడీ అయ్యాడు.

"నీకు గుర్తుందిగా గగన్ భార్య కవల పిల్లల్ని ప్రసవించి... ఆ కాన్పులోనే పోయిందని... తర్వాత ఎంతమంది... ఎంత చెప్పినా వినకుండా మళ్ళీ పెళ్ళి కూడా చేసుకోకుండా ఆ పసికందుల్ని... తల్లీ తండ్రి తనే అయి పెంచుకున్నాడు. ఉద్యోగం... పిల్లలు.. అవే లోకంగా బతికాడు. కొడుకుల చదువులూ బాధ్యతలూ తీరి, సుమారు పదేళ్ళ కిందట వాడు ఒకామెని పెళ్ళి చేసుకున్నాడు. అది కూడా వాడికి పెళ్ళి మీద.. సంసార జీవితం మీద మోజుతోకాదు. జీవితంలో మోసపోయి అన్నీ పోగొట్టుకున్న ఓ అభాగ్యురాలిని ఆదరించడం కోసం...

దాని మీద అనవసర రాద్ధాంతం అంతా చేసి... మనమలనెత్తే

# రైతు పరిమళం

కాట్రగడ్డ లక్ష్మీనరసింహారావు

పాపం, రైతు!
దేశానికి వెన్నెముక! అన్నదాత!!
అవును- వున్ననేలదున్ని
విత్తనానికై ఎదురు మొలిచేవాడు
మొత్తం తనాన్ని స్వేదంతో తడిపి
విత్తం కోసం బెదురు చూపులు చూసేవాడు
కృషి వలుల రెండు చేతులొడిసి పట్టి
జీవజలాన్ని పుడిసి పట్టేవాడు
నకిలీ  నాణ్యతను పసిగట్టలేని
పైరు మన్నికను పడిగట్టలేనివాడు,
వైరి క్రిమికీటక పటాలాల పాల్బడి
మొరాయించిన ఫలితాన్ని ప్రేమించేవాడు
వికాసానికి ముందుగా విలపించేవాడు
వివేకాన జీవరసాయన నాల్నాహ్వానిస్తూ
శ్రమ సస్యాన్ని సమాజపరంజేసి
దౌత్య నీతిని విత్తావరణంగా మలచి,
నిలిచేందుకు నేలకై నిగిడి చూసేవాడు
పాపం, రైతు
వ్యాపారానికి పెట్టుబడి తాకట్టే
తలకట్టిన తుందు పరచి దేవులుకునేవాడు,



వెలకొట్టుల తులాభారం తూగుతూ
మొలగుట్టును మదుపుకునేవాడు
తన పట్టుల బూజులు  దులుపుకునేవాడు
ఆకాశం అంచులు వెదుకుతూ
ఋతుకాలాల పంచాయితీ నెరపుతూ
బ్రతుకంతా బురదమయమనే భావిస్తూ
వెతలగతులలో మతిలానే మణుగుతూ
వణుకున వయోభారాన్ని వేలం వేస్తూ
రాజకీయ  బాధితుడై రోజార్థిక శోధితుడై
విలాసమంటే విలాపమనుకుంటూ
ఉన్నా ఓటు దిక్కును మొక్కుగా తీర్చేవాడు

పాపం. రైతు!
పాయసాన్నంకై వరిగింజలు వెతుక్కునేవాడు
పోరుబాసటలో నేవేథ్యమై పులిసేవాడు
మారుపోటులలో మానవుడై వెలసేవాడు
పాపం రైతు!
కోపం ప్రదర్శించలేక కుములుతూ
తాపం భరించలేక హిమమై మసలుతూ
జీవితమంతా జనని ధాత్రి నేతృత్వంలో
భావితరానికి భాస్కరోదయాన్ని మలపేవాడు
బొక్కేవాడి నోట్లో రొఖ్ఖమై నలుగుతూ
చిక్కిపోతున్నా చెయ్యూపుల చైతన్యంతో
హక్కుల మలామైన మాలిన్యపు కథకుడై
పశుపథాల పరిసర సమిథయై
శిశోత్పత్తికి దన్నుగా ఆపన్నుడై
ఆహారోత్పత్తికై అహరహమూ శ్రమించేవాడు
ఊదౌత్తిలా దేశాన పరిమళించేవాడు రైతు!!

---

వయసులో మీకు పెళ్ళి కావలసివచ్చిందా.. అంతగా అయితే చాటు మాటు వ్యవహారాలతో సరిబెట్టుకోవాలి గానీ.. ఏకంగా ఈ వయసులో పెళ్ళి చేసుకుని మా పరువు తీస్తారా అంటూ నానా యాగీ చేసారు... వాడిని కాకుల్లా పొడుచుకుతిన్నారు... ఆ కొడుకులూ వాడి పెళ్ళాలూ.. అంతే కాక వాళ్ళ అత్తమామల ముందు కూడా వీడిని అనరాని మాటలని వాడి మనసు గాయపరచి...ఆత్మహత్య చేసుకునేలా చేసారు.. ఆ వయస్సులో.. ఆ అమాయకురాలిని ఆదరిద్దామన్న మంచి మనసుతో... సమాజంలో తనకు కానీ, ఆమెకు కానీ చెడ్డ పేరు రాకూడదనే తలంపుతో పెళ్ళి చేసుకున్న వాడిని అనుక్షణం వేధించి... వాడు ఉసురు తీసుకునేలా చేసారు ఆ పిల్లలు.

జీవితం మీద .. పిల్లల మీద విరక్తితో వాడికున్న యింటిని యిలా ఆశ్రమంగా చేసి ఆమెని... ఆశ్రమాన్ని చూసుకునే బాధ్యత నా మీద పెట్టి వాడు వెళ్ళిపోయాడు.

రోజు రోజుకు పిల్లల నిరాదరణకు గురి అవుతున్న తల్లి తండ్రులు ఎక్కువవుతున్న ఈ రోజుల్లో.. యిక్కడ చేరిన వారి సంఖ్య చాలానే ఉంది. నాకూ ఏ బాధ్యతలూ బంధాలు లేవు. అందరిలానే నా పిల్లలూ ఎక్కడో అమెరికాలో ఉంటున్నారు. అందుకే నా యింటిని అమ్మేసి... గగన్ పక్క యింటి స్థలాన్ని కూడా కొని యిలా ఆశ్రమంలా చేసాను. దీనితో నాకు చేతనయిన సాయం నా వంతు సమాజానికి చేస్తున్నానన్న తృప్తి... నాకు.. అందరూ ఉండి అనాధలవుతున్న వృద్ధులకు ఒకరికొకరు ఆలంబన.. తోడూ... నీడా... కాలక్షేపం. బరువు అనో.. అనవసరపు బాధ్యత అనో... లేక తమకు నచ్చినట్లు ఉండటం లేదనో.. ఏదో కారణం... కారణానికేమయినా ఫలితం నిరాదరణ. మనం కని పెంచిన పిల్లల తప్పుల్ని కడుపులో పెట్టుకుని కాపాడే మనకు.. ఒకప్పుడు మన తల్లితండ్రులూ మనల్ని అలాగే కాపాడేరనే విషయం గుర్తుండకపోవడం దురదృష్టకరం.

ఏ యిద్దరి అభిప్రాయాలూ పూర్తిగా ఏకీభవించవు. ఆ నిజం తెలీని వాళ్ళు మనకు అనుగుణంగా లేరనో,.. వాళ్ళు మనతో సర్దుకుపోరనో లేకపోతే మనం వాళ్ళతో సర్దుకుపోవడం కుదరదనో కన్న వాళ్ళని ఏరు దాటాకా తెప్పతెగలేసిన వాటంగా ఉన్న సమాజం... ఏ కుటుంబాన్ని చూసినా, ఉన్న వాళ్ళయిన, లేనివాళ్ళయిన.. ఏమతం వాళ్ళయిన... కులం వాళ్ళయిన సమస్య మాత్రం ఒక్కటే.

కన్నవాళ్ళని కంటిపాపల్లా చూసుకోపోయినా కనీసం వాళ్ళని చూసుకోవడం బాధ్యత... అది కనీసధర్మం అని కూడా అనుకోవడం ఎంత అమానుషం. ప్రతి కొడుకూ.. కూతురూ.. తల్లితండ్రులవుతారు... పాత్రలు వేరయిన పరిస్థితులు ఒకటే అవుతున్నాయి. జగన్నాటక చక్రం అది... అంతం... అంటూ లేకుండా అలా తిరుగుతూనే ఉంటుంది.

ప్రతివాళ్ళూ పాతికేళ్ళ తర్వాత మన పరిస్థితి ఏమిటి అనేది ఆలోచించ గలిగితే యిలాంటి ఆశ్రమాలు.. నిరాశ నిస్పృహలతో అలమటిస్తూ అనాదరణకు గురవుతున్న తల్లితండ్రులు ఉండరేమో కదూ... మర్రి ఊడల్లా వేళ్ళూరుతున్న స్వార్థం కొంచెం తగ్గించుకుని, మనిషిగా ఆలోచిస్తే అది అసాధ్యం మాత్రం కాదు. జీవితం అంతా పిల్లల కోసం ధారపోసి... వాళ్ళ చేతలకు అన్యాయంగా... అమానుషంగా బలయిపోయిన గగన్‌లాంటి వాళ్ళు ఎంతమందో ఈ సమాజంలో.

ఇది ఏ ఒక్కరిదో... యిద్దరిదో కాదు... ఈ సమస్య సమాజంలో యింటింటి కథ. ఆలోచనలతో... ఎప్పుడు.. ఎలా యిల్లు చేరాడో తెలియలేదు జగన్నాధానికి. ●

**కవిత**

## స్మృతులు

**దాకరపు బాబూరావు**

వాడొచ్చి
మనసు నేలలో
ఆలోచన్లని కుల్లగించి
మాటల విత్తనాలు చల్లివెళ్ళాడు-
సెలయేరులా స్వేచ్ఛగా ప్రవహించిన బాల్యాన్ని
ఊసుల దోసిలిలోకి తీసుకుని
అంజలి ఘటిస్తున్నట్లే పోసిపోయాడు
కాలం ఆగి వెనక్కిసాగినట్లే అన్పిస్తుంటే
జ్ఞాపకం మొలకలై మొగ్గ తొడుగుతూ వుంది-
శైశవం మళ్ళీ పువ్వై పూస్తోంటే
గురుతుల దండ
ఆత్రంగా గుచ్చుకుంటున్నాను-
ఒంటరితనం వనంలో
దిగులుచెట్టు కింద వున్న నామీద నుంచి
వాడు జ్ఞాపకాల దారులేసుకెళ్ళాడు
ఒక్కటే బాధ!
చాలా దూరం వచ్చేక వాడీపని చేశాడనే
మనసులోగిల్లోకి దూరి
అల్లరిచేసే అక్షరాలు
కవిత్వంలోకి ఒదిగిపోవాలని
ఒకటే కలల సవ్వడికి అంకురార్పణ చేసి
సంఘటనా చిరుజల్లుల్లో
తడిపిముద్ద చేసెళ్ళాడు-
ఒక్కసారిగా
స్మృతుల్లోకి తర్జుమా చేసి
తన్మయత్వాన్ని గ్రంథస్థం చేశాడు
తవ్వేకొద్దీ బయటపడుతున్నాయి
జ్ఞాపకాల గుప్తనిధులు



## ఆహుతి

**వై. రుక్మాంగదరెడ్డి**



నీరు లేదు-
చెమట కారింది
విత్తనం మొలకెత్తింది

నీరు లేదు-
కన్నీరు జారింది
మొక్క పెరిగింది

నీరు లేదు-
కన్నీరు ఆరింది
నెత్తురు కారింది
బతుకు కాలింది

అన్నదాత
శ్వాస ఆగింది
దేశమాత
ఇంటిదీపం ఆరింది

## యుద్ధానికి నేను సిద్ధం



**డా॥ కె. జి. వేణు**

శతాబ్దాలుగా... నిశ్శబ్దంగా వినిపిస్తున్నాయి
విషాదంగా...
యుద్ధాన విలపించిన ఆఖరి శ్వాసల ఆర్తనాదాలు
ఆరిపోలేదు నేటికి ఏరులై పారిన
రక్తపు మరకల చిరునామాలు
రాలుతున్నాయి తటాలున... కుప్పలు తెప్పలుగా
చరిత్ర పుటల నుంచి మానవ శవాల అవశేషాలు
హిరోషిమా నాగసాకీల క్షితిమంటల సాక్ష్యం
నేటికి నిక్షిప్తం...
మాడి మసైపోయిన మట్టికణాల కన్నుల్లో
మరణం నుండి మిగిలిపోయిన
ముసలి జనం ముఖాల ముడతల పొరల్లో
కకావికలం... కాలుపెట్టిన కంబోడియా ..
కబలించిన క్యూబా
రక్తం మరిగిన రాక్షసానికి అయింది వియత్నాం
గ్రెనైడ్ల దాడితో వురికొయ్యకు వ్రేలాడింది
నాడి తెగిన గ్రెనడా
ఆగని ఆయుధాల గాయాలతో
పరేషాన్ మొత్తం ఆఫ్ఘనిస్తాన్
కాలాన్ని సైతం కంటతడి పెట్టించింది
కాలసర్పమై ఇరాక్‌ని కాటేసిన ఆ మాయదారి పెత్తనం
యుద్ధమన్నది సరిహద్దులులేని ఓ భయంకర వినాశనం
ప్రేమించలేదు యుద్ధాన్ని
ప్రపంచాన ఏనాడు సామాన్యజనం
రక్తం కోరే యుద్ధం... మానవజాతి శాంతికోరికకు విరుద్ధం
అందుకే సహించబోను ఏ దేశాన యుద్ధానికి ప్రవేశం
అవుతాను ఆహుతి...
అవసరమయితే శాంతి స్థాపన యుద్ధంలో
నా పథం... జనపథం
జనసంద్రాన నేను బంధువు రూపం
బిందువే సింధువవుతుంది
యుద్ధాన్ని ధిక్కరించిన ఆ సమయం
పౌరుడిగా కంటే...
వీరుడిగా మరణించటానికే నా దేహం సిద్ధం
అందుకే సానపట్టిన... నా అక్షరాల ఆయుధాలతో
శాంతిస్థాపన యుద్ధానికి నేను సిద్ధం
ఆ యుద్ధానికి నేను సర్వదా సిద్ధం

పరిశీలన

# తొలి మహిళా లేఖలు సామాజిక విలువలు

■ ఆచార్య దావులూరి కృష్ణకుమారి

**ఈ లేఖలలో కేవలం ప్రాపంచిక విషయక లేఖలే కాదు జన్మ జన్మాంతరాల విముక్తికి కారణమైన ధార్మిక విషయాలు, వైరాగ్యం, ధ్యానం ఈశ్వర సేవవంటి విషయాల లేఖలూ పరిశిష్టమై ఉన్నాయి. ఈ లేఖలకు (76) ముఖప్రాయం వంటిది గాంధీ మహాత్ముని లేఖ. పీఠికాప్రాయం వంటిది. మహాత్ముని ప్రశంస. ఈ లేఖల ప్రకాశకులు మాగంటి బాపినీడు. ఈ లేఖలకు సమీక్షారేఖలవంటివి ఉన్నవ లక్ష్మీనారాయణగారి 'కడమాటలు'. ఇవి 1933లో ముద్రితాలు.**

మహిళల్లో లేఖా సాహిత్యానికి ఒరవడి దిద్దిన వాళ్లల్లో ప్రథమగణ్య మాగంటి అన్నపూర్ణాదేవి. ఈమె లేఖలు (1914-1923) సాహిత్య చారిత్రక సామాజిక విలువలు గలవి. ఇవి కనుపర్తి లక్ష్మమ్మ గారి శారదా లేఖల్లా కల్పితాలు కావు. రెంటాల సుబ్బారావుగారి కమలామణి లేఖల్లా అనువాదాలు కావు. స్వతంత్రమైనవి. సహజమైనవి. సజీవ మైనవి. ఉత్తేజకరమైన స్వరాజ్య ఉద్యమం నాటి సాంఘిక ఆర్థిక రాజకీయ ధార్మిక జీవనానికి అద్దం పట్టేవి.

అన్నపూర్ణాదేవి లేఖల్లో సమకాలీన హిందూ దేశస్థితిగతుల చుట్టూ అల్లుకున్న ఆమె సాంఘిక, ఆర్థిక జీవన సంగతులు, భవిష్యద్విద్యా ప్రయత్నాలు, కుటుంబ పరిస్థితులు ప్రధానాంశాలు. ఇవి అన్యోన్యతలు, ఆత్మీయతలు, ఆత్మ గౌరవాలు, అభిమానాలు, ఆవేశాలు, అశక్తతలు, ఆనందాలు, అలకలు వంటి అసంకల్పిత భావాలతో పాటు అప్పటప్పటి మానసిక సంకల్పాల మీదా, ఉద్వేగ సుకుమార భావాల మీద ఆధారపడి సుదీర్ఘంగా క్లుప్తంగా సాగిపోతుంటాయి.

ఇతరుల లేఖాగతాంశాలు, హితబోధలు, ప్రముఖుల ప్రవక్తల సూక్తులు, దేశభక్తుల మిత్రుల పరిచయాలు, ప్రయాణాల వివరాలు, ప్రవాస పతిగల స్త్రీ బాధల భారాలు, భౌగోళిక సాంస్కృతి కాంశాలు, ధాన్యం ధరలు – రుణాలు వంటి ప్రాస్తవికాంశాలతో పఠన యోగ్యత కల్గి ఉన్నాయి.

ఈ లేఖల్లో కేవలం ప్రాపంచిక విషయకలేఖలే కాదు. ధార్మిక విషయాలు, వైరాగ్యం, ధ్యానం, ఈశ్వర సేవ వంటి విషయాల లేఖలూ, పరిశిష్టమై ఉన్నాయి. ఈ లేఖలకు (76) ముఖప్రాయం వంటిది గాంధీ మహాత్ముని లేఖ. పీఠికాప్రాయం వంటిది. మహాత్ముని ప్రశంస. ఈ లేఖల ప్రకాశకులు మాగంటి బాపినీడు. ఈ లేఖలకు సమీక్షారేఖల వంటివి ఉన్నవ లక్ష్మీనారాయణగారి 'కడమాటలు'. ఇవి 1933లో ముద్రితాలు. ఈ లేఖాంశాలను 'లేఖకు రాలి జీవితం, స్త్రీ సంస్కరణం, దేశభక్తి 'అనే ప్రకారాల విహంగ వీక్షణానికి పరిమితమై పరిశీలించవచ్చు.

**జీవిత రేఖలు :** మాగంటి అన్నపూర్ణాదేవి పుట్టి పెరిగింది చాటపఱ్ఱు (పశ్చిమగోదావరి జిల్లా) గ్రామంలో ఈమె కలగర పిచ్చమ్మ రామస్వాముల కూతురు, రైతు కుటుంబం బిడ్డ. బ్రహ్మ సమాజ సిద్ధాంత ప్రచారకులైన రఘుపతి వేంకటరత్నం నాయుడు గారి సాంగత్యం గల కుటుంబం వీరిది. ఆ సంస్కార భావాలతో ఎదిగిన పిల్ల అన్నపూర్ణాదేవి. వీరిది అంత ఉన్నత స్థితిగల కుటుంబం కానప్పటికీ కలకత్తాలో చదివించ పూనుకున్న సంస్కార హృదయులు ఈమె తల్లిదండ్రులు. ఈమెది మేనరికం వివాహం. భర్త మాగంటి బాపినీడు. పరులకు మంచిగా ఉండి సాయపడే స్వభావం కలవాడు. జ్ఞానసంపాదన, ధర్మ సంపాదన, దేశసేవ ఈమె జీవనగుణాలు.

ఈమె బ్రాహ్మణ బాలికా పాఠశాల కలకత్తాలో 'మెట్రిక్', బెంటిక్ హైస్కూలు వేపేరి మద్రాసులో 'స్కూలు ఫైనలు' చదివింది. వివాహం వాయిదా పడడం వల్ల చదువును వృద్ధి పరచుకునే (గాంధీ, ఠాగూరు, సరోజినిదేవిగార్ల వద్ద) సదవకాశంగా ఆ కాలాన్ని వినియోగింప ప్రయత్నించిన సత్సంకల్ప ఈమె. ఆమె విద్యార్జనా దృక్పథం ఆనాటి ఈనాటి ఏనాటివారికైనా ఆదర్శనీయం. 'గొప్పవారి వద్ద విజ్ఞానము పడయగోరు వ్యక్తి సమస్తమూ క్షుణ్ణంగా ఎరిగి ఉండాలి. వారికి అనుకూలంగా వర్తించాలి.నేర్చుకునే దానివలన వారిని సంతుష్టుల్ని చేయాలి. ఉత్తమ విషయాల్ని గ్రహించుకోవాలి. తృష్ణను తీర్చుకోవడం కోసం కాక జ్ఞానార్జనకు చదవాలి మొదలగు ఆమె 'విద్యార్థి' ఆశయాలు.

ఇంకా బెంగాలీ నవలలు పద్యకావ్యాలు చదువుకోవడం 'యంగ్ ఇండియా' వంటి పత్రికా పఠనం ఈమెకు ఇష్టం. చిత్రపటాలు, బొమ్మల కార్డులు పోగు చేయడం, సిగరట్ మార్కు ఆల్బమ్ (చిత్రపటాలుంచుకునే పుస్తకం) చేవ్రాలు (ఆటోగ్రఫీ)ల సంపాదన, పెళ్లి పద్యాలు రాయడం మొదలైనవి ఈమె సరదాలు. కుట్టుపని, పుస్తకబహూకరణ, ఉత్తర ప్రత్యుత్తరాల చెలిమి, బీదలసేవ ఈమె అలవాట్లు.

సరోజనీదేవి, సరళాదేవి, యస్తరుకన్య, పోణాకనకమ్మ, రుక్మిణమ్మ, పద్మజ, ఈమెకు సన్నిహితులు. మెకాలె దొరసాని, మార్గరేటు, పారు దొరసానుల ఆహ్వానాలు అందుకున్న మహిళ ఈమె. గాంధీ మహాత్ముని అనుచరుల్లో ఒకరైన 'దండు సూర్యనారాయణరాజు' ఈమెకు ఆప్తమిత్రులు, స్వరాజ్య ఉద్యమ ప్రవేశం వల్ల ఈమె పొందిన లాభాల్లో ఇది ఒకటి.

అశాంతితో బాధపడుతున్నపుడు అనహనంతో అసందర్భకార్యాలకు పూనుకోకుండా హితం కరపి ధర్మపథం అనుసరించేలా చేసే మహానుభావుడు మిత్రుడు', 'బంధువుల కన్నా మిత్రులే విశ్వసనీయులు' అనేవి ఈమె మిత్రధర్మ సూత్రాలు.

గ్రంథ రచనకు ఈమెకు ప్రేరేపణం 'రచనల ద్రవ్యంతో పేదపిల్లలను పెంచవచ్చు. గాంధీ ఆశ్రమంలో చదివించ వచ్చు' అనే మహదాశయం. 4-7 తరగతుల బిడ్డల కోసం చక్కటి చిత్తరువులతో కూర్చిన ప్రథమ రచన 'సీతారామం' అనే బాలరామాయణం' (1918)

– సరళాదేవి, విధుశేఖరశాస్త్రి ప్రణీత బెంగాలి గ్రంథాల తెన్గింపులు “నవవర్ష స్వప్నం (1922) ‘వివాహ మంగళం’ (1920) అనేవి. వీటి మూలగ్రంథకర్తలనుండి కాపీరైటు, ముద్రాపకులతో (ఆంధ్ర ప్రచారిణీ గ్రంథమాల) సంప్రదింపులు, ప్రచురణ వలని లాభ వ్యయాల అంచనా. మొదలైన విషయాల్లోని ఆమె శ్రద్ధ ఏ గ్రంథ ప్రకాశకులకైనా మార్గదీపిక కాగలదు.

**2. స్త్రీ సంస్కరణ దృష్టి :**

స్త్రీకి అనుకూల దాంపత్య సౌఖ్యం కన్న వేరు సంతోషం ఉండదు. ‘వివాహబంధం స్వేచ్ఛా విహారిణి అయిన స్త్రీని పురుషుడి కన్నా వేయిరెట్లు నష్టపరుస్తున్నా ‘సరళ హృదయుడు, ఉత్తమ గుణాన్వితుడైన భర్త సాయంగల స్త్రీ ఉన్నతి సులువవుతుంది’. – అనే ఆమె ఆలోచనలు ఎవరి వ్యక్తిత్వాన్ని వారు నిలుపుకుంటూ సహధర్ములై జీవించడం ఆలుమగల ముఖ్యధర్మంగా భావింపచేస్తున్నాయి.

భార్య వ్యక్తిత్వ వికసనం కోసం భర్త తనవంతు బాధ్యతను స్వచ్ఛందంగా కనబరచాలి. మోసపుచ్చక సమస్యలను పరిష్కరించడంలో స్వతంత్రుడై ఉండాలి. స్వతంత్రుడు కాని సంపాదన లేని పురుషుణ్ణి పెళ్లాడడం స్త్రీ అల్పబుద్ధిని తెలుపుతుంది. స్వావలంబనం గల పురుషుణ్ణి ఎంచు కోవాలి. పత్నిధనంతో (వరకట్నం) పతి జీవితయాత్ర గడపాలనే సంకుచిత తత్త్వాన్ని తరిమివేయాలి.

స్త్రీకి జ్ఞానాభివృద్ధి లేకపోవడానికి కారణాలు సంసార చింత, ధనాభావం, విద్యాలోపం, లోకాపవాదం, వంట ఇల్లే వైకుంఠంగా కాక స్త్రీలు తమ రంగస్థలాన్ని విశాల పరచుకుని సంఘం వైపుకి దృష్టిని మరల్చాలి. వరంపరగా స్త్రీలలో హత్తుకుని పోయిన అభిప్రాయాన్ని అంటే సంసారవతి చదువుకోసం ఇతర ప్రాంతాలకు పోకూడదు, సేవలో భాగంగా ప్రచారాల్లోనో సభల్లోనో పాల్గొనగూడదు, అస్పృశ్యత వంటి దురాచారాలను ఖండించగూడదు. ఇత్యాదులను కాలానుగుణంగా మార్చు కోవాల్సి ఉంది. స్త్రీలు అన్ని దేశీయాభివృద్ధి కార్యక్రమాల్లో క్షత్రియత్వంతో పాల్గొనాలి. అప్పుడు ఆమె సోదరీ సోదరులను సమానంగా ప్రేమించగల్గుతుంది. సత్యధర్మ విరుద్ధంగా ఏ పనీ చేయవూనుకోను సాహసించదు. చాటుకు పోవడం, ప్రతి చిన్నపనికి జంకడం, భయపడడం, వంటి ఘోషా స్త్రీత్వం పోయి ధైర్యంగా చొరవగా ప్రవర్తించగల్గుతుంది. ధనాఢ్యత హిందూ స్త్రీకి ఎంతో ధైర్యాన్ని ప్రసాదిస్తుంది.

స్త్రీ తన వికాసం, విద్యార్జనం, వివాహం, పురుషుడి కంటే భిన్నమైన సామాజిక జీవనం పట్ల స్త్రీ సొంత అభిప్రాయాలు ఏర్పరచుకోవడం, వాటి సాధనలో ప్రయత్న లోపం లేకుండా ఉన్నప్పుడే తనకంటూ జీవితం ఉంటుంది.

వృధాగా కాలం గడపక విద్యతల్లి ధర్మం సంపాదించి, దేశ సేవలకు శరీరాన్ని అర్పించా లనేది ప్రతి స్త్రీ ధ్యేయం కావాలి. ‘శుష్కవాంఛలకు లోను గాని ఉత్తమ వాంఛలు ఉత్తమోత్తమాలై’ త్రికరణ శుద్ధిగా పనిని సాధించే శక్తిని కూడదీసుకునే ప్రయత్నించాలి. ప్రతి స్త్రీ విద్యావతిగా మరికొందరిని ఉత్సాహపరిచి దేశానికి లాభం కల్గించాలి.

ఈమె రాజకీయంలో స్త్రీ ప్రాతినిధ్యంలోని పురుషుల అన్యాయాన్ని ఇలా ప్రశ్నించుకుంటుంది. జనసంఖ్యను బట్టి చూస్తే స్త్రీలే పురుషులకన్న ఎక్కువ. పురుషుల తరపున ప్రతినిధులు (24) అంతమంది ఉండగా స్త్రీల తరపున ఒక ప్రతినిధి ఏ విధంగా చాలునో తెలియ కుంది. ఈ సమన్యాయం గూర్చి సరోజనీదేవి, సరళాదేవులతో ముచ్చటించా లనుకుంటుంది కూడా.

పవిత్రతవల్లా సత్యధర్మాచరణల నడవడికవల్లా మృదువైన అధికారంతో సహధర్మచారిణిగా అన్ని విధాలా పతికి సహాయకారిణి కావాలి. సామాజిక అవసరాలు గుర్తించి ఆ దిశగా పయనింప చేసే తత్త్వాన్ని అతనిలో మేల్కొల్ప గల్గాలి.

**రాజకీయం : స్త్రీ :**

అన్నపూర్ణా దేవి ఆంధ్ర రాష్ట్రీయ కాంగ్రెసు సభ్యురాలు – అఖిల భారత జాతీయ ఉపసంఘ సభ్యురాలు.

ఈమె రాజకీయంలో స్త్రీ ప్రాతినిధ్యంలోని పురుషుల అన్యాయాన్ని ఇలా ప్రశ్నించుకుంటుంది. జనసంఖ్యను బట్టి చూస్తే స్త్రీలే పురుషులకన్న ఎక్కువ. పురుషుల తరపున ప్రతినిధులు (24) అంతమంది ఉండగా స్త్రీల తరపున ఒక ప్రతినిధి ఏ విధంగా చాలునో తెలియ కుంది. ఈ సమన్యాయం గూర్చి సరోజనీదేవి, సరళాదేవులతో ముచ్చటించా లనుకుంటుంది కూడా.

మొదట్లో తానూ సభలూ సమావేశాల్లో ‘స్త్రీల యెడ ప్రవర్తించేలా పురుషుల యెడ ప్రవర్తించలేకపోవడం’ ఈమెను ఆశ్చర్యంలో ముంచెత్తింది. ప్రథమంగా పురుషుల సభలలో ఉపన్యసించవలసి వచ్చినపుడు ప్రత్యేకించి అభ్యసించవలసిన సంగతులు అనేకం తెలియవచ్చాయి. స్త్రీలు రాజకీయ రంగంలో అనుభవం లేకపోవడానికీ, హఠాత్తుగా ఉపన్యసించే సామర్థ్యం లేక పోవడానికీ కారణం విశేషంగా సంగతులు తెలియకపోవడమే అని స్ఫురించింది. పుస్తక పఠనం కన్న దేశ సంచారం వారిలోని ఘోషను, బెరుకును దూరం చేస్తుంది. ఈ భాగస్వామ్యం వల్లా, సద్గుణ సంపన్నుల సహవాసం వల్లా స్త్రీ స్వభావం వికసిస్తుందనేది ఆమె స్వానుభవం. స్త్రీలు పొగడ్తను గాని, బహూకరణను గాని కోరని సంకల్ప శక్తితో దూసుకుపోవాలి.

**వివక్ష :** హిందూ దేశంలో స్త్రీ పురుష భేదాన్ని ప్రశ్నించిన తీరులోనే సమాధానమూ ఇమిడి ఉన్న భావాలు కొన్ని.

“భర్త ఆజ్ఞానువర్తిని అయి భార్య ఉండవలసిందే. భర్త కుపథంలో ఉండి దుర్మార్గాన సంచరిస్తే భార్య తాను గూడ దుర్మార్గురాలు కావలెనా? ఇదెక్కడి ఆచారం” (పు.102)

“ఒకరి మాట ఒకరికి కలియక పోతే చిక్కులుండునని తెలిసికొనుడు. ఆడవాళ్లే మగవాళ్ల మాట వినవలెనా? మగవాండ్రు ఆడువాండ్ర మాటలు వినకూడదా”? (పు.7)

‘విదేశాల్లో మనదేశ పురుషులు ఎందరెందరు నారీ మణులతో స్వేచ్ఛగా సోదరభావంతో ఉండుటలేదు. స్వదేశంలో ఆ భావము స్త్రీల యెడ ఎందుకు ఉండదు? (పు.191). దేశ సేవలో ఆమె చుట్టూ జరిగిన మానసిక హింసనుంచి పుట్టిన ప్రశ్న ఇది.

‘ఈ దేశంలో భర్త దూరంగా ఉన్న స్త్రీ అసహాయురాలు’, ‘భగవంతుడు స్త్రీ పురుషులను సమాన సమర్థనలుగ సృజిస్తే నా ప్రయత్నం తప్పక సిద్ధిస్తుంది’ అనేది ఈమె దృఢ సంకల్పం.

**3. దేశభక్తి :**

"పూర్వం భారతదేశం సర్వదా జయపతాకలతో అలరారి వీర పుత్రులచే సన్మానించబడింది. భారతదేశం పరహస్త గతమై ఈనాడు విలపిస్తుంది. సహస్రమున సుపుత్రుడుండి ప్రయోజనం లేదు. మిగతావారు నిద్రలో మునిగి కాలాయాపన చేస్తున్నారు. భక్తి గౌరవాలతో దేశాన్ని ప్రేమించడంలేదు. ఉపన్యాసాలతో కాలాయాపన చేస్తున్నారు. పరోపకారం అత్యంత దూరంలో ఉంది. కార్య నిర్వాహణంలో ధన సహాయంలో దేశాభిమానం ఎక్కడను లేదు." (పు.27) ఇది ఆనాటి దేశపరిస్థితి. ఇప్పటి స్థితి ఇదే.

'దేశమును మరువవలదు. ఎవరూ దేశం కంటే ఎక్కువ కాదు. మాతృభూమి తర్వాతనే అందరం. భరతమాత కష్టాలు పోగొట్టడం ప్రతి భారతీయుడి విధి' – అంటూ అన్నపూర్ణాదేవి దేశభక్తి ప్రబోధాలను ఆసాంతం మార్మోగింపచేస్తూనే ఉంది.

ప్రజలంతా ఐకమత్యంగా నిలబడి దౌర్జన్యరహిత కార్యాచరణల ద్వారా ఎదుర్కొని పేదరికం కరవులేని స్వరాజ్యాన్ని భవిష్యత్ సంతానానికి అందించగల్గాలనే దీక్ష ప్రతి ఒక్కరిలో పుట్టుకురావాలి అనే ఈమె సందేశం.

స్వరాజ్య సంపాదనార్థం ప్రప్రథమంగా ప్రాణం అర్పించిన వీరవనిత కావాలని ఈమె ఆకాంక్ష. ఆత్మగౌరవాన్ని నిజ సుఖాన్ని అపేక్షించనితత్త్వం సంఘానికి సహాయకారిణినై మంచి ప్రవర్తన మంచి బుద్ధితో గౌరవపాత్రురాలను ఐతే చాలుననేది ఆమె మదిలోని కోరిక.

**దేశ విషయాలు :** "ధైర్యం, చిత్తశుద్ధి, నిశ్చలభక్తి, ఫలాపేక్ష లేని దేశసేవ గల ఉత్తమరాలు. నా అభిమాన పుత్రిక" అనే మహాత్ముని ప్రశంసకు అమితదయకు ప్రేమకు పాత్రమైన ప్రథమమహిళ మాగంటి అన్నపూర్ణాదేవి.

కాంగ్రెసు విధి విధానాలను కొత్త పద్ధతుల్లో బలపరచడంలో గాంధి మంత్ర శక్తి, ఆనాడు దేశంలో జరిగిన ఆశ్చర్యకర మైన మార్పులు, ఈలేఖల్లో బహుధా అభివర్ణితాలు.

అసహాయోద్యమం (సహాయ నిరాకరణ ఉద్యమం) ఎవరికి వారు వృత్తులను, పదవులను, పాఠశాలను వీడి ఉద్యమంలో పాలుపంచుకోవడం, సత్యాగ్రహ వ్రతాచరణం, జాతీయ విద్యాలయాల స్థాపనం, స్వదేశ వస్త్ర (ఖద్దరు) ప్రచారం, విదేశీ వస్తు బహిష్కరణం, గ్రామ ప్రచారం, ఖద్దరు పరిశ్రమాలయాల స్థాపనం, వేశ్యావృత్తి నిర్మూలనం, తిలకు స్వరాజ్యనిధిసేకరణ; అనవసర ధన వ్యయాల నుండి హిందువుల్ని రక్షించడం, హిందువుల ఆచారాలననుసరించి సభలో చాపలు ఉపయోగించడం, కాంగ్రెసు సంఘం, సభ్యుల చేరిక, హిందూ ముస్లింముల ఐక్యం, బ్రాహ్మణేతర ఉద్యమాలు తీరు, కృష్ణా పత్రిక నిరంకుశాధికారం, పోలీసుల ప్రశాంతత, ఇత్యాది ప్రతి ఉద్యమస్ఫూర్తిని ఈ లేఖలు కళ్లకు కట్టించాయి.

వీటిల్లో విదేశీ వస్త్ర దహనం వలని దురభిప్రాయాలను స్వదేశీ వస్త్ర ప్రచారం వలని ప్రయోజనాలనూ వాటి సాధక బాధకాలను ప్రస్తావించిన వాటిలో కొన్నింటిని నివేదిక రూపంలో ఇలా సంగ్రహ పరచుకోవచ్చు.

పరదేశీయ వస్త్రాలను దక్షిణాఫ్రికాలో అమ్మడం మొదటిదశ. దహనం చేయడం రెండోదశ. పనికిరాని వస్తువు మీద ఏవగింపుకు సూచిక దహన క్రియ. (ఎంత ధనవంతుడైనా చనిపోయాక దహనం చేయక తప్పనట్లు). ఈ విదేశీ వస్త్ర బహిష్కరణ చర్యల వల్ల 60కోట్ల ధనంతో పాటు ఆరుకోట్ల ప్రజల కరువు తీర్తుంది.

పరదేశీయ వస్త్రాలను దక్షిణాఫ్రికాలో అమ్మడం మొదటిదశ. దహనం చేయడం రెండోదశ. పనికిరాని వస్తువు మీద ఏవగింపుకు సూచిక దహన క్రియ. (ఎంత ధనవంతుడైనా చనిపోయాక దహనం చేయక తప్పనట్లు). ఈ విదేశీ వస్త్ర బహిష్కరణ చర్యల వల్ల 60కోట్ల ధనంతో పాటు ఆరుకోట్ల ప్రజల కరువు తీర్తుంది. 'స్వదేశీ వస్త్రాల మూలాన మనదేశం నుండి తరలిపోతున్న ధన ప్రవాహం, ఆగి దారిద్ర్యం నశిస్తుందని' గాంధీజీ జైలుకెళ్లినపుడు 'ఖద్దరు, ఖద్దరు' అని హితబోధ చేశారు.

10వ నెంబరు తెల్లని ముతకబట్టలు సంతోషంగా ధరించడం ఆనాటి హిందూ దేశ సౌభాగ్యచిహ్నం. అందుకు 'ఖద్దరు పరిశ్రమాలయాలు పెట్టి వడుకు నూలు బట్టల్ని పెంపొందించడం దేశీయుల ముందున్న మొదటి కర్తవ్యం. వీటి అమలులోని వర్తకుల మోసం గమనించి కాంగ్రెసు స్వాధీనంలో కంపెనీలు పెట్టి శుద్ధ స్వదేశీ వస్త్రాలను పెంపొందించాలనే ప్రయత్నాలు ముమ్మరంగా కొనసాగాయి. వాటిల్లో భాగంగా హిందూదేశం అంతటా 20 లక్షల రాట్నా లుండాలని, తిలకు స్వరాజ్యనిధికి కోటి రూపాయలు, కాంగ్రెస్ కోటి మెంబర్లుండాలని 'కాంగ్రెసు' తీర్మానించింది. (పు.91). అందుకు గాను స్వదేశీ వస్త్ర ప్రచారం చేస్తూ సులభమైన ధరలకు రాట్నాలు మగ్గాలు అందించి ఊరూరా వాటాల మూలాన ఖద్దరు పరిశ్రమాలయాలు స్థాపించాలనేది ఆనాటి నిర్ణయాల్లో మరొక కొత్త మలుపు.

"స్వరాజ్య ప్రాప్తి గ్రామ గ్రామ ప్రజలపై ఆధారపడి ఉంది. విద్యాధికుల కంటే విద్యాహీనులే దేశానికి ఎక్కువ మంది సహాయభూతులుగా ఉన్నారు. రైతులు – కార్మికులు – వ్యాపారులు అసహాయకారు లుగా ఉన్నారు. రైతుల సాయంలేని ఉద్యమ ప్రయత్నం వృథాకనక ప్రతి గ్రామానికి పోయి గ్రామ వాసులనందరిని ఒక చోటకు చేర్చి సహాయ నిరాకరణ ఉద్యమ తత్వాన్ని గూర్చి బోధించే గ్రామ ప్రచార కార్యం చేయతల పెట్టారు. దీనివల్ల లక్షాధికారి సంతతి మొదలు ప్రతిఇంట రాట్నంచే నూలు తీయడం నిత్య కృత్యం అయింది, ఇలా గృహపరిశ్రమల్ని పునరుద్ధరించి వారందరికి జీవనం కల్పించింది రాట్నమే.

'రాట్నం సామాన్యమైంది కాదు. అదొక విష్ణు చక్రం. దాని నుండి వచ్చే ధ్వని వేద నినాదం' అంటూ సాంస్కృతికంగా కవిత్వీ కరించింది దీనికి 'షౌకతాలి' మాటలను పొందుపరిచింది. 'ఆంగ్లేయుల ఫిరంగి 2000 ల మైళ్లదూరంలో ఉన్నవారినే నశింపచేస్తుంది. కాని మనరాట్నం 7000ల మైళ్ల దూరమునందున్న 'లాంకుషైరు' వరకు వెళ్తుంది'.

వడుకు నూలు చాలడం లేదని గాంధీ టోపి తీసివేసి 'అంగవస్త్రం' ధరించిన మహాత్ముని పటాన్ని ప్రవాసంలో ఉన్న పతికి

పంపడం గాంధీమీద భక్తి గౌరవ ప్రపత్తే. ఇదే దీని కొస మెరుపు.

**దేశసేవ:** పాశ్చాత్య విద్యా వ్యామోహంతో విద్యార్థి వేతనంతో ఆంగ్ల వాఙ్మయాభ్యాసం చేయాలని పలు ప్రయాసలు పడ్తున్న తరుణంలో ఈమె జీవితాన్ని సత్యాగ్రహోద్యమం ఒక మలుపు తిప్పింది. ఆమెలోని బ్రహ్మ సమాజ సంస్కార భావాలకు ఈ ఉద్యమం ఆసరా అయింది. ఉగ్గుపాలతో అబ్బిన స్వేచ్ఛాను వర్తకం ఆమెను వీడనిదయింది.

'సంవత్సరం వెంట సంవత్సరం గడచిన కొద్దీ నేనెంత పని చేయగలను. నేనెంతగా దేశాన్ని సేవించగలను నేను ఏమి నేర్చుకున్నాను అనే ఆత్మానుభవంతో ముందడుగు వేస్తూపోయింది.

వీటివల్ల ఆమెకు లభించింది మహాత్ముని శిష్యరికం. ఇందుకు కొన్ని మరపురాని ఘట్టాలు.

గాంధీ బెజవాడలో (31-3-21) స్త్రీ జన మహాసభ నిర్వహించినపుడు 20 లక్షలమంది జనం కాలి నడకన సాగివచ్చారు. స్త్రీల పక్షాన అన్నపూర్ణాదేవి మహాత్ముని ఆహ్వానించింది. స్వరాజ్యనిధి కింద రెండు జతల గాజుల్ని ప్రథమంగా ధారపోసింది. అప్పుడు గాంధీగారు 'నీ తల్లిదండ్రులు దీనికి అనుమతింతురా' అని అడిగారట. 'నా తల్లిదండ్రులు నా స్వేచ్ఛను అరికట్టరు. నా ఇష్టం వచ్చినట్లు చేయనిస్తారు అందట, తల్లిదండ్రులు నిరోధించాల్సిన చెడ్డపని తాను చేయననే 'ఆత్మధృతి' వారి విశాల హృదయంపట్ల ఆమెకు గల 'విశ్వసనీయత' అంతటిది. ఇలాంటి ఆత్మవిశ్వాసాన్ని ప్రతి ఆడపిల్లకు తల్లిదండ్రులు సమకూర్చగల్గాలి.

ఒక దినం అంతా (ఏలూరులో సాయంకాలం 4 1/2 గంటలకు వచ్చి రాత్రి పదిగంటలకు మేలుబండిలో వెళ్లారు) గాంధీ గారితో ఉండే భాగ్యం దక్కడం ఆమెకు పట్టలేని ఆనందం కల్గింది.

భర్త, పెళ్లినాటి ఉంగరం - చేతి గడియారం -కొన్ని తన బంగారు వస్తువులు 'తిలకు స్వరాజ్యనిధి'కి అందించింది. ఇతరపట్టు వస్త్రాలతో పాటు పెళ్లి పట్టుచీర అని కూడా సంకోచించక అన్నిటిని కాల్చివేయమని పంపింది. ఈ సంఘటన చాలామందికి ఆశ్చర్యం కల్గించింది. వాటిని గాంధీజీ ఎందరికో చూపారట. ఇంకొన్ని విదేశీ వస్త్రాలను పేదలకు దానం ఇచ్చింది. మిగతా వాటిని 'స్మిర్నా' లో బాధపడేవారికి పంపింది.

గాంధీ కాకినాడ వెళ్లినపుడు చూడవచ్చిన వేశ్యలను ఎవరో 'భోగం చాన'లని వ్యవహరించడం కర్ణ కఠోరంగా అన్పించి 'మహాత్మాజీ ఆ వృత్తిని నిర్మూలం చేయాలని స్త్రీ పురుషుల్ని కోరారు. అదే సమయంలో ఈ కార్యానికి పూనుకోమని అన్నపూర్ణాదేవిని ఆదేశించారుట.

'కుమారరాజా'ను జైలులో పెట్టినపుడు ఆయన సతిని ఈమె ఇంటనే ఉంచి ప్రచారానికి కొంపొమ్మని' ఆజ్ఞాపించారుట. అన్నపూర్ణాదేవి అహ్మదాబాదు, బొంబాయి వంటి బయటి పట్టణ ప్రాంతాల్లోను ప్రచారంలో పాల్గొంది. అనారోగ్య కారణంగా రుక్మిణమ్మగారితో కలసి కూడా గ్రామ ప్రచారం చేసే శక్తి లేక కేవలం స్త్రీల కోసం ఏలూరులో 'మోహనదాసు ఖద్దరు పరిశ్రమాలయాన్ని స్థాపించి వారికి కల్పించింది. 'ఘోషా స్త్రీలింతపని చేయ గలరా' అని సంశయించక విదేశంలోని స్నేహితుల నుండి సహాయం కోరడం గౌరవ ప్రదంగా భావించమని భర్తకు హితవులు ఉపదేశిస్తుంది. మ్యాజికు లాంతరు, బొమ్మలు ఈ ఆలయం కోసం తెమ్మని పురమాయిస్తుంది.

ఇంకా పేదరికం నిర్మూలనకు పూనుకుంది. ఖద్దరు ప్రచారానికి చేయూతనిచ్చింది. బాల్యవివాహాలను ఖండిస్తూ కరపత్రాలను పంచిపెట్టింది. అస్పృశ్యతా నివారణలో భాగంగా పంచమ బాలికను (సత్యప్రియాదేవి) సాకింది. ఈ చర్యల వల్ల గృహిణిగా తాను ఎన్నో ఇబ్బంది ఎదుర్కొంది. మానసిక అశాంతికి గురయింది. అయినా అవసరమై నపుడు భర్తల్ని బహిష్కరించి అయినా దేశసేవ చేయాలని స్త్రీలకు పిలుపునిచ్చింది.

ఇంకా పేదరికం నిర్మూలనకు పూనుకుంది. ఖద్దరు ప్రచారానికి చేయూతనిచ్చింది. బాల్యవివాహాలను ఖండిస్తూ కరపత్రాలను పంచిపెట్టింది. అస్పృశ్యతా నివారణలో భాగంగా పంచమ బాలికను (సత్యప్రియాదేవి) సాకింది. ఈ చర్యల వల్ల గృహిణిగా తాను ఎన్నో ఇబ్బంది ఎదుర్కొంది. మానసిక అశాంతికి గురయింది. అయినా అవసరమై నపుడు భర్తల్ని బహిష్కరించి అయినా దేశసేవ చేయాలని స్త్రీలకు పిలుపునిచ్చింది.

ఆనాడు రాజకీయం అంటే ఏంటో తెలియని స్త్రీలు దేశసేవ చేస్తున్నారు. ఒకవైపు తాము జైలుపాలవుతున్నవారు కొందరైతే, భర్తలు జైలుకెళ్తే వారి స్థానంలో తమ జీవితాల్ని త్యాగం చేస్తున్నవారు మరి కొందరు. ఇలాంటి మహా తరుణంలో తాను తన భర్తతో కలిసి సేవ చేయలేక పోయినందుకు ఆమె మనస్సు, పదే పదే కలవరపెడ్తుండేది.

**హిత చర్యలు :** విద్యార్థి వేతనాలతో పరదేశంలో విద్య నభ్యసించేవారు జాగరూకులై విద్యాధర్మాన్ని పాటించాలి. అని నూరిపోసింది. విద్యార్థి వేతన దాతలను సంతృప్తి పరచడం వారి ధర్మంగా గుర్తింపచేసింది.

'పరదేశానికికేగినంత మాత్రాన గౌరవనీయులు కారు. దరిద్రుడైనా పరదేశ సంచారి కాకపోయినా మాతృభూమికోసం ప్రాణం సమర్పించినవాడే ధన్యుడు' -అని సూక్తీ కరించింది.

'విదేశాలకు పంపడం సంఘానికీ దేశానికీ ప్రాణం పెట్తారనే తలంపు తోనే' అంటే స్వదేశం కోసమే కాని స్వలాభానికి కాదనే నైతిక ధర్మాన్ని ప్రబోధించింది.

విదేశీ విద్యను నూతన సమాజ నిర్మాణానికి అంటే అటు 'వ్యవసాయ రంగం'లో గాని, ఇటు 'పారిశ్రామిక రంగంలో గాని తమవంతు బాధ్యతతో బుద్ధి కుశలతతో ఉపయుక్తం చేయాలి.

'మనదేశానికి అక్కరకు వచ్చు విద్యను మాత్రమే సంపాదించుకుంది. వారి నాగరికతను అనుకరించినంత మాత్రాన ఆంగ్లేయులం కాము. ఎన్ని పరుల భూషణాలు ధరించినా మనం హిందువులమే. ఇతరులను అనుకరించి శక్తికి మించి చేసిన పనివల్ల గౌరవహాని కల్గుతుంది. నెమలి పింఛం కట్టుకున్నంత మాత్రాన కాకి నెమలి కాగల్గుతుందా - గాడిద సింహపు తోలు తొడిగిన మాత్రాన సింహమగునా' (పు.98) అనేవి ఆమె బోధలు.

ఇక 'ఆదేశ' చర్యలు.ఆ 'దేశంలో' ఉపకరించే 'జాము' ఫ్యాక్టరీల కన్న స్వదేశానికి పనికివచ్చే వ్యవసాయ శాస్త్రజ్ఞతతో దేశ సంస్కృతిని పరిరక్షించాలని గుర్తించమంటుంది. డిగ్రీల కన్న అనుభవానికి

# ఉక్కుడేగ

**గజవెల్లి**

భగ్గుమంటున్న ఆ గాజా నగరమందు
అక్కటక లేని హృదయుడు ఆక్వాప్టలిస్టు
అక్కసితో హతమార్చే అమాయకులనెల్ల
నికృత్తమై ఉన్నది శాంతి విశ్వమందు
అజీవముగ ఉన్నది ఐ.రా.స. నేడు చూడు

అగ్ని కీలలు ఆరి ఆరి రగులు చుండె అచట
నికృత్తములాయె పసిపిల్లల కాయములెల్ల
నికృష్టమైనిది వాడి నికృతబుద్ధి
నిరాగుడులను దోషిగా నిలదీసివాడు
నురుల కంభానికి గొంతుకల నురమబట్టె

కేళీ కూళీకలందు దొర్లి పొర్లివాడు
దోచుకొనసాగెనారి ప్రాణమానములనెల్ల
నిర్థికల ప్రజలరక్తము పీల్చసాగెవాడు
అదుపులేదాయో ఆ అహుమ్మతికినేడు

రోజుకోచోట రోథనల్ పెళ్ళుమనగ
ప్రపంచబ్యాంకు పెట్టుబడుల్ ప్రవాహమై సాగ
చిన్న దేశాలు ఆర్థికంగా చితికెనేడు
పెట్టుబడిదారి వ్యవస్థ పెరుగుచుండె చూడు
ఈ ప్రజా ఉద్యమాల పునర్జీవయుగమునందు



మొన్న ఇరాక్ సౌధాలు ఇసుక దిబ్బలు చేసి
నిన్న ఇరాన్‌పై కన్నేసి ఇమడలేక తొలిగి
నేడు గాజాపై ఉక్కుడేగలతో నిప్పులు చిమ్మబట్టె
పసరు ప్రాణాలకు ముప్పుని తెలిసి వాడు
పసరముల ప్రవర్తించసాగెవాడు నేడు

సోషలిస్టులలో చైతన్యం సొమ్మసిల్లె
అభ్యుదయశక్తులు ఒకడుగు వెనుకపట్టె
సామ్రాజ్యవాది వ్యూహములతో సోవియట్ కుప్పకూలె
అమెరికన్లు ఆయుధ సైదాంతిక దాడికి పథకమెట్టు
ఉగ్రవాదానికి వాడు ఊపిరుల్ పోసెచూడు

హిరణ్యాక్షుడు ఇలను చాపలా చుట్టినటుల
నిన్న ఇరాక్ నేడు గాజా రేపు ఏదో ఏమో
సంకీర్ణసేనలు విశ్వాన్ని నలుదిశల చుట్టు బట్టె
శ్వేతసౌధీయ్యుల ఎత్తుల జిత్తుచూడు

పెరుగుచున్నవి ప్రజా ఉద్యమాలు విశ్వమందు
ఎదుగుచున్నవి వెతిరేకతల్ వాడిపైన మెండు
వేగిరమె ఉద్యమాలకు ఊపిరుల్‌పోసి
సాగుడీ ఇలపైన సవ్యసాచులై కమ్యూనిస్టులారా.

---

విలువ ఎక్కువ.

అక్కడ వ్యవసాయదారుని కడ పనిముట్లతో ఏ విధంగా భూమి బాగుచేయాలో, ఏయే పైరుల్ని ఏ విధంగా పండించాలో అనుభవంతో ఆరు నెలల పాటు నేర్చుకోమంటుంది. 'వ్యవసాయ పరిశ్రమాలయం' స్థాపనం గూర్చి, మెట్టు వ్యవసాయం గూర్చి, దర్శి చెంచయ్యగారి తెలుగు వ్యాసాన్ని ప్రస్తావించి నిర్దేశ మార్గాన్ని చూపిస్తుంది. పరదేశం నుంచి మోటారు సైకిలు కన్నా మాజికు లాంతరుద్వారా వ్యవసాయాభి వృద్ధిని తెలియచెప్పను. బొమ్మలను తీసుకుని రావడం, తాగుడు వలన నష్టాల్ని బీదవారికి బోధించడానికి 'స్లైడ్సు' తీయడం నేర్చుకుని రావడం, మేల్తరమంటుంది. ఇవన్నీ ఆమె సంకల్ప బలాన్ని క్రాంత దర్శిత్వాన్ని వెలువరించేవే.

తాత్కాలికమైన సౌఖ్యాన్ని అపేక్షించి శాశ్వతమైన పతనాన్ని కోరుకోగూడదు. అనే ఆమె మనోగతం నిత్యం వెలుగొందే దివ్వెవంటిది.

ఇలాంటి మహోన్నత భావ సంచనాలతో ఈ లేఖలు ఎన్నెన్నో సంస్కరణ కవాటాలు తెరిచి ముందు తరాలకు సరికొత్త జ్ఞానోపదేశం చేయగల శక్తి సామర్థ్యాలుగలవి.

**ముగింపు :** గొప్ప సామ్రాజ్యాల్లో ఒకటిగా ప్రపంచానికి అలంకారప్రాయమైన భారతమాత బాలికను. నా ప్రియ జన్మభూమికకు గర్వపడుతున్నాను. అన్న దేశ సేవిక మాగంటి అన్నపూర్ణాదేవి.

ఈమె ఈ లేఖలను 'దేశపు సొత్తు'గా భావించి పొత్తంగా రూపు కల్పించాలనే సంకల్పమే ఈ లేఖలు విలువకు దృష్టాంతం.

స్త్రీని కేవలం గృహిణిగా మాత్రమే కాని ఉన్నత సంస్కారవతిగా, విద్యావతిగా, ఉత్సాహ ప్రోత్సాహాలు గల దేశ భక్తురాలుగా గుర్తించని సమాజానికి సాక్ష్యం చూపే సంస్కరణ పత్రాలు ఈ లేఖలు.

'నేను భువిపై నెవనికి భయపడు దాననుగాను, కేవలమొక్క పరమేశ్వరుని గాంచియే భయపడు దానను'– అనే వాక్కు ఆమెకే కాదు. స్త్రీలందరికీ 'గురు వాక్యమే'.

పరమపితయందె యాధారపడిన దాన
నతడు కరుణా యముడుగాన నందగలదు
విజయమిప్పుడోతేపోయీ పృథివికేను
జంకిపోవను కామ్యానుసరణమందు

(ప-1)

అనే రీతి ఈ లేఖల్లోని సుభాషితాలు కొన్ని ఆయా తేదీల క్రమంలోనే 241 తేటగీతులుగా పరివర్తన పొందడం ఈ లేఖల వైశిష్ట్యాలతో వైశిష్ట్యం. ●

## కవిత

# స్వదేశీ జపం

ఒక బహుళజాతి కంపెనీ టూత్ పేస్ట్‌తో
పళ్ళు తోముకుని నవ్వుతాను చిరునవ్వు
అరచెయ్యి అడ్డుపెట్టుకుని
శ్వాస ఊది చూసుకుని సంతోషిస్తాను
'ఆహా! ఎంత బాగుంది...!
బాత్ రూమ్‌లోకి చొరబడగానే
ఒక సబ్బు నా శరీరంపై నాట్యమాడుతుంది...
'ఆహా! బహుళజాతి కంపెనీ పెట్టే చక్కిలిగిలి బలే మజాలే!'



ఒక బహుళజాతి కంపెనీ ప్రవేశపెట్టిన పౌడర్‌తో
చంకలు పరిమళభరితం చేసుకుంటాను
మరుసటి నెలలో కూడా అదే పౌడర్ కొనుక్కుంటాను
నా భాషలోకి అప్రయత్నంగానే చొచ్చుకు వచ్చేస్తుంది
ప్రకటనల భాష అనుకోని అతిథిలాగా!

బహుళజాతి కంపెనీ లేబులున్న టీ త్రాగుతాను
బిస్కెట్లూ తింటాను
పీటర్ ఇంగ్లాండో లేక పాన్ అమెరికా షర్టో వేసుకుని
వెళతాను సాయంత్రం ఏదైనా ఫాస్ట్ ఫుడ్ కార్నర్‌కి
ఆర్డరిచ్చి తింటాను కాంటకీ చికెన్

నా వెనుకనుంచి ఒక సేల్స్ మేన్ అడుగుతాడు-
'మీరు ఏ షేవింగ్ క్రీమ్ వాడతారు?'
తలతిప్పి చూస్తాను చిరునవ్వు చిందిస్తూ
అతనికి నా గడ్డం చూపిస్తాను!

సాధువుల సరసన కూర్చుని స్వదేశీ జపం చేస్తాను
ఒక నక్షత్రం నా దగ్గరకొచ్చి అంటుంది మెల్లగా-
'నువ్వు వల్లిస్తున్న స్వదేశీ జపం స్వర సృష్టి
ఒక బహుళజాతి కంపెనీ ట్యూన్ సుమా!'

**హిందీ మూలం: శ్రీ రాజేశ్ జోషీ(భోపాల్)**

**అనువాదం: డా.వెన్నా వల్లభరావు**

# రెక్కల సవ్వడులు

**పి. శ్రీనివాస్ గౌడ్**

మనసు లోపలి
మలినాల్ని
కన్నీళ్ళు
శుభ్రం చేస్తాయి

కన్నీళ్ళేగా
మానవత్వ చిరునామా

◆

మాట నిలపని
మనిషి
ప్రాణమున్న
శవం



మానవ పరిమళం
నైతిక విలువ

◆

చక్రవర్తుల
శాసనాలు
భూగర్భంలో
కలిసిపోయాయి

నిక్షిప్త చరిత్రలో
నిరంకుశత్వాలు

◆

పునీతులందరూ
పుట్టినచోట
అవహేళనకు
గురయిన వారే

విశ్వవ్యాపకం
హృదయ పరిమళం

◆

ఎంత కప్పెట్టి
తొక్కిపట్టినా
ప్రతిభ
బయటపడి తీరుతుంది

గుప్పెట్లో
నిప్పుకణిక

◆

ప్రలోభాల వెంట
గుడ్డిగా
ఉరుకులు
పరుగులు



డెడ్
ఎండ్స్

పాముల
మధ్యన
ముంగిస
బ్రతుకు

జీవితం
కొండచిలువ

◆

ఎప్పటికప్పుడు
లోటుపాట్లని
పూడ్చుకోవాలనే
చూస్తుంటాను

జీవితం
చిల్లుసంచీ

◆

సరైన సమయం
చూపించని గడియారం
అందంగా వుండి మాత్రం
ఏం ప్రయోజనం..?

రూపం
అపురూపం కాదు

◆

సహజ కాన్పులకు
అడ్డుకట్టలు
కోత కాన్పులకు
డబ్బు కట్టలు

అప్పులు చేయించువారు
నేటి వైద్యులు

◆

నాటక కళాకారుల
జీవితాల్లో
అద్భుతంగా పండుతున్న
కాటకాలు

నాటకం వెనుక
అంతర్నాటకం

◆

కూలిన
గోడను పెళ్ళగిస్తూ
చెట్టు
వేళ్ళూనింది

చరిత్ర నిర్మిస్తుంది
కూలిన జీవితం

◆ కథ

# దృక్పథం

■ కె. కేశవరెడ్డి



**తేజ హైదరాబాద్‌లోనే వుంటున్నాడని చక్రపాణి సికిందరాబాద్ స్టేషన్‌లో కలిసి చెప్పాడు. నిన్ననే తెలిసిందట. ఇంకా కలవలేదట. అర్జంటు పనిమీద చక్రపాణి విజయవాడ వెళుతున్నాడు. వచ్చిందాకా నన్ను హైదరాబాదులో వుండమన్నాడు. నాలుగురోజులు తేజాతో కలిసి ఎన్నో కబుర్లు చెప్పుకొందామన్నాడు.**

తేజాని కలవాలని మాట్లాడాలని నాకూ చాలా ఆసక్తిగా వుంది. తేజా అడ్రసు తీసుకొని అన్వేషణ ప్రారంభించాను.

మేము ఇంజనీరింగు చదివే రోజుల్లో తేజ మాకందరికీ సోర్స్ ఆఫ్ ఇన్స్పిరేషన్. ఎప్పుడూ కెరీర్‌ని గురించే మాట్లాడేవాడు. వేరే ఏమైనా మాట్లాడినా దానిని కెరీర్‌తో ముడిపెట్టేవాడు. ప్రొఫెసర్లు, ప్రిన్సిపాల్ తేజాని ఆదర్శంగా తీసుకోమని చెప్పేవారు. అమ్మాయిల్ని గురించి, రాజకీయాల్ని గురించి, విద్యార్థి సంఘాల్ని గురించి తన అభిప్రాయాలు చెప్పేవాడు. పదవులకై వెంపర్లాడే వారి కీచులాటలు, పోట్లాటలు, ఘర్షణలు రాజకీయాలనేవాడు. రాజకీయ పార్టీలు బలాన్ని పెంచుకొనేందుకు విద్యార్థి సంఘాల్ని ప్రోత్సహిస్తుంటాయంటాడు. కెరీర్ కొరకు ప్రయత్నాలు సాగించే వ్యక్తుల సమూహం సమాజం అంటాడు. ఇవన్నీ అతడు చెపుతుంటే మేమంతా శ్రద్ధగా వినేవాళ్లం, కాని "అమ్మాయిలు సైట్ కొడతారు ట్రాప్ చేస్తారు. వలవేస్తారు కట్న కానుకలు లేకుండా పెళ్లికి గంగిరెద్దుల్లా మనల్ని తలూపేలా చేస్తారు" అమ్మాయిల్ని గురించి తేజ అభిప్రాయాలు, చేసే వాఖ్యలు అప్పుడు కూడా నాకు చిరాకు కలిగించేవి.

టాక్సీ ఒక పెద్ద బంగాళ ముందు ఆగింది.

"తేజా గారి ఇల్లు యిదేనా?"

"అవును సార్ చెప్పాడు అటెండర్

'తేజా గారిని అర్జంటుగా కలవాలి. విజిటింగ్ కార్డు యిచ్చాను

తేజ లోపలినుండి పరుగు పరుగున వచ్చి సాదరంగా ఆహ్వానిస్తాడనుకొన్నా.

తేజ రాలేదు. అటెండరు వచ్చి ముందు గదిలోకి తీసుకెళ్లాడు.

"కూర్చొండి సార్" సోఫా చూపించి లోపలికి వెళ్లాడు.

ఒంటరిగా కూర్చున్నాను. ఐదు, పది నిముషాలు గడిచాయి.

గతకాలపు ఆలోచనలు చుట్టు ముట్టాయి. తేజ నా క్లాస్‌మెట్ మాత్రమే కాదు రూంమేట్ కూడా. కెరీర్‌ని గురించి తప్ప మరేం మాట్లాడని తేజా వాడి స్వంత విషయాలు కూడా నాతో చెప్పేవాడు. అమ్మా, నాన్నలు రెక్కల కష్టం మీద బతుకుతున్నారు. మేనమామకు ఒక్కతే కూతురు. పేరు సునీత. చాలా తెలివైన అమ్మాయి. ఇంటర్‌లో స్టేట్ థర్డ్ ర్యాంకర్. ఇవన్నీ తేజ పాతరోజుల్లో చెప్పిన మాటలు. ఇంతకు తేజ సునీతని పెళ్లి చేసుకున్నాడా? లేక చాలా కాలం విదేశాల్లో వున్న తేజ అక్కడి అమ్మాయిని చేసుకొన్నాడా?

"సార్ లోపలికి రండి" అటెండరు లోపలికి తీసుకెళ్లాడు.

పెద్దహాలు ఎదురుగా కుర్చీలో తేజ నా కళ్లను నేను నమ్మలేకపోయాను. తేజాది ఒడ్డూ పొడుగూ గల విగ్రహం పెద్ద కళ్లు. నిశితమైన చూపు. చూడగానే ఆకట్టుకొనే అందం వాడిది. నాకు తెలిసిన తేజాకి నేను చూస్తున్న తేజాకి సంబంధమే లేదు. పీక్కుపోయి కనుగుంటల్లో ఎక్కడో మినుకు మినుకు మంటున్న కళ్ళ రెప్పలు అతడి ప్రమేయం లేకుండా పడిపోతున్నాయి. కళాకాంతులు లేని పాలిపోయిన ముఖం. ఎగరలేని రెక్కలతో ముడుచుకు కూర్చున్న గువ్వలా వున్నాడు. ఇంతకాలం తరువాత మిత్రుణ్ని కలిస్తే కలిగే ఆనందం, ఉత్సాహం, ఉద్వేగం ఏవీలేవు వాడి ముఖంలో. ఎదురుగా వున్న కుర్చీలో కూర్చొమని సైగ చేశాడు. ఆ పెద్ద హాల్లో ఎదురెదురు కుర్చీల్లో మేము విశాలమైన మైదానంలో రెక్కలు తెగిన పావురాల్లా వున్నాం.

విస్కీ రెండు గ్లాసుల్లో పోశాడు అటెండరు. సోడా మినరల్ వాటర్ మూతలు తీశాడు. టీపాయ్ మీద ఏవో పాకెట్లు పెట్టాడు. అతన్ని వెళ్లమని సైగ చేశాడు. నేను సందేహిస్తున్నా తేజా గమనించాడు. 'హేవిట్ ఫర్ మై సేక్' అన్నాడు నెమ్మదిగా.

ఇంతకాలం తరువాత కలిసిన తేజా ఎక్కడెక్కడ వున్నాడు?

ఏమేం చేశాడు? ఇప్పుడేం చేస్తున్నాడు? పెళ్లి చేసుకొన్నాడా? లేదా? ఇంట్లో ఆడవాళ్లు వున్న సూచనలేం లేవు. పెద్ద భవనం గది ఉన్నా వుండవచ్చు. అక్కడికి రాకపోవచ్చు. రకరకాల ప్రశ్నలు సందేహాలు నన్ను వేధిస్తున్నాయి. ఇంతకాలం ఎక్కడున్నావు? ఆతురతగా అడిగాను. ఆగమన్నట్లు సైగ చేశాడు. 'హ్యావ్ ది డ్రింక్ ఐసే' అన్నాడు. నేను నెమ్మదిగా సిప్‌చేస్తున్నా. అతడు నాలుగు రౌండ్లు లాగించాడు. సిగరెట్టుపై సిగరెట్టు కాలుస్తున్నాడు. నేను సిగరెట్టు అందుకొని కాల్చా. ఒకటి రెండుసార్లు పీల్చేటప్పటికి గాలిలో తేలిపోతున్నట్లుంది. కుర్చీలో వాలిపోయాను.



ఉదయం 7 గంటలకు నిద్రలేచాను. అటెండరు టీ తెచ్చాడు. స్నానం యితరాల ఏర్పాట్లు చేశాడు

'అయ్యగారు నిద్రలేచారా? అడిగాను.

9 గంటలకు ముందు లేవరు సార్' అని చెప్పి నాలుగు రకాల న్యూస్ పేపర్స్ తెచ్చి నా ముందు పెట్టాడు. న్యూస్ పేపర్లు చూడాలనిపించలేదు. రాత్రి నాకేమయింది? ఎందుకలా అయిపోయాను? తేజా ఎందుకు మాట్లాడలేదు? ఒకటి రెండు పొడిమాటలతో సంజ్ఞలతో ఎందుకు దాటేశాడు? అంతా అగమ్యగోచరంగా వుంది.

9.30కి తేజా నేనున్న గదిలోకి వచ్చాడు.

'ఎలావున్నావు? రాత్రి బాగా నిద్రపట్టిందా? అడిగాడు. 'అమ్మయ్య వీడి మూడ్ మారింది. బాగానే మాట్లాడేలా వున్నాడు' అనుకున్నా.

"రాత్రి కంటిమీద కునుకు లేదు. గతకాలపు ఆలోచనలు చుట్టుముట్టాయి. క్రుంగదీశాయి. రాత్రేగాదు చాలా కాలం నుండి నా పరిస్థితి యిలాగే వుంది. నేను గతంలోనే బతుకుతున్నాను. ప్రస్తుతాన్ని ఎదుర్కోలేక నేను పరాజితుణ్ణి. పిరికివాణ్ణి. నా నీడను చూసి నేనే భయపడుతున్నా. అందుకే రాత్రి నీతో ఏమీ మాట్లాడలేదు. కాని రాత్రంతా ఆలోచించా. నన్ను వెతుక్కుంటూ వచ్చిన నీతో మాట్లాడాలనుకున్నా. గుండెలో గూడు కట్టుకొన్న బరువుని కొంతైనా దించుకుందామనుకొన్నా. కాని ఎలా మొదలెట్టాలో అర్థం కాకుండా వుంది" నెమ్మదిగా సాలోచనగా చెప్పుకుంటూ పోతున్నాడు తేజ. ఏదో జ్ఞప్తికి తెచ్చుకుంటున్నట్లు కొంచెం ఆగి "మనకి రెండు సంవత్సరాల జూనియర్ భాస్కర్ అతడెక్కడున్నాడు?" అడిగాడు.

"సిటీలోనే వున్నాడు. అప్పుడప్పుడు కలుస్తుంటాడు.

"బాగున్నాడా? ఏంచేస్తున్నాడు?

"బాగానే వున్నాడు"

"మనం ఎంత విసుక్కొన్నా చిరాకు పడేవాడు కాదు. వాడు చెప్పిన విషయాలు నా మనసులో మారు మోగుతున్నాయి. సుదూర భవిష్యత్తులోకి తొంగిచూచి ఎన్ని జీవిత సత్యాలు చెప్పాడు? నా దృష్టిలో వాడు మహాజ్ఞాని. నాకే కాదు, ఆలోచిస్తే ఎవరికైనా"

"వాడి సంగతి సరే. నిన్న చక్రపాణి కలిశాడు. నీ నీవిక్కడ వున్నట్లు చెప్పి అడ్రసు యిచ్చాడు. రేపు వాడూ వస్తాడు. కావాలంటే భాస్కర్‌ని కాంటాక్టు చేసి రేపు రప్పిస్తా. అందరం కలిసి మాట్లాడుకుందాం. ముందు నీ సంగతి చెప్పరా. ఇంజనీరింగు చేసిన తరువాత ఎక్కడికెళ్లావ్? ఏం చేశావ్? చెప్పరా ఊరక నసపెట్టక"

"సరే రేపు భాస్కర్‌ని తీసుకొస్తాననే షరతు మీద"

"అలాగే, ఇంజనీరింగ్‌లో చేరడానికి ముందు విషయాలు కూడా ఒకటి రెండు నీకు చెప్పాలి. మాకున్న కొద్దిపాటి పొలం, నా కాన్వెంటు చదువు కార్పొరేట్ కాలేజి ఇంటర్ మీడియట్, యంసెట్ కొచింగులకు హరించుకుపోయింది. ఇంజనీరింగు చేయాలని కోరిక. అమ్మా నాన్నలకు చదివించాలని ఆశ. కాని ఎలా అనేది సమస్య. ఈ దశలో అపద్భాంధవుడు మా మేనమామ ఆదుకొన్నాడు. ఆయనకు ఒక్కతే కూతురు సునీత. సునీత హైస్కూల్ చదివే రోజుల్లోనే మా అత్తయ్య చనిపోయింది. సునీత అందంగా వుంటుంది. తెలివైన అమ్మాయి. ఇంటర్మీడియేట్‌లో స్టేట్‌థర్డ్ రాంకర్. కూతుర్ని డాక్టర్ని చేయాలని మామయ్య ఆకాంక్ష. సునీత కోరికా అదే. కాని అదే సమయంలో నేను ఇంజనీరింగు చదవాలి. మామయ్య ఆర్థిక స్తోమత అంతంత మాత్రమే. సునీతని మెడిసిన్ చదివించినా తరువాత పెళ్లి సమస్య వుండనే వుంటుంది. మామయ్య నన్ను ఇంజనీరింగు చదివించాలని నిర్ణయం చేశాడు. కాని ఒక షరతు సునీతని నేను పెళ్లి చేసుకోవాలి. నిజంగా చెప్పాలంటే అది షరతు కాదు. మేమిద్దరం 'మేడ్ ఫర్ ఈచ్ అదర్' అనే భావం రెండు కుటుంబాల్లో మేం చిన్నప్పటి నుండే నాటుకుపోయింది.

ఇంజనీరింగు కాలేజీలో మీ అందరి పరిచయమయింది. ప్రొఫెసర్ల అభిమానం పొందగలిగాను. అప్పుడప్పుడు టౌన్‌లో కెరీర్ అడ్వాన్స్‌మెంటు, పర్సనాలిటీ డెవలప్‌మెంటు క్లాసులు జరిగేవి. నేను చదివిన కార్పొరేటు జూనియర్ కాలేజీలో యిలాంటి క్లాసులు జరిగేవి. వీటన్నిటి సారాంశం ఒకటే. ఎదుగు ఇంకా ఎదుగు. జీవితంలో అన్నింటికంటె కెరీర్ ముఖ్యం. కాబట్టి ఒకటే లక్ష్యంగా వుండాలి అది కెరీర్. ఇలాంటి ఉపదేశాలు బాగా తలకెక్కాయి. అందుకే ఎప్పుడూ కెరీర్ మంత్రం జపించేవాణ్ణి.

మనం థర్డ్ యియర్‌లో వుండగా భాస్కర్ కొత్తగా మన కాలేజీలో చేరాడు. వాడు పదిమంది ఎక్కడుంటే అక్కడికి వచ్చేవాడు. మాట్లాడుకునేది శ్రద్ధగా వినేవాడు. సమయం సందర్భం చూసివాడూ మాట్లాడేవాడు. సంఘం, సమాజం, విద్యార్థి వగైరాల గురించి చెప్పేవాడు. కరపత్రాలు పంచేవాడు. చిన్న చిన్న పుస్తకాలు యిచ్చేవాడు. అధ్యయనం తోనే సమాజం ప్రజలు అర్థమవుతారనే వాడు. సమాజంతో సంబంధం లేకుండా కెరీర్ లేదనేవాడు. ఉందనుకొని భ్రమపడి ఎదగడానికి ప్రయత్నించినా సుఖ సంతోషాలు దక్కవనేవాడు. అధ్యయనంతో శాస్త్రీయ అవగాహన పెరుగుతుందని, శాస్త్రీయ అవగాహన సమాజాన్ని మానవ సంబంధాన్ని సరియైన కోణం నుండి చూపెడుతుందని చెప్పేవాడు. అలాంటి అవగాహన లేకుండా మనం వ్యక్తం చేసే అభిప్రాయాలు కావని, ఎవరి అభిప్రాయాల్నో చిలక పలుకుల్లా వల్లించడమేనని చెప్పేవాడు. మీరు ముభావంగా వినేవారు. నేను వాదించేవాణ్ణి కెరీర్ మాత్రమే మాయాజాలంలో చిక్కుకున్న మీరు నన్ను అనుసరించేవారు."

"అది సరే కెరీర్ పరంగా నువ్వు ఎలా ఎదిగావ్. ఇంతకాలం ఎక్కడున్నావ్? ఏమేం చేశావ్? అని అడిగితే అది వదిలి ఏమేమో

చెపుతావేంటి?" అడిగాను అసహనంగా.

"సంబంధం వుంది కాబట్టే ప్రస్తావించాను. అయినా నువ్వు అడిగావు గనుక ముందు నా సంగతి చెప్పి తరువాత యితర విషయాలకు వస్తాను.



ఇంజనీరింగు పూర్తికాగానే అమ్మ నాన్న మామ అంతా పెళ్లి చేసుకోమన్నారు. కెరీర్‌లో ఎదగాలంటే యంసిఎ, యంబిఎ చదవాలన్నాను. మామయ్య ఎక్కడ అప్పులు తెచ్చాడో ఏంచేశాడో తెలియదు. అవీ చదివించాడు.

మరలా పెళ్లి ప్రస్తావన వచ్చింది. జీవితంలో స్థిరపడాలి గనుక రెండు మూడేళ్ల ఆగమన్నాను. నాలో ఏదో మార్పు వచ్చిందని అమ్మకి అనుమానం కలిగింది.

ఒంటరిగా నన్ను నిలదీసింది. మేనరికపు పెళ్లిళ్లే మంచివి కావన్నాను.

"నిన్ను చదివించడమే కాదు నాకు మందులు మాకులు యిప్పించి బతికిస్తుంది మామయ్యే. మన కుటుంబాన్ని పోషిస్తున్నది మామయ్యే. మామయ్య ఆస్తిపాస్తులు హరించుకుపోయాయి. అప్పుల్లో వున్నాడు. నీవు కాదంటే నేనూ మీ నాన్నే కాదు, మామయ్య సునీత కూడా బజార్న పడాల్సి వస్తుంది." అమ్మ బాధతో ఆందోళనతో బతిమాలుతూ చెప్పింది.

సునీత పెళ్లి బాధ్యత తీసుకొంటానని చెప్పాను.

వచ్చే నెల నుండి నెలనెలా డబ్బు పంపిస్తానన్నాను.

అమ్మ ఏం మాట్లాడలేదు. నాకేసి ఒక చూపు చూసింది. పురుగూ పుట్రని కూడా అమ్మ ఎప్పుడూ అంత అసహ్యంగా చూసి వుండదు.

ఇంట్లో మరి రెండు రోజులున్నాను. అమ్మ మాట్లాడలేదు. నాకేసి చూడనేలేదు. నాన్న, సునీత కూడా మాట్లాడలేదు. ఆ రెండు రోజులు మామయ్య ఊళ్లో లేడు.

బొంబాయి ఇంటర్వ్యూకి వెళ్లాను. మల్టీనేషనల్ కంపెనీలో ఉద్యోగం వచ్చింది. స్టేట్స్ వెళ్లాను.

మన కాలేజీ చదువుతున్నప్పుడు భాస్కర్ చెప్పినట్లు నేను నాలాంటి వాళ్లు బహుళజాతి కంపెనీలకు ఊడిగం చేశాం. చేస్తున్నాం. అలా చేయడాన్నే కెరీర్ డెవలప్‌మెంటు అని ముద్దు పేరు పెట్టుకొంటున్నాం. మన ఆలోచనల్ని అభిప్రాయాల్ని కుటుంబ సంబంధాల్ని మొత్తంగా మానవ సంబంధాల్ని పణంగా పెడుతున్నాం.

ఇక మా కుటుంబం విషయానికి వస్తే మా అమ్మ చాలాకాలం నుండి జబ్బు మనిషి. సునీత విషయంలో నా నిర్ణయం అమ్మకి పెద్ద షాకయింది. అమ్మ మంచాన పడింది. కొద్ది నెలలకే కన్ను మూసింది. నాన్న అన్నపానాలు మానేశాడు. పదిరోజుల్లో ఆయన చనిపోయాడు. దెబ్బ మీద దెబ్బకి కోలుకోలేక మామయ్య మతిస్థిమితం కోల్పోయాడు. సునీత, మామయ్య ఊరొదిలి వెళ్లారు.

ఈ ఘటనలన్ని జరిగిన కొన్ని నెలలకు మా ఊరు వెళ్లాను. స్టేట్స్ నుండి వచ్చానని ఊళ్లో వాళ్లకి తెలుసు. ఎవరూ ఆప్యాయంగా మాట్లాడలేదు. అడిగిన ప్రశ్నలకు ముక్తసరిగా అవును, కాదు, తెలియదు లాంటి సమాధానాలు చెప్పారు. చీడపురుగుని చూసినట్లు ఈసడించుకొన్నారు. ఎక్కువసేపు వుండలేక వెళ్లిపోయాను.

జరిగిన ఘటనలు నన్ను కలచివేశాయి. కాని నేను చేసిందేమిటి? కెరీర్ పరంగా ఎదగాలనుకొన్నాను. ఒక మేరకు ఎదిగాను. నా వాళ్లని పూర్తిగా వదిలేశానా? లేదే. వారికి సహాయ సహకారాలు అందిద్దామనుకొన్నాను. వారికి నిరీక్షించే సహనం లేకపోయింది. అంత కృతఘ్నుణ్ణి అయితే ఊరెళ్లి వుండేవాణ్ణి కాదు. ఇవన్నీ అప్పటి నా అభిప్రాయాలు.

మరలా స్టేట్స్ వెళ్లిపోయాను. రాత్రింబవళ్లు కంప్యూటర్లు, లాప్‌టాప్‌లు బిజినెస్ మీటింగులు. కెరీర్ పరంగా ఎదిగాను. చాలా పెద్ద ఉద్యోగాలు చేశాను. అదంతా నా ప్రతిభాపాటవాలకు గుర్తింపనుకున్నాను. పెళ్లి సంసార జీవితం కెరీర్‌కి ఆటంకాలనుకొన్నాను. ఎప్పటికప్పుడు వాయిదా వేసుకొంటూ వచ్చాను.

వయస్సు 40 సంవత్సరాలు దాటింది.

తీరిక లేని పని, అప్పుడప్పుడు వీకెండ్ ట్రిప్స్, చౌకబారు సరదాలు, ఆరోగ్యాన్ని దెబ్బతీశాయి. మెడకి కాలరు వచ్చింది. వేళ్లకి వణుకు పట్టుకొంది. వెన్నెముక వంగిపోయింది. నడుం నొప్పి వదలని నేస్తమయింది.

ఈ దశకి చేరుకొన్న నాతో ఏ బడా కంపెనీకి అవసరం వుంటుంది? నన్ను వదిలించుకొంటుంది. వదిలించుకొంది. అక్కడ ఎక్కువకాలం వుండలేకపోయాను. హైదరాబాద్ వచ్చాను.

కెరీర్ పరంగా ఎదిగాను. జీవితాన్ని కోల్పోయాను.

రెండు నిముషాలు మౌనంగా వుండిపోయాం. ఇంతకూ భాస్కర్ ఎక్కడున్నాడు? ఏం చేస్తున్నాడు?" తేజా అడిగాడు.

'భాస్కర్ బి.టెక్ పూర్తి చేసి పెళ్ళి చేసుకున్నాడు. రెండు మూడేళ్ళు ఎక్కడో ఉద్యోగం చేశాడు. ఆ డబ్బుతో హైదరాబాద్‌లో ఒక అపార్టుమెంటు కొనుక్కున్నాడు. సిటిలోనే ఏదో ప్రజాసంఘంలో నామమాత్రం జీతంతో హోల్‌టైమర్‌గా పని చేస్తున్నాడు. ఎప్పుడూ ప్రజలు, ప్రజా సంఘాలు, ప్రజా సమస్యలు, పోరాటాలు – అందుకు అవసరమైన కరపత్రాలు, బుక్‌లెట్‌లు రాయడం, పంపిణీ చేయడం వాడి కార్యక్రమాలు" చెప్పాను.

"వాడి ఆలోచనా తీరులో మార్పులేదన్నమాట. నేను, నాలాంటి వాళ్లు రెక్కలు కట్టుకొని ఎగరాలని ప్రయత్నిస్తున్నాం. ఇంకా ఎగిరే ప్రయత్నంలో ఆకాశం నుండి భూమి మీద పడుతున్నాం. రెక్కలు విరుగుతున్నాయి. నిటారుగా నిలబడలేకపోతున్నాం. సూటిగా చూడలేక పోతున్నాం. ప్రజల మధ్య వుండి కూడా ప్రజలకు దూరమవుతున్నాం. ఒంటరితనాన్ని భరించలేక తాగుతున్నాం. తిరుగుతున్నాం. చౌకబారు సరదాలు వెతుక్కొంటున్నాం. జీవితంలో కోల్పోయిన శాంతిని వెతుక్కుంటున్నాం. అసలు జీవిత లక్ష్యం ఏమిటి? గమ్యం ఏంటి? జీవితం పట్ల ఎలాంటి దృక్పథం అలవరచుకోవాలి? ఇవన్నీ నన్ను కలచివేస్తున్న సందేహాలు. ఇక భాస్కర్ సంగతికి వస్తే అతడు భూమి మీద ఉన్నాడు. ఒకటి రెండడుగులే అయినా ముందుకే వేస్తున్నాడు. అందుకే వాడు నా సందేహాలకు సంతృప్తికరమైన సమాధానాలు చెప్పగలడనుకుంటున్నా. భాస్కర్‌ని కలవాలి. ●

## నచ్చిన పుస్తకం




# చిలిపి పదాల్లో చిగురు తొడిగిన మత సామరస్యం- రాణీ గారి కథలు

■ కోరం రాజబాబు

**కొ**న్ని కథలు బరువుగా సాగిపోతాయి. మరికొన్ని కథలు చదివితే గుండెలు బరువెక్కుతాయి. అయితే రచయిత సలీం రాసిన 'రాణీగారి కథలు' మనిషిని క్షణం తట్టిలేపి సుదీర్ఘ ఆలోచనలో పడేస్తాయి. మన మెక్కడున్నామో గుర్తు చేస్తాయి. మనసుకు హాయిని కలిగిస్తాయి. చిలిపి ఊహల్లోకి లాక్కెళతాయి. మతం కన్నా తీయటి అనుబంధం గొప్పదని, ఆ బంధంలో పుట్టే ప్రేమ శాశ్వతమైందని చెప్పిన తీరు ఎంతైనా అభినందనీయం.

నిజానికి సలీం రాసిన కథలు చదవటానికి సరళంగా ఉన్నప్పటికీ... ప్రతి కథలోనూ ఓ ప్రయోజనం నిగూఢంగా ఇమిడి ఉండటం హర్షనీయం. కథలన్నీ సంసార పక్షంగా... సరదాగా సాగిపోయాయి. కథా నాయిక, కథా నాయకుని పాత్రలను తీర్చిదిద్దిన తీరు అద్భుతం. అక్కడక్కడా కథనం కాగితం పడవల్లా తేలిపోయినప్పటికీ ప్రతి కథలోనూ ఓ పూలవాన... మత సామరస్యం అనే పరిమళాన్ని అందించి 'బాగా చెప్పారు' అనేలా రూపుదిద్దుకోవటం నిజంగానే బాగుంది.

ప్రేమే దైవం అనే కథలో 'ప్రేమ' కన్నా మనిషిని ప్రభావితం చేసేది మరొకటి లేదని కథానాయకుడు చెప్పిన తీరుకు కథానాయిక నిశ్శబ్దంగా ఉండిపోయిందంటే ఆ పద ప్రయోగంలో ఎంతబలం ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఆకాశమే పందిరి కథలో ఆత్మీయులుంటే చాలు ఖరీదైన పెళ్ళి ఏర్పాట్లు అవసరమే లేదని చెప్పిన తీరు ఈనాటి పెళ్ళి ఆర్భాటాలకు చెంపపెట్టు. నల్లటి జలపాతం అనే కథలో ఓ సరదా సన్నివేశం హాయిగా నవ్విస్తూనే ఓ శృంగార లోకంలోకి తీసుకెళ్తుంది. బారెడు జుట్టు కత్తిరించటం ఇష్టంలేని కథానాయకుడ్ని అదే జుట్టుతో ఓ క్షణం శృంగార రసాన్ని కుమ్మరించి అతన్ని తడిపి ముద్దచేయటం సందర్భానుసారం అమోఘమైన ప్రయోగం.

దద్ధోజనం కథలో మతాలు వేరైనా అలవాట్లు మార్చుకోనవసరం లేదని, తాగేనీళ్ళు కూడా మనకు నచ్చినట్లు త్రాగొచ్చని, ఎంగిలి అనేది వ్యర్థమని చెప్పటం ఒక రకంగా నేటికీ చాలా గ్రామాల్లో దళితులకు హోటల్స్‌లో ప్రత్యేక గ్లాసులు ఉన్న అంశాన్ని నేరుగా చెప్పకపోయినా రచయిత ఈ సందర్భాన్ని చాలా గొప్పగా ఉపయోగించుకోవటం చూస్తే ఆయనకున్న సామాజిక స్పృహ స్పష్టంగా తెలుస్తుంది.

చాలా కథల్లో మతానికి సంబంధించిన విషయాలు కథా గమనాన్ని చివరిదాకా తీసుకెళతాయి. చివర్లో ఇద్దరిలో ఎవరో ఒకరు చిన్న ఎడ్జెస్ట్‌మెంట్‌తో ముగింపు పలకటం, కథలో సంభాషణలు ఏ కథలోనూ సీరియెస్‌నెస్ కనబడకపోవటం ఈ కథలకు ఉన్న ఒక ఆకర్షణగా చెప్పొచ్చు. ఈ కథల్లో స్పష్టంగా కన్పించిన మరో విషయమేంటంటే సూటిగా... ఒంపులు తిరగకుండా ఒకే విషయంపై సాగిపోవటంతో ఎక్కడా కన్ఫ్యూజన్ ఉండదు. మనసుకు మడి లేదు అంటూనే మనిషికీ... మంచితనానికీ... మానవత్వానికి చక్కని, చిక్కని పరిమళాన్ని అద్దిన రచయిత కలం నుండి మరిన్ని ఇలాంటి కథలు రావాలని ఆశిద్దాం. ●

## నచ్చిన పుస్తకం




# కథా సంద్రంలోంచి ఎగిసిన కవితా కెరటం

■ డా॥ రాధేయ

జీవితాన్ని జీవితంలాగా సహజంగా ఉంచేతత్వం కవిత్వానిదే. ఉత్తమ కవిత్వం మన మానసిక స్థాయిని ఉన్నతీకరిస్తుంది. గొప్ప జీవితం కన్నా గొప్ప పాఠకుడు ఉండడు. తాను దర్శించిన జీవితం, ఎదురైన అనుభవాలే కవిత్వానికి ప్రేరణ. అనుభవం వ్యక్తిగతమే అయినా తన దృష్టి సార్వజనీనంగా ఉండాలి.

ఆధ్యాత్మిక గ్రంథాలు చదివే తండ్రి నుండి అధ్యయన శక్తినీ జీవితపు విలువల్నీ తెల్సుకొని–

అతిథులకు కొసరి కొసరి వడ్డించే తల్లి నుండి ఈ విశాల ప్రపంచంలో దార్శనిక ప్రవృత్తిని అలవర్చుకొని–

సహచరుని సాహిత్యాభిమానం ప్రోత్సాహం, అదే సామాజిక వేదనలో తపనలో, కళ్ళముందు దృశ్య మానమవుతున్న సంఘటనలన్నీ కథా వస్తువులుగా రూపొందించుకొని కథా రచయిత్రిగా సాహితీ లోకంలో గుర్తింపు పొందింది వి. ప్రతిమ.

ఈమె కథలన్నీ సహజ సున్నితమైన స్త్రీల భావజాలం నుండి పుట్టి కుటుంబాన్ని సమాజాన్ని వీక్షిస్తాయి. తన మొదటి కథా సంపుటి 'పక్షి' (2004) ద్వారా పాఠకుడి మనసుపై, ఆలోచనలపై గాఢమైన ముద్ర వేసింది. ఈ పుస్తకం ప్రచురణకు ముందుగా సుశీలా నారాయణరెడ్డి ట్రస్టు పురస్కారం తర్వాత చాసో పురస్కారం స్వీకరించారు.

రెండవ కథా సంపుటి 'ఖండిత' (2008) ద్వారా తన కథా రచనలో పరిణితి మరింత పెరిగింది. ఆలోచనా సాంద్రత పెరిగింది. కథనంలో కొత్తదనం అన్వేషణ పెరిగింది. ఇందులో వర్తమాన వాస్తవ జీవిత కథల్ని వినిపిస్తుంది.

ఈ రెండు కథా సంపుటాల్ని కూలంకషంగా చదివిన నాకు కల్గిన ఆశ్చర్యమేమంటే– కథల ప్రారంభంలోనూ, పాత్రల సంభాషణల్లోనూ, రచయిత్రి వ్యాఖ్యానాల్లోనూ అంతర్లీనంగా కవితా ప్రవాహం దృశ్యమానం కావడమే. అక్కడక్కడా కవి సమ్మేళనాల్లో వీరి కవిత్వం విన్నాను. 'మీరు చక్కగా కవిత్వం రాయగలరు. రాయండి. ఒక కవితా సంపుటిని కూడా వెయ్యండి' అని సలహా ఇచ్చాను.

నిజంగా అన్నంత పనీ చేసి చూపించారు. 'రెండు భాగాలు' కవితా సంపుటిని తీసుకొచ్చారు. ఇందులో ఎక్కడా అభివ్యక్తి గాడి తప్పలేదు. కవితా వస్తువు జీవితం నుంచి పారిపోలేదు. భావుకత, శిల్ప సమన్వయం వీరి కవిత్వంలో 'రెండు భాగాలు' గా అమరినాయి. ఈ రచయిత్రి కవిత్వం పట్ల తనకున్న మమకారాన్ని తన మాటల్లోనే వివరిస్తూ–

"ప్రాథమికంగా నేను కథా రచయిత్రినయినప్పటికీ కవిత్వమంటే ప్రాణం. అందుకేనేమో నా కథల్లో కవిత్వాంశ దోబూచులాడుతుందంటారు అంతా... బహుశా కవిత్వం వ్రాయలనుకొని ఏదో ఉద్విగ్న క్షణంలో కథా ప్రక్రియలోకి జారిపోయి వుంటాను" అని ప్రకటిస్తుంది.

ఇక కవిత్వంలోకి మనం ప్రవేశిస్తే ప్రతిమ కవిత్వ వ్యక్తిత్వం దర్శనమిస్తుంది. తల్లిగా, గృహిణిగా, తన అస్తిత్వ మూలాల్ని ప్రశ్నిస్తూ తీవ్ర స్వరంతో పలుకుతుంది. ఆధిపత్య భావజాలంతో ప్రేమ రాహిత్యంలో, బ్రతుకు పంజరంలో రెండు భాగాలు విడిపోయి తన మూలాల్ని తొలుచుకొని స్త్రీగా నిలబడి మాట్లాడుతుంది.

నిన్ను ప్రేమించనూ లేను, ప్రేమించకుండా ఉండనూలేను–
అయితే నన్నణిచి, అణిచి అంచులకు నెట్టివేసే
నీ ఆధిక్యతను ఎండకట్టేదాకా
ఏకచ్ఛత్రాధిపత్యాన్ని తగలేసేదాకా
నా వాళ్ళందరితో కలిసి గళం విప్పేదాకా
ఇదిగో...నేనిలాగే...
రెండు భాగాలుగా బ్రతుకుతుంటాను.

ఈ కవిత ఆధిపత్య బాధితురాలైన స్త్రీ జీవన వాస్తవికతను ప్రతిబింబిస్తుంది.

వీరి భావుకత్వం వెనుక బలమైన ఆత్మవిశ్వాసం తొణికిసలాడుతుంది. దుర్భర వేదనను చైతన్యం అలా అధిగమిస్తుంది. తన కవిత్వానికి సార్వజనీన దృక్పథాన్ని ప్రకటించుకొంటుంది.

గతానికీ వర్తమానానికీ నడుమనున్న
బలమైన లింకు లేవో తెగి నెత్తురోడుతున్న దాన్ని
బతుకులో జీవరసాన్ని నింపుకునే క్రమంలో
ఎప్పటి కప్పుడు...
సజీవమైన వాక్యాల వెదుకులాటలో
నా కవిత్వం ఎండిపోయింది
నాలోపలి తడి ఆరిపోయింది.

వర్తమాన సమాజంలో కన్న తల్లుల మనోవేదన. అభద్రతా

భావం విపరీత పోకడలు పోతోంది. నేటి యువతరానికి భౌతికావసరాలు, విలాసాల పట్ల ఉన్న ప్రేమ కన్న వారిపట్ల, వారి బాధ్యతల పట్ల లేకపోవడమే విచారకరం. కుటుంబ వ్యవస్థలో ప్రేమలూ, అనుబంధాలు ప్రధాన పాత్ర వహిస్తాయి. ప్రేమ రాహిత్యంలో ఉన్న కుటుంబం విచ్ఛిన్నమవుతుంది. మరలా మరలా విత్తబద్ధ దుఃఖం వాత్సల్యం కోసం, ఓదార్పు కోసం తండ్లాడుతుంది. అంటూ–

"నీకు రెక్కలు మొలుస్తున్న సంగతి గుర్తించక
ఇంకా నా గొడుగు కిందే వున్నావని భ్రమించాను
నీ ప్రేమకోసం, నీ జీవితం కోసం నువ్వెగిరి పోయావు
నా వాత్సల్యంతో నేనిక్కడ తండ్లాడుతున్నాను
ఓదార్చడానికిప్పుడు మా అమ్మలేదు
ఇక్కడ మీ నాన్నా లేదు/ఇంత జరిగాక ఇంకా....
ఇంకా నా మొండి ఊపిరి ఆడుతూనే వుంది
నా రాతి గుండె కొట్టుకుంటూనే వుంది"

మూడో ముఖాన్ని తీసి పక్కన పెట్టి నేనిప్పుడు నాలుగో ముఖాన్ని తొడుక్కోవాలి. నాలో నన్ను లోతుగా తవ్వుకోవాలి. సహనం నింపిన గాయాలను విస్తరించుకుంటూ ప్రయాణచాలంటూ ఆధిపత్య భావజాలంతో ఘర్షణ పడుతూ, తీవ్ర నిరసనను తెలియజేస్తుంది.

"వ్రణాలన్నింటికీ లేపనం రాయడం కోసం
నేను ప్రతిసారీ నాలుగో ముఖాన్ని తొడుక్కుంటాను
నిర్వికల్ప, నిశ్శబ్ద గీతాలాలపించిన గొంతులోకి
సప్తస్వరాలను వొంపుకుంటాను
మిగిలిన మూడు ముఖాల్లో నేను పీడితని
నాలుగో ముఖంలో మాత్రం విజేతని !"

ఇవాళ నిర్మలమైన ప్రేమలేదు. వ్యామోహం తప్ప. మోహపు జలపాతం లోకి తల్లకిందులుగా దూకే యువత, కాదంటే కత్తి పుచ్చుకొని క్లాస్‌రూముల్లోకి ప్రవేశించే ఉన్మాదుల్ని ఈమె తీవ్రంగా ఛీ కొడ్తుంది.

ప్రేమించమంటూ మనిషిని మథనపెడితే
ప్రేమ కలుగుతుందా? రోతపుడుతుంది కానీ...

ఎర్ర సముద్రాలైన కళ్ళతో బొంగరంలా తిరిగే అమ్మను పరామర్శిస్తుంది. రాత్రి అన్నం కుండని కాళీ చేసిన కుక్క వైనాన్ని వివరిస్తుంది. మొగుడితో మైత్రినీ, కుటుంబంతో ప్రేమనీ కోల్పోతూ దుఃఖపు సరిహద్దుల్లో సుప్తశిలగా మిగిలిన ఇల్లాలి కోసం ఏదో ఒక రోజు మూడో కన్ను తెరవక తప్పదని ప్రకటిస్తుంది.

ఇంతకంటే రోజుకోసారి/అరేబియన్ సీని ఈదడం తేలిక తల్లీ
పెళ్ళికి నిర్వచన మిదే అయితే/ఏదో ఒకరోజు నేను మూడోకన్ను/తెరవక తప్పదు"

జాతీయ సంక్షోభాల్లో ప్రపంచ దేశాలన్నీ ఒక్కటిగా నిలబడి మాట్లాడాల్సిన సందర్భాల్ని గుర్తుచేస్తుంది. జ్ఞాన రశ్మి సోకని చీకటి వంట గదుల్లో నవ్వు జాడే ఎరుగని వనితలను గురించి శోకమయమవుతుంది.

ఏ పురాతన స్త్రీ ప్రేమ గాథనడిగినా/ప్రతి అమ్మకథా ఒకటేనంటాయి.

మాట్లాడవలసిన చోట మౌనంగా ఉండడం నేరమేనంటూ మరణ వాంగ్మూలం మీద బతుకు పాట వ్రాస్తుంది.

మాట్లాడు.....
మాట్లాడాల్సిన సందర్భంలో మౌనం కూడా నేరమే
స్వచ్ఛమైన వెలుతురు గవాక్షాలని తెరుచుకొని
నీ నిర్ణయాల్ని నిర్మొహమాటంగా ప్రకటించు
ఎన్నడో జారవిడుచుకున్న ఆత్మగౌరవ కవచాన్ని
మళ్ళీ ధరించు....

ప్రపంచ బ్యాంక్ పెత్తనం, ప్రభుత్వ నిర్లక్ష్యం, బహుళ జాతి కంపెనీల దుర్మార్గ ప్రయోగాలకు రైతుల, చేనేత కార్మికుల జీవితాలు బలైపోతున్నాయి. ఈ అప్పుల బావులతో, ఆకలి చావుల అలా తన ఊరి ముఖచిత్రమే మారిపోయిందని చెప్తూ–

నెర్రెలు వారి, రెతన్న ఎముకల ఎరువుతో
నిండిన మా ఊరినేల
నూనె రంగుల్లో కలగంటోంది
కనుచూపు మేర కరువు దాకా సాక్షీభూతమై
నివ్వెరపోయి నిల్చున్న మా తూరుపు కొండ
నా కుంచెకొదగనంటోంది.

పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల పక్షాన నిలబడి మాట్లాడుతుంది. ఏ గుండె తప్పు విన్నా, ఏ గూడెంలోకి తొంగి చూసినా ఒకటే నిరసన, ధిక్కారస్వరం వినిపిస్తుందని ప్రకటిస్తూ–

మాకు పోలారమొద్దు... మమ్మల్ని ముంచొద్దు
గాలి అలల నుండి.. ఏటి గలగలల నుండే
మట్టి పరిమళాలతో పెకలించి
అడవిపూలని మైదానాల మీదికి విసరొద్దు
మీ వద్ద తుపాకులుంటే... మాకాడ విల్లంబులున్నాయి
వేట మా జీవనంలో భాగం
పోరు మా శరీరంలో సగం !....

ఈ కవితలో కోయగూడెం గిరిజనుల ధిక్కారం వినిపిస్తుంది. ఒక యుద్ధ విరామపు రాత్రిలో గులకరాళ్ళ గుట్ట వద్ద నిలబడి గొంతు కడ్డం పడుతున్న చిక్కటి చీకటితో సంభాషిస్తుంది. తానే నిలువెల్లా దుఃఖమై కరిగిపోతుంది.

ఇదీ ప్రతిమ కవిత్వం రెండు భాగాలుగా విడిపోయిన ప్రతిమ అంత రంగమథనం. కుటుంబ జీవనంలో పురుషాధిపత్యాన్నీ, క్రూరత్వాన్ని నిరసించి ప్రశ్నించింది. లుప్తమవుతున్న మానవ సంబంధాలను ఎండగట్టింది. స్త్రీని మార్కెట్ వస్తువుగా మలచే వర్తమాన వ్యాపార విశృంఖలతను తీవ్రంగా గద్దించింది. తల్లి ప్రేమనే కాదు ఆ తల్లి బాధ్యతల్ని కూడా పంచుకోవాలని వర్తమాన యువతరాన్ని హెచ్చరించింది. సమస్త మానవీయ విలువల్ని మనముందు ప్రవేశపెట్టి తన అనుభవాల్ని, గుండెగాయాల్నీ తనదైన దృష్టికోణంలో కవిత్వకరించింది.

ఇందులో ఉగాది గురించిన కవిత, జల్లు, మంచు మరణం లాంటి కవితలు చేర్చకుండా వుండే బావుండేది. అక్కడక్కడా అక్షరదోషాలు తప్పలేదు. ఇవి కేవలం సవరింపులు మాత్రమే మున్ముందు మరింత ఉత్తేజంతో ఈ కవితా ప్రతిమ తన ప్రతిభను చాటుకొంటుందని నా విశ్వాసం. కవితాభిమానులందరూ తప్పక చదవ దగిన కవితా సంపుటి రెండు భాగాలు.

●

స్మృతి

# అభ్యుదయ కవి కాంచనపల్లి

◆ పున్న అంజయ్య



## కాంచనపల్లి చినవెంకట రామారావు

"కాళ్ళకును బంధాలు/ చేతుల కరదండాలు
మూతులకు చిక్కాలు/ మూల్గితే లాఠీలు
రొమ్ములకు తూటాలు/ రోతలీ పాలన" లంటూ బానిస బ్రతుకుల యధార్థ, వ్యధార్థ వాస్తవాల్ని తన కవితలో నిర్భయంగా చెప్పిన అభ్యుదయ కవి కాంచనపల్లి చిన వెంకటరామారావు. నల్లగొండ జిల్లా సాహిత్యరంగానికే పెద్ద దిక్కులాంటి వారు. తెలంగాణా విముక్తికోసం ఉద్యమంలో ప్రముఖ పాత్ర వహించిన కాంచనపల్లి కవిగా, రచయితగా సుప్రసిద్ధులు. 1921 ఏప్రిల్ 21న సూర్యాపేటలోని రావిపాడు గ్రామంలో జన్మించిన కాంచనపల్లికి 1934 నుండి సారస్వత పరిచయం కల్గింది. స్వాతంత్ర్య పోరాటంలో అడుగడుగున కలిగిన అనుభూతులకు శబ్దరూపం ఇచ్చి అక్షరత్వం కల్పించారు. ఫలితంగా 'అరుణరేఖలు' అనే కావ్యం వెలువడింది. నిజాం నిరంకుశ అధికారంపై తిరుగుబాటుతో, సమాజంలోని అన్యాయాలపై ధిక్కారంతో ప్రజ్వలించి రౌద్రంగా, మహోద్రేకంగా అరుణగీతాల్ని రాశారు. ఇందులోని ప్రతి పద్యం సూదిపోటులా గుండెల్ని సూటిగా తాకుతుంది. ఈ కావ్యం ద్వారా కాంచనపల్లి అభ్యుదయ కవులకు, ప్రజాకవులకు మార్గదర్శకులైనారు.

కాంచనపల్లి 1938–39లో నల్లగొండలో తొమ్మిదో తరగతి చదువుకుంటున్న రోజుల్లో 'సాహితీ మేఖల' వ్యవస్థాపకులైన అంబటిపూడి వెంకటరత్నం, రాఘవాచార్యులనబడే కవి అకాలమరణంపై రాసిన స్మృతి గీతాలు పులిజాల రంగారావు గారింట్లో చదివినపుడు ఆ పద్యాలు కాంచనపల్లిని ఎంతో ప్రభావితుణ్ణి చేశాయి. అప్పటికీ సురవరం వ్యావహారిక భాషావాద పక్షానికి వచ్చారు. యతి ప్రాసలు లేకుండా పద్యాలెందుకు రాయకూడదు. కవిత్వ గుణం, పదార్థం వుంటే అవి రాణిస్తాయి కదా! యతి ప్రాసలు కేవలం శబ్దాలంకారాలే కదా! అన్న వాదనలు ముమ్మరంగా సాగుతున్న రోజుల్లో కాంచనపల్లి సాహసించి యతి ప్రాసలు లేకుండా పద్యాలు రాసి ఎవరికీ చెప్పకుండా గోల్కొండ పత్రికకు పంపిస్తే అప్పుడు సురవరం ప్రకటించారు. కాంచనపల్లి దుందుడుకుతనానికి ఇదొక చక్కని నిదర్శనం.

పానగల్లులో ప్రతాపరుద్ర ఆంధ్ర భాషానిలయం ఏర్పాటులో కాంచనపల్లి ప్రముఖ పాత్ర వహించారు. 1944–45వ సంవత్సరమది. అప్పటికే నిజాం వ్యతిరేకపోరాటాలు సాయుధ పోరాటాలుగా మారి నిజాం భూస్వామ్య వ్యవస్థను కూకటి వేళ్ళతో పెకలించడానికి సిద్ధమవుతున్న చరిత్రాత్మకమైన ఘట్టం. అలాంటి తరుణంలో కాంచనపల్లి ఆధ్వర్యంలో, నల్లగొండలో ఆంధ్ర సారస్వత పరిషత్తు 3వ మహాసభలు జరిగాయి. ఈ సభలను గాడిచర్ల హరిసర్వోత్తమరావు, జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తి, బిరుదు వేంకటశేషయ్య, ఉస్మానియా మాజీ వైస్ ఛాన్సలర్ రావాడ సత్యనారాయణ, మునిమాణిక్యం నరసింహారావు వంటి సుప్రసిద్ధులెందరో పాల్గొన్నారు. మూడు రోజులపాటు సాగిన ఈ సాహిత్య తిరునాళ్లలో ఎన్నో సాహిత్య, సాంస్కృత్య, సాంస్కృతిక, సంగీత ఉత్సవాలు ఘనంగా జరిగాయి.

1946లో చందూరులో జరిగిన సాహితీ మేఖల దశమ వార్షికోత్సవాల సందర్భంలో కాంచనపల్లి 'మనవూళ్ళో కూడానా!' అనే కథలు రాశారు. ఆనాడు ఈ కథలు ఎంతో ప్రసిద్ధమైనవి. వెట్టి చాకిరీ వివిధ రూపాల కేంద్రీకరణను ఇందులో చక్కగా చిత్రీకరించారు. తొమ్మిది కథలతో వెలువడ్డ ఈ సంపుటి దొరల దౌర్జన్యం, పేదల దుర్భరమైన బ్రతుకుని చూపించింది.

కాంచనపల్లి తన కవిత్వాన్ని ఉద్యమ నేపథ్యంలో ప్రజలకు ప్రాణవాయువుగా అందించాడు. నిరంకుశాధికారులకు వ్యతిరేకంగా ప్రతిఘటనలను ప్రతిబింబిస్తూ పోరాట పాటలు రాశారు. ఇంకా వీరు జిల్లా సమగ్ర సాహిత్య సమాచారాన్ని, అజ్ఞాతంగా వున్న ఎందరో కవుల గురించి, మరుగున పడిన సాహిత్య సంస్థల వివరాల్ని గురించి అనేక వ్యాసాలు రాశారు. నల్లగొండ సాహితీ మిత్రుల ఆధ్వర్యంలో వెలువడిన 'దర్పణం' సాహిత్య మాసపత్రికకు సంపాదకుడుగా వుండి కావ్య సమీక్షలు చేశారు. నీలగిరి, గోలకొండ, అభ్యుదయ పత్రికలకు అనేక వ్యాసాలు రాశారు. జిల్లాలోనే గాక రాష్ట్ర ఉద్యమ సాహిత్య రంగాలలో కూడా కాంచనపల్లి ప్రముఖ పాత్ర వహించారు. రాష్ట్ర అభ్యుదయ రచయితల సంఘ ముఖ్యుల్లో ఒకరుగా వుండి అభ్యుదయ భావాల్ని పెంపొందించుకున్నారు.

సాహిత్యరంగంలోనే కాకుండా రాజకీయాలలో కూడా కాంచనపల్లి గొప్ప అనుభవజ్ఞులు. 1952–57 మధ్య బూర్గుల రామకృష్ణారావు హయాంలో చినకోడూరు నియోజకవర్గం నుండి శాసనసభ్యులుగా పనిచేశారు. 1957 తర్వాత అనేక ప్రజాసంఘాలలో పనిచేశారు. నిరంకుశ నిజాం ఫ్యూడల్ వ్యవస్థను అంతం చేయటానికి తెలంగాణాలో సాగిన వీరోచిత పోరాటంలో కమ్యూనిస్టుగా స్వయంగా పాల్గొని కడలూరు, రాయవెల్లూరు, వరంగల్లు, నిజామాబాద్ జైళ్ళల్లో నికృష్ట జీవితాన్ని గడిపారు. కాంచనపల్లి నిరంతరం మార్క్సిస్టు గ్రంథాలను అధ్యయనం చేసి సమాజ పరిణామగతిని గురించి స్పష్టమైన అభిప్రాయాల్ని ఏర్పాటు చేసుకున్నారు. జిల్లా కమిటీ ఉపాధ్యక్షులుగా ఉన్నప్పుడు సోవియట్‌ను దర్శించే సదవకాశం కలిగింది. అప్పుడు తమ పర్యటనానుభవాలను, పొందిన అనుభూతులను 'మధుర స్మృతులు' లో వివరించారు. రాష్ట్ర పౌరహక్కుల కమిటీ సభ్యులుగా అనేక పదవులలంకరించారు. నల్లగొండ జిల్లా రచయితల సంఘానికి అధ్యక్షులుగా కొనసాగి పలు సాహిత్య సభలు నిర్వహించి, ఎన్నో పుస్తకావిష్కరణలను చేపట్టి యువ యువకవులకు స్ఫూర్తిగా సాహిత్య చైతన్యాన్ని కలిగించిన గొప్ప వ్యక్తి.

కవిగా, కథకుడుగా, ఉద్యమకారుడుగా, శాసన సభ్యుడుగా, న్యాయవాదిగా, అభ్యుదయ వాదిగా పేరొందిన కాంచనపల్లి 1992 మార్చి 13న గుండెపోటుతో ఆకస్మికంగా కన్నుమూశారు. ●

## కవిత

# రెండునాలుకలు

**సి.హెచ్. ప్రకాశ్**



యుగ యుగాలుగా
యాగాలు, హోమాలు
పూజలు చేస్తూ వస్తున్నారు
ఈవలి వైపు
దేహమే దేవాలయమని
జీవుడే సనాతన దైవమని
భక్తి కొలది
ప్రవచిస్తారు
ప్రజాబాహుళ్యంలో
ఆవలి వైపుపేదోల్ల కడుపులు కొట్టి
దేవుళ్ళకు ముడుపులు గట్టి శక్తి కొలది
ప్రవహిస్తారు
భక్తి పారవశ్యంలో
ఫలహారాలు
ప్రసాదాలుగా ఆరగిస్తారు... కానీ
నిరుపేదల
కడుబీదల
క్షుద్బాధల

చీకటి చూపులు
చూసీ చూడక
భిక్షువులని గేలి చేస్తారు
భక్తి అంటారు
ముక్తి కోరుకుంటారు
'మంచి మనిషి'
ముసుగేసుకుంటారు... కానీ
అన్నం కోసం

అలమటించే
అన్నార్థులకు
అవిటి వాళ్ళకు
కొంచెం కూడైనా పెట్టరు
మనిషిగా
పరిణామంచెందిన
నాటి నుండి నేటి వరకు
మనుషుల మనసులు

అంతరిక్షంలా
అంతుబట్టవేమో
అందుకే
మతానికి మరణం
గతానికి మరుజన్మ
లేదని తెలిసీ
కాల హరణం చేస్తారు
వీళ్ళు
ఎన్ని హంగులు
నిగారించుకున్నారో మనిషికి?
ఎన్నెన్ని రంగులు
సింగారించుకున్నారో మనసుకు?
ఎలా విప్పేది
వీళ్ళ మనసు పొరలను?
ఎలా చూసేది
వీళ్ళ హృదయపుటరలను?
మనిషిగా పాలెగాళ్ళు
మనసుకు మాత్రం
గరీబోళ్ళు-వీళ్ళు.

# రెక్కలు

**గోపాలుని వెంకటేశ్వర్లు**



పరిమళాన్ని
తాకగలమా?
గుండెల్నిండా
నింపుకోగలం గాని-

ఆలోచన
పూవు!

ఆకాంక్ష
ఆందోళన
జీవితపు నాణానికి
రెండు ముఖాలు-

అనుభవం
పాఠ్య గ్రంథం!

ఎంత
సర్దుకు పోవాలన్నా
కొన్ని సందర్భాలలో
సాధ్యం కాదు-

జీవితం
చాలీచాలని దుప్పటి!

రికార్డులు
సాధిస్తుంటారు
మరొకరు
బ్రేక్ చేస్తుంటారు-

శిఖరాగ్రం
అస్థిరత్వం

ఇవ్వాళ
గెలుపు వారిది
రేపు
మరొకరిది-

జీవితం
నాలుగు స్తంభాలాట!

ఎన్ని వాదనలూ
ఫలించవు
ఎన్ని సాధనలూ
తలొంచవు-

జీవితం
కత్తుల వంతెన!

ప్రేమంటే
తర్కానికి
అందని
స్పందన-

మానవుడు
మహనీయుడు!

గుండె గోడలపై
శిథిల మవుతూ
మమతల
శిల్పాలు-

బతుకు
ఎండమావి!

# స్పందన లేని శిలలం

**బద్ది నాగేశ్వరరావు**



ఏడాదికేడాది కృష్ణపక్షమి చంద్రుడే
పండగా పబ్బమూనూ
పండగల నెలరేడు
అదృశ్యమయ్యే అమావాస్య
అనతికాలంలోనే

పర్వదినాలకే సంస్కృతికీ
పడమటి గాలి చెక్ చెప్పేసింది
పట్టులంగాలు పంచెలు
గొబ్బెమ్మలు పిడకల దండలు
ఛానెళ్ళ జాణల ముందు
హరిలోరంగ హరి

సంసార పక్షపు పల్లెలు
నాగరికత వలువలతో వేశ్యలు
గుప్పెట మూసి వున్న పండగ సంబరం
అప్పుడప్పుడూ తెరచి చూసుకుంటేనే
తాకుతుంది మనసు అంబరం

ఇప్పుడు గ్లోబల్ ధూళితో
గుప్పెట గుట్టు రట్టయ్యింది
వేయిపడగల పాము
నగ్న ప్రదర్శనల విషం
మనమంతా స్పందన లేని శిలలం

నివాళి

# వైరుధ్య జీవిత వ్యంగ్య శిల్పి

■ హరిశ్చంద్ర



**కె.ఎన్.వై. పతంజలి**

సాహిత్యంలోనూ పత్రికా రంగంలోనూ అరుదైన వ్యంగ్య వైభవ పతాక. వైరుధ్య జీవిత దర్శనానికి ప్రతీక. కె.ఎన్.వై. పతంజలి జీవితం ఎంత దుర్భరంగా కపటంగా మురికిగా పిరికిగా వుందో ఆయన కలం అంత కఠినంగా చిత్రించింది. వాస్తవానికి కళ అద్ది కళ్ళకు కట్టింది. పాత్రికేయుడుగా సంపాదకుడుగా విలక్షణ కృషి చేసిన పతంజలి చాలా కాలంగా క్యాన్సర్‌తో పోరాడుతూ 2009 మార్చి 11న కన్నుమూయడం తెలుగు సాహిత్య పత్రికా రంగాలను విచారంలో ముంచింది. అయితే సంప్రదాయిక భాషలో దాన్ని వ్యక్తం చేస్తే ఆయన సహించివుండే వారు కాదని కూడా అందరికీ తెలుసు.

ఆయన పూర్తి పేరు కాకర్లపూడి నారసింహ యోగిపతంజలి. 1952 మార్చి 29న విజయనగరం జిల్లా ఆలమండలో జన్మించిన పతంజలి కాలేజీలో చదువుతున్నప్పుడే విప్లవకర రచనలతో అందరినీ ఆకట్టుకున్నారు. 1975లో పత్రికా రంగంలోకి ప్రవేశించారు. మొదట ఈనాడులో చేరారు. అక్కడే న్యూస్ ఎడిటర్‌గా పనిచేశారు. తర్వాత ఉదయం, ఆంధ్రభూమి తదితర పత్రికలలో పనిచేశారు. తర్వాత కాలంలో టీవీ9లో కూడా చాలా కాలం పనిచేసి స్క్రిప్టులు సమకూర్చారు. చివరి దశలో ఆయన సాక్షి పత్రికకు వ్యవస్థాపక సంపాదకులుగా వుంటూ క్యాన్సర్ వ్యాధిగ్రస్తులవడం మిత్రులనూ సాహిత్యలోకాన్ని విచారంలో ముంచింది. విశాఖపట్టణంలో చికిత్స పొందుతూ దాంతో పెనుగులాడుతూనే ఆయన ఈ నెల 11న మృతిచెందారు. ఆ మరుసటి రోజున అక్కడే అంత్యక్రియలు జరిగాయి.

ఉత్తరాంధ్ర పలుకుబడిపై గొప్ప అధికారం కలిగిన పతంజలికి దోపిడీ వ్యవస్థలో వికృతమై పోతున్న వ్యక్తిత్వ వికారాలు చెప్పలేనంత విసుగునూ, ఆగ్రహాన్ని తెప్పిస్తాయి. గురజాడ, రావిశాస్త్రి, చాసోల వరవడికి కొనసాగింపుగా ఆయనను పరిగణిస్తారు. ప్రకృతినీ, సమాజాన్ని రాజకీయ అధికార వ్యవస్థలనూ అత్యంత నిశితంగా విశదంగా పరిశీలించిన పతంజలి ఏం రాసినా చురుక్కుమనే చమత్కారం అధిక్షేపణ వుంటాయి. రాజ్యానికి నాలుగు అంగాలుగా చెప్పే శాసన, న్యాయ, అధికార, పత్రికా వ్యవస్థల అసలు గుట్టును ఆయన చీల్చిచెండాడారు. ఒకో వ్యవస్థపై ఒక మారణాయుధం లాటి నవల సృష్టించారు. మరో వైపున గడిచిన కాలాన్ని పట్టుకు వేలాడే విగత జీవుల వృథాడంబరాన్ని ఎండగట్టారు. ఇవన్నీ కలసి ఆయన సృజనకు అసాధారణమైన ప్రత్యేకత సంతరించిపెట్టాయి.

పాశ్చాత్య సాహిత్య సంపదనూ, సంప్రదాయ భారతీయ కథన శైలినీ, జానపద పోకడలనూ కూడా ఔపోసన పట్టిన పతంజలి వాటి మేలు కలయికగా తనదైన శైలిని పెంచుకున్నారు. జంతువుల ద్వారా పక్షుల ద్వారా గొప్ప జీవిత సత్యాలు చెప్పించాడు. మరోవైపున ఖాకీవనం పేరిట పోలీసులనూ పెంపుడు జంతువుల పేరిట కుహనా పాత్రికేయులనూ చాకిరేవు పెట్టాడు. చావు దెబ్బ కొట్టాడు. ఆయన ఖాకీవనం ఎంత సంచలనం కలిగించిందంటే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దాన్ని నిషేదించాల్సి వచ్చింది. పిలకతిరుగుడు పువ్వు, గోపాత్రుడు, అప్పన్న సర్దార్, వీర బొబ్బిలి, వేట కథలు, రాజుల లోగిళ్ళు, చూపున్న పాట, దిక్కుమాలిన కాలేజీ, పోయేకాలం, ఒక దయ్యం ఆత్మకథ, మేరా భారత్ మహాన్ తదితర కథలు, నవలలు అన్నిటిలోనూ ఒకో అంశాన్ని తీసుకుని అద్భుత శైలిలో అక్షరీకరించారు. పతంజలి భాష్యం మరో కోవకు చెందుతుంది. సింధూరం చిత్రానికి ఆయన సంభాషణలు సమకూర్చి నంది అవార్డు అందుకున్నారు. మరో కథ ఇదండీ సంగతి పేరిట ఇటీవలే చిత్రంగా వచ్చింది.

ఈ కథలన్ని చదివితే ఆయనకు ఇప్పుడున్న సమాజంపైన ఎంత అసహ్యామో ఆ ప్రభావానికి గురైన మనుషుల మీద ఎంత వెగటో తెలుస్తుంది. కొన్ని సార్లు ఇంత విశ్వాస రాహిత్యమా అని సందేహమూ కలుగుతుంది. అయితే ఈ వ్యవస్థలో తన జీవితానుభవమే ఇంత ద్వేషం కలిగించిందని ఆయన వివరణ. గెలుపు సరే బతకడం ఎలా అన్న పుస్తకం ఇప్పుడు వస్తున్న పర్సనాలిటీ డెవలప్ మెంట్ పుస్తకాలకొక ప్యారడీ వంటిది. ఉన్నత శిఖరాలకు చేరుకోవడం గురించి అదే పనిగా చెబితే సరిపోదని చుట్టూ వున్న ముప్పులను ముంచే మనుషులను గుర్తించాలని ఆయన ఈ పుస్తకంలో హెచ్చరిస్తారు. దేవుడు అసత్యం, పూజారి సత్యం, చట్టం అసత్యం, పోలీసు సత్యం' అంటూ దేని పేరిట ఏది పెత్తనం చేస్తుందో విశదపరుస్తాడు. తన రచనలలో ఆయన మార్మిక వాస్తవిక శైలిని కూడా ఎక్కువగానే వినియోగించారు. మానవ పాత్రలను ఎంత బాగా చిత్రిస్తారో ప్రకృతిలోని ప్రాణిజాలాన్ని గురించి కూడా అంతే అధికారంతో రాయడం ఆయన పరిశీలనా శక్తికి అద్దం పడుతుంది. పతంజలి రచనల్లో ఎక్కువభాగం ఆయన స్నేహితులు 2003లో బృహత్ సంకలనంగా తీసుకొచ్చారు. ఇటీవల మరోసారి మిగిలిన వాటిని సంపుటాలుగా విడుదల చేశారు.

●

## వర్తమానం

# ఎన్నికల సవాళ్ళు

■ తెలకపల్లి రవి



మనరాజకీయాలు చాలా కాలం నుంచి ఎన్నికల చుట్టూనే తిరుగుతున్నాయి. రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ కూడా ముందస్తు వస్తుందా అన్నదే పెద్ద చర్చనీయంగా కాలం గడిచింది. ప్రతిపక్ష శిబిరంలోనూ, పాలకపక్షంలోనూ కూడా ప్రచారాలు వ్యూహ ప్రతివ్యూహాలు, రోడ్డుషోలు జోరుగానే సాగాయి. ఇప్పుడు ఇక జరగబోయే సమరాన్ని గురించిన విశ్లేషణలు, అంచనాలపైనే అందరి దృష్టి కేంద్రీకృతమైంది. వాస్తవానికి ప్రతిచోటా ప్రతివారి నుండీ రెండే ప్రశ్నలు- ఏ సమస్యలు ప్రజలను ప్రభావితం చేస్తాయి? ఎలాటి ఫలితాలు వస్తాయి?

ముందు ఆర్థికాంశాలు జీవన పరిస్థితుల ప్రభావం అత్యధికంగా ప్రజలు శూన్యంలో జీవించలేరు. అధిక ధరలు, ఉపాధి వంటివి వారిని నిరంతరం వేధిస్తుంటాయి. ఇప్పుడు విశ్వవ్యాపిత ఆర్థిక సంక్షోభంలో సలక్షణంగా సంపద్వంతంగా బతుకుతున్నామనుకున్న వారే అయోమయావస్థలో పడిపోవడం చూస్తున్నాం. మరో వైపున మత ఘర్షణలు, దానితో ముడిపడిన వున్న ఉగ్రవాద సమస్యలు కూడా ప్రజలను భయపెడుతున్నాయి. ఆర్థిక సామాజిక పరమైన ఈ అభద్రతాభావన ప్రజల తీర్పును ప్రధానంగా ప్రభావితం చేయడం తథ్యం. ఇందులో మొదటి దాన్ని గురించి మన పాలకులు అసలే మాట్లాడకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. అమెరికా అధ్యక్షుడు ఒబామా సంక్షోభం గురించి భయపెడుతున్నారుగాని సోనియాగాంధీ, వైఎస్‌లు మాత్రం దాన్ని అధిగమించామని ఆనందపడుతున్నారు. (పైగా ఇందుకు కారణమైన వామపక్షాల వత్తిడిని కూడా తమ ఘనతగానే చాటుకుంటున్నారు) కాషాయ సేనాని ఎల్.కె. అద్వానీ కూడా అధిక ధరల కన్నా ఉగ్రవాద దాడులే ప్రజలను ఎక్కువ భయపెడతాయని పాఠాలు తీసుకున్నారు. ఎవరేమి చెప్పినా వాస్తవంలో ఆర్థికాంశాలు ప్రజలపై ప్రబలమైన ప్రభావమే చూపిస్తాయన్నది నిస్సందేహం.

అవినీతిని ఎవరూ పట్టించుకోరన్న భరోసా పాలకపక్షం అభినయిస్తోంది. కాని ప్రపంచ, దేశ, రాష్ట్ర రాజకీయాలను పరిశీలిస్తున్న వారెవరూ ఈ అంచనాతో ఏకీభవించరు. ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధి, పి.వి. నరసింహారావు వంటి వారు ఓడిపోవడానికి అవినీతి, అధికార దుర్వినియోగం ఆరోపణలు ప్రధాన పాత్ర వహించాయి. రాష్ట్రంలో చెన్నారెడ్డి, బీహార్‌లో లాలూప్రసాద్ వంటివారు అన్నీ బాగున్నా ఇలాటి ఆరోపణల వల్లనే అధికారానికి దూరం కావలసి వచ్చింది. వైఎస్‌కు అలాటి అంతర్గత సవాళ్ళు లేవు గనక అయిదేళ్ళు నెట్టుకొచ్చారు. కాని రేపు ఓటర్లు అన్ని అంశాలు పరిగణించే ముద్రవేస్తారు.

తెలంగాణ విభజనే అతి ముఖ్యమైన సమస్య అనే వాదన మరొకటి. గత అయిదేళ్ళలో దీనిపై తర్జనభర్జనలు, కాంగ్రెస్ పిల్లిమొగ్గలు, తెరాస బహుముఖ వ్యూహాలూ చూసిన తర్వాత అలాగే అనిపిస్తుంది. ఈ విషయంలో కాంగ్రెస్ విశ్వసనీయత పోగొట్టుకుంది. విభజన మంచిది కాదనే సిపిఎంను విశ్వసిస్తాము తప్ప కాంగ్రెస్‌ను నమ్మలేమనే భావన తెలంగాణా వాదులలో రావడమే అందుకు నిదర్శనం. మొన్నటి ఉప ఎన్నికలలోనే తెలంగాణ ప్రాంతంలో కాంగ్రెస్‌కు వచ్చినఓట్లు, సీట్ల కన్నా తెలుగుదేశం, తెరాస, వామపక్షాలకు సంయుక్తంగా వచ్చిన ఓట్లు రెట్టింపునకు పైగా వున్నాయి. ఎందుకైనా సరే తర్వాత తెలుగుదేశం, తెలంగాణాను పూర్తిగా బలపర్చింది. వీటన్నిటి రీత్యా ఈ అంశం కాంగ్రెస్‌కు ప్రతికూలంగానే పనిచేస్తుంది. ఆఖరి దశలో ఈ జాబితాకు ఎస్‌సి రిజర్వేషన్ల వర్గీకరణ తోడైందంటే ఆ దోషం కూడా కాంగ్రెస్‌దే. ఏదో ఒకటి ఇదమిద్ధంగా చెప్పకుండా భిన్నస్వరాలతో మాట్లాడటం, భావోద్వేగాలతో ఆడుకోవడం వల్ల కలిగిన దుష్ఫలితమిది. కనక ఇది కాంగ్రెస్‌కు తప్పని సరిగా నష్టం కలిగించే అంశమే. మావోయిస్టులతో చర్చల సమస్యను కూడా కొంతమంది దీంతో కలిపి చెబుతారు గాని దాని స్వభావం వేరు. అందులో కూడా కాంగ్రెస్ మాట తప్పిన మాట నిజమే కాని అందులో సర్కారుతో మావోయిస్టుల పాత్రను కూడా పట్టించుకోవలసి వుంటుంది. ఇదిపై వాటివలె ఏకపక్ష అంశం కాదుగాని పరిష్కారం కావలసిందే.

చెయ్యని వాగ్దానాల కన్నా ఎక్కువే అమలు చేశామని వైఎస్ తరచు అంటుంటారు. అతి కీలకమైన పై అంశాలు పక్కన పెడితే వ్యవసాయ సంక్షోభ నివారణ, బెల్టుషాపుల రద్దు, లక్షల ఉద్యోగాల కల్పన వగైరా చాలా విషయాల్లో వాగ్దానాల అమలుకు దూరంగానే ఉండిపోయారు. ముందు చెప్పని అనేక సంక్షేమ పథకాలు ప్రారంభించిన మాట నిజమే గాని వాటిపై ప్రచారం ఫలితాల మధ్య తేడా ప్రజా క్షేత్రంలో తేలవలసి వుంటుంది.

సంక్షేమ పథకాలు సమూల చర్యలకు ఎప్పుడూ ప్రత్యామ్నాయాలు కావు. అవి దానధర్మాల్లాగా చెప్పుకోవడం గాని, వాటిని ఆ కోణం నుంచి విమర్శించడం గాని తప్పే. పందేరంలా పంచిన వేల ఎకరాల భూములు ఇతర రాయితీలతో అవినీతి ఆరోపణలతో పోల్చినపుడు సంక్షేమానికి చేసిన ఖర్చు దూదిపింజలా తేలిపోతుంది. కనుక దేని ప్రభావం ఎంత అనేది కూడా ప్రజలే చెప్పగలరు.

# గ్లోబలైజేషన్

**మహమ్మద్ ఇలియాస్**



సమరావనిలో మొదలవవలసిన శంఖంలా
ప్రకటితమవ్వాల్సిన కంచుకంఠం
నేడు మూగబోతుంది
పోగొట్టుకున్న మనిషి హక్కులా
వీర్యం కోల్పోతున్న పేటెంటై

పురిటికై శూన్యాన్ని మోస్తున్న తల్లి ఆత్మ
మంచుమౌనమై సర్వం భరిస్తూ
భావి జీవితానికై గర్భం నుంచే
అంగలార్చటం అలవర్చుతుంది

భారమైన బ్రతుకు ఆశలను
రెక్కల అంచులకు వేలాడేసి
నిట్టూరుపులైన సుడిగాడ్పుల ప్రవాహానికి
విహంగంలా ఎదురెగురుతుంది
బాధ్యతను ఒనర్చేందుకు బ్రతుకు
గాయాలను కప్పిపుచ్చుకొనేందుకు
ఆత్మనే ఆచ్ఛాదనగా
శరీరానికి చుట్టి శ్వాసిస్తున్న
వింత సంచార సమూహాలు

తమ బ్రతుకు హరితాన్ని
కాజేసిన నాగరిక సౌధాలకు, ఆకాశహర్మ్యాలకు
తడి ఆరిన తరుణ లతికల్లా పెనవేసుకొని
బ్రతుకును ఈడుస్తూ నిరర్థకంగా నిరాదరణకు
గురవుతున్న అమాయక నిర్భాగ్యులు
ఆర్ద్రతకై పాకులాడుతూ
తమకే తెలియని ఉత్పతనాలకు
ఆవిరవుతున్న ఆత్మలు

నాగరికత పేరున అగాధాలు
మనిషికి మానవత్వానికి మధ్య లోతులోయలు
ఎత్తైన కొండ బురుజుల్లాంటి
సిరిసంపద శిఖరాలను చేర్చేందుకు
నిర్మించే వారధులకు ఆధారం
సామాన్యుడి అస్థికలు
మనిషిని మనిషే అణచివేసే
ఆటవిక సంస్కృతి వికృతముఖాన్ని
ఇంపుగా ప్రదర్శించేందుకు
మార్చి మార్చి తొడిగే అందమైన ముఖౌటుం
గ్లోబలైజేషన్
యుగాలు గడిచినా
తరాలు మారినా
తారతమ్యం గోచరించక
బ్రతుకు పుష్పాలు వికసించని
సామాన్యుల జీవితాలను
మెలి మెల్లిగా
మరుభూమికి సాగనంపే ప్రక్రియకు
విన సొంపైన పేరు
గ్లోబలైజేషన్

# సంఘర్షణ ఆకర్షణ!

**-యస్.యస్. రెడ్డి**



సెంటిమెంట్స్‌కి వ్యాపారానికి
మధ్య ఘర్షణ
సంప్రదాయానికి చార్వాకానికి
మధ్య సంఘర్షణ
వేదనకు రసాస్వాదనకు
మధ్య ఘర్షణ
వెలుగు చీకట్ల
అధ్యయన ఘర్షణ
మౌనానికి శబ్దానికి
మధ్య సంఘర్షణ
ఆలోచనకూ మనస్సుకూ
మధ్య సంఘర్షణ
మేఘానికి మేరు పర్వతానికి
మధ్య సంఘర్షణ
ఘర్షణ సంఘర్షణా
జీవితంలో సహజం
సాహిత్య వంతెనలు
లేకుంటే...
సదసద్వివేకం
చాలదు అనుకుంటే
తుదకు సంఘర్షణే
ఆకర్షణ....!

---

గత ప్రభుత్వంపై వచ్చిన ఆరోపణలు దాని విధానాల విమర్శపై పాలకపక్షం ప్రధానంగా దృష్టి పెడుతున్నది. ఏ ఏడాది పరీక్షలు ఆ ఏడాది ప్రశ్నాపత్రంతో జరుగుతాయి తప్ప అంతకు ముందు వాటితో కాదు. గతంలో విధానాలే కొలబద్దలైతే ఎమర్జన్సీ పెట్టిన కాంగ్రెస్ ఎలా ప్రజాస్వామిక పార్టీ అవుతుంది? తెలుగుదేశం తప్పిదాలను నిశితంగా విమర్శించవచ్చు గాని వాటితో ఇప్పటి తప్పులు కప్పిపుచ్చుకోవడం కుదిరేపని కాదు. సాధారణ స్థితిలో ఈ రాష్ట్ర సమస్యలను బట్టి ఇక్కడి తీర్పు వుంటుంది తప్ప అక్కడి దాన్ని బట్టి కాదు. భూపోరాటం వగైరాలతో వామపక్షాలు సృష్టించిన సానుకూల ప్రభావాన్ని నిరాకరించడమూ సాధ్యం కాదు.

తెలుగుదేశం, తెరాస, వామపక్షాల కలయికకు స్వతస్సిద్ధంగానే ఓట్లు కలయికకు సంబంధించిన ప్రయోజనం కలుగుతుందనేది ప్రాథమిక అంశం. 2004లో కాంగ్రెస్‌కు ఎక్కువ స్థానాలు రావడానికి కారణమూ ఇదే. ప్రరాపాను కూడా కలిపి త్రిముఖ పోటీగా అభివర్ణించడంలో సాంకేతికంగానే తప్ప సంపూర్ణమైన అర్థంలో సరిపోదు. నటుడుగా చిరంజీవికి వున్న ప్రసిద్ధి తప్ప ఏ అంశంలోనూ మిగిలిన రెండు రాజకీయ పొందికలతో దాన్ని పోల్చలేము. అవి నిరూపితమైన శక్తులు కాగా ప్రరాపా ఇంకా బలం చూపుకోవలసిన పక్షం. యంత్రాంగ పటిష్టత, విధాన స్పష్టత, అంతర్గత ఐక్యత అన్ని విషయాల్లోనూ అసంపూర్ణ చిత్రంలా వుంది. కొన్ని చోట్ల ప్రజలను ప్రభావితం చేసే ప్రముఖ శక్తిగా దాన్ని పేర్కొనవచ్చునేమో గాని సమవుజ్జీల మధ్య పోరుగా ఎన్నికల పోరాటాన్ని చూడటం తర్కానికి నిలవదు. గత ఎన్నికలలో పోరాడిన శక్తుల మధ్యనే ఇప్పుడూ పోరాటం కేంద్రీకృతమవుతుంది. జాతీయ స్థాయిలో మూడో ప్రత్యామ్నాయం కోసం జరిగే కృషిలో రాష్ట్రప్రజల తీర్పు చాలా కీలకమవుతుంది. ●

# కవి సమ్మేళనం

## కుటిల పాలకులను తూర్పారపట్టిన కవులు!!

■ దినకర్



"కోట్లగొంతులొక్కసారి గర్జిస్తాయ్! గర్జిస్తాయ్! సీట్లమీద కూర్చున్న మంత్రులార ఖబడ్దార్!" అంటూ ప్రజాకవి సుబ్బారావ్ పాణిగ్రాహి ఏనాడో హెచ్చరించాడు. విరోధినామ సంవత్సరాన్ని స్వాగతిస్తూ సాహితీ స్రవంతి హైదరాబాద్ నగర కమిటి నిర్వహించిన 'ఎన్నికల ఉగాది'కవి సమ్మేళనం ఒక్క గొంతుకతో ఇదే నినదించింది! "తొండ ముదిరి ఊసరవెల్లి అయినట్లు" వీధిరౌడీలు, ఫాక్షన్‌నేతలు నాయకులయి, శాసనసభ్యులయి అసెంబ్లీని రణరంగం చేయడం చూసాం. ప్రతిపక్షాల నోరునొక్కేందుకు భౌతికదాడులకు కూడా వెనుదీయకపోవడం, నాటి కౌరవ సభలోని దుర్యోధన, దుశ్శాసనులను మరిపించే చేష్టలు చూసాం. స్పీకర్ ధృతరాష్ట్రుడిలా నటిస్తుంటే, ద్రౌపది వలువలు ఊడ్చినట్లు ప్రజాస్వామ్యాన్ని పరాభవించడం చూసాం. ప్రజాస్వామ్య క్రియను ధనస్వామ్య ప్రక్రియగా మార్చి రాష్ట్రాన్ని ఏలుకోమని, దోచుకోమని ప్రజలు మాకు రాసిచ్చారు , అడగడానికి మీరెవ్వరని దబాయించడం చూసాం! అభివృద్ధి మంత్రాన్ని పఠిస్తూ ప్రజలను దోచుకోవడాన్ని చూసి, సామాన్యులే ఆగ్రహిస్తుంటే, సున్నితమనస్కులు, అనధికార శాసనకర్తలు, సామాజిక స్పృహగల కవులు ఊరుకుంటారా మరి! అదే ప్రజాకవి చెప్పినట్లు 'ఈ దేశస్తులు నమ్మరులే నీ మోసపు కొంగజపం'అని అంటూ 'దిక్కుమొక్కూ లేని జనం ఒక్కొక్కరు అగ్నికణం ప్రళయకంఠనాదంతో వస్తారిక కాచుకోండి'అంటూ హెచ్చరిస్తారు.

హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో మార్చి 26న 'ఎన్నికల ఉగాది' కవి సమ్మేళనం ఇదే పని చేసింది. ఒకే అంశం! విభిన్న దృక్కోణాలు! అవే అక్షరాలు, మలిచిన శిల్పాలు వేరు! ముఖ్య అతిధిగా విచ్చేసి కవి సమ్మేళనాన్ని ప్రారంభించిన ఆచార్య కొలకలూరి ఇనాక్‌గారు కవిత్వాలు సామాజిక మార్పుకు ప్రేరణకావాలని అందుకు కవులు తమ కవిత్వంతో కృషి చేయాల్సిందిగా కోరారు. తన కవితను వినిపించి కవి సమ్మేళనాన్ని ప్రారంభించారు. వేదికనలంకరించిన డా॥ అద్దేపల్లి రామ్మోహన్‌రావు మాట్లాడుతూ ప్రపంచీకరణ ప్రభావాన్ని ప్రతిఘటిస్తూ కవులూ, సాహితీవేత్తలు రచనలు చేయాలని ఉద్బోధించారు. సుధామ ప్రసంగంలో సాహితీ స్రవంతి ఇటువంటి సందర్భోచిత కవి సమ్మేళనాలను నిర్వహిస్తున్నందుకు అభినందించారు. రాజకీయాలలో సినీతారల హడావుడిని వ్యంగ్యంగా చిత్రీకరించిన తన కవిత చదివివినిపించారు. ద్వానా శాస్త్రి తన సందేశంలో రాజకీయాలలో దిగజారుతున్న నైతిక విలువలు, అవినీతి పట్ల నిరసన వ్యక్తం చేశారు. సాహితీ స్రవంతి రాష్ట్రకన్వీనర్ తెలకపల్లి రవి మాట్లాడుతూ నేటి కవులలో వర్తమాన రాజకీయాలు, నాయకుల పట్ల తీవ్ర నిరసన, ఏహ్య భావం, వైముఖ్యం కనపడుతోందని అన్నారు. అయితే ఉన్న వాస్తవిక పరిస్థితుల్లో సరయిన ప్రత్యామ్నాయాన్ని ఎన్నుకునేలాగా సాహితీవేత్తలు ప్రజలకు తోడ్పడాలని, అటువంటి ప్రత్యామ్నాయం కూడా రూపుదిద్దుకుంటోందని అన్నారు.



సామాజిక స్పృహతో కూడిన కవుల కవితా పంక్తులు అందరినీ ఆకట్టుకున్నాయి. వాటిలో కొన్ని – "నిన్ను నిన్నుగా నిలబెట్టగల విరోధికి ఓటేసుకో/అవినీతి, బంధుప్రీతి, చీకటిబజారుల విరోధికి, జన చైతన్య ఆదర్శనేతకు/సమాదర పాలనాధికార స్వాగతమిద్దాం! / ప్రజాస్వామ్య పరిరక్షణ వేదిక జయవేదికనమరుద్దాం!"–సుధామ, "కపట నాయకుల కుటిలనీతిని ఛేదించేందుకు/'ఓటు'కు ఆయుధాన్ని సానబెట్టుకుంటున్న సామాన్యుడికి/ఈ ఉగాది.. నిజంగా 'యుగాదే'!/ –ఎస్.వి.కృష్ణ, "పడమటి సూర్యుణ్ణి పలకరిస్తుందో?/పసుపుపచ్చరంగుని కలవరిస్తుందో/మూడురంగుల మువ్వన్నెను నిలదీస్తుందో/ సత్తాచూపించే వత్తాసులను కూడబలుక్కుంటుందో/ వాడిపోతున్న కమలాన్ని నిలబెడుతుందో?/శ్రీ విరోధి నామ సంవత్సరంలో వేచిచూద్దాం"–ఎస్.విజయలక్ష్మి, "ఈ ఉగాదిలో /నల్లకోయిల కూతల కంటే/ తెల్లకోయిల కోతలే వినిపిస్తున్నాయ్/ ఈ కోయిల రాకతో/ తారాబలం చూసే పద్ధతిపోయింది/ తారల బలం బేరీజుకొచ్చింది."–పూసల రజనీ గంగాధర్. ఇలాంటి కవితా పంక్తులు మరెన్నో ఈ కవి సమ్మేళనంలో కవులు వినిపించారు.

ఈ కవిసమ్మేళనానికి ప్రముఖ కథారచయిత పెద్దింటి అశోక్‌కుమార్, కవి సుగమ్ బాబు, డా॥విప్లవ్‌దత్ శుక్లా వంటి వారితోపాటు వందమందిదాకా కవులు, రచయితలు, సాహితీ ప్రియులు హాజరయారు. మూడుగంటలపాటు సాగిన ఈ కవిసమ్మేళనంలో యస్.వి.కృష్ణ, శిల్పాజగదీశ్, మహజబీన్, శైలజామిత్ర, లక్కరాజు నిర్మల, సోమంచి ఉషారాణి, సహరా, గురజాడ అప్పారావు, పూసల రజనీ గంగాధర్, తంగిరాల చక్రవర్తి, పులివర్తి కృష్ణమూర్తి, గౌతంరాజు హన్మంతరావు, డి.రామచంద్రం, చల్లా లీలావతి, ఆనందప్రసాద్, బొపార, నెల్లూరి గోపినాధ్, యన్.విజయలక్ష్మి, యమ్.జయశ్రీ, సి.విజయలక్ష్మి, సుతారపు వెంకటనారాయణ, రెడ్డిపల్లి వెంకటేశం, పొత్తూరి సుబ్బారావు, పెద్దూరి వెంకటదాసు, చింతాడ కూర్మారావు, ఆశ్లేష జి.సుబ్బారావు, జి.నర్సింహమూర్తి, ఎమ్.రాజ్‌కుమార్, కొంపెల్ల శర్మ, అరిబండి ప్రసాదరావు, కవిశ్రీ మోహన ప్రసాద్, ఆచార్య నరేంద్ర, రామ్మోహనరావు, తోట సత్యవతి, ఆర్.నాగేంద్ర, మందపాటి, వొరప్రసాద్, యస్.సామ్, నడిమింటి లక్ష్మీనారాయణ, రుద్రంగి, పి.లీలా ప్రసాద్, జి.యాదగిరిరావు, సత్యభాస్కర్ తదితరులుతమ కవితలు చదివి వినిపించారు. సాహితీస్రవంతి హైదరాబాద్ నగర కన్వీనర్ సత్యభాస్కర్ సభాధ్యక్షత వహించగా తంగిరాల చక్రవర్తి కవి సమ్మేళనం నిర్వహణలో తోడ్పడ్డారు. వొరప్రసాద్ వందన సమర్పణ చేయడంతో సభ ముగిసింది. ●

**నివేదిక**



# కథా నిలయం పన్నెండో వార్షికోత్సవం

**■ మల్లిపురం జగదీశ్**

ఎప్పటిలాగానే ఫిబ్రవరి రెండో వారంలో జరిగే కథానిలయం వార్షికోత్సవాలు ఉత్సాహంగా, స్నేహపూరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. సాహితీ లోకమంతా ఎదురు చూసే ఈ ఉత్సవాలు శ్రీకాకుళంలో రెండు రోజులుగా సందడి చేశాయి. ఈ ఉత్సవాలకి రాష్ట్రం నలుమూలలనుంచి, దేశ విదేశాల నుంచి రచయితలు, రచయిత్రులు సాహితీ అభిమానులు ఫిబ్రవరి 14 వ తేదీ మధ్యాహ్నం నాటికే కథానిలయానికి చేరుకున్నారు. ఆరోజు మధ్యాహ్న భోజనానంతరం వివిన మూర్తి నిర్వహణలో 'పుస్తకావిష్కరణలు' జరిగాయి.

ఈ కార్యక్రమానికి ప్రారంభోపన్యాసం చేస్తూ కథానిలయం వ్యవస్థాపక అధ్యక్షులు కాశీపట్నం రామారావు మాట్లాడుతూ సాహిత్యం మనిషిని ఉన్నతీకరిస్తుందని, సాహిత్యం వల్లే వివిధ రచయితల అనుభవాలు మనకీ అనుభూతం అవుతాయని, సాహిత్యం అంటే తెలియని రోజుల్లో కొ.కు. గారి 'చదువు' నవల తనపై ప్రభావం చూపిందని అన్నారు. అనంతరం "కొడవటిగంటి కుటుంబరావు రచనా సంపుటి–1" ని ఆవిష్కరించేరు. ఈ పుస్తకాన్ని విరసం నేత చలసాని ప్రసాద్ పరిచయం చేస్తూ తెలుగు సాహిత్యంలో ఎక్కువగా కథలు రాసిన వారిలో కుటుంబరావు గారు ఒకరు, ఆయన 'చదువు' నవల సాహితీ లోకానికి ఒక మలుపు అన్నారు.

రెండో పుస్తకం విశాలాంధ్ర వారు ప్రచురించిన అట్టాడ అప్పలనాయుడి "క్షతగాత్ర గానం" ని కాశీపట్నం రామారావు ఆవిష్కరించేరు. ఈ పుస్తకాన్ని గంటేడ గౌరు నాయుడు పరిచయం చేస్తూ ఉత్తరాంధ్ర సాహిత్యంలో రైతు జీవితాన్ని, వ్యవసాయక పరిస్థితులను సాహిత్యీకరించిన తొలి రచయిత అప్పల్నాయుడని అన్నారు. తనలాంటి వారికి మార్గదర్శి అయి, ఉత్తరాంధ్ర సాహిత్యానికి దిశా నిర్దేశం చేస్తున్న సాహితీవేత్త అని అన్నారు. అతని రచనల్లో క్షతగాత్ర గానం, బంధాలు – అనుబంధాలు యజ్ఞం తర్వాత, షా.... లాంటి కథలు ఇక్కడి రైతు జీవితాల్లోని చిద్రమైన స్థితిని పలు కోణాల్లో చిత్రించేరని కొనియాడారు. రచయిత అప్పల్నాయుడు మాట్లాడుతూ "క్షతగాత్ర గానం" కథ రాస్తున్నపుడు నిద్రలేని రాత్రుల్ని తనతో పాటు పంచుకున్న తన శ్రీమతి 'అరుణ'కి పెళ్ళైన నాటి నుండి ఏ వస్తువూ కొని ఇవ్వలేక పోయేనని, పెళ్ళైన కొత్తలో ఆమె మెడలోని వస్తువుల్నే అమ్మేయాల్సొచ్చిందని, ఇన్నాళ్ళూ తనకు, తన సాహిత్యానికి చేయూత నిస్తున్న తనకి ఈ పుస్తకాన్ని అంకితమిస్తున్నట్లు ప్రకటించారు. కా.రా. మాష్టారి చేతుల మీదుగా "క్షతగాత్ర గానం" పుస్తకాన్ని శ్రీమతి అరుణ అందుకున్నారు.

అనంతరం కరుణ రాసిన "తాయమ్మ కథలు" ని ప్రముఖ రచయిత అల్లం రాజయ్య ఆవిష్కరించగా ప్రశాంత్ పరిచయం చేశారు. ఈ సందర్భంగా అల్లం రాజయ్య మాట్లాడుతూ కరుణ గారి సాహిత్యము, జీవితము వేరు వేరు కాదని, ఆమె తన జీవితానుభవాన్నే కథలుగా మలిచారని అన్నారు.

ఆ తరువాత కొత్త రచయితలతో విరసం నిర్వహించిన వర్క్‌షాప్‌లో తయారైన 18 కథల 'కథలపంట' పుస్తకాన్ని అట్టాడ అప్పల్నాయుడు ఆవిష్కరిస్తూ కొత్త రచయితలు 'శిల్పం' పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు. ఈ పుస్తకాన్ని ప్రశాంత్ పరిచయం చేశారు. అదే సభలో భువన్ రచించిన 'నవ్వులాట' కథల సంపుటిని ప్రముఖ రచయిత 'మానేపల్లి' ఆవిష్కరిస్తూ హాస్య కథ హాస్య భరితంగా వుండాలి. కానీ హాస్యాస్పదంగా వుండకూడదని అన్నారు. చివరగా పొందూరుకు చెందిన ఎ. చంద్రశేఖర్ "సవర పాటలు" అనువాద పుస్తకాన్ని కా.రా. మాష్టారు ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని కనుగుల వెంకటరావు పరిచయం చేశారు.

అనంతరం రచయితల స్వీయ పరిచయం జరిగింది. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన రచయితలు, రచయిత్రులు, సాహితీ అభిమానులు సభకు పరిచయం చేసుకున్నారు. ప్రతీ యేటా మహిళలతో నిండుగా కనపడే ఆ సభ ఈఏడు మహిళా సభ్యులు తక్కువగా వుండడం, ఎందుకో వెలితనిపించింది.

అతిధులతో ఇష్టాగోష్టి కార్యక్రమంలో ముఖ్య అతిథులు డా॥ వకుళాభరణం రామకృష్ణ, డా॥ కె. శివారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ "నేను కవిని. కథలు రాయలేదు. కాని కథలు చదివాను. సంచరిస్తుంటాను. నలుగురు కలిసే ఇలాంటి ఒక చోటు కోసం వెతుకుతూ పోతుంటాను. "అని అన్నారు. డా॥ వకుళాభరణం మాట్లాడుతూ" వర్తమానమే రేపు చరిత్ర అవుతుంది. చరిత్రలో కథా సాహిత్యం ప్రముఖ పాత్ర వహిస్తుంద"ని అన్నారు. అనంతరం "వందేళ్ళ తెలుగు కథ" అనే అంశంపై ఇష్టాగోష్టి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రచయిత రామతీర్థ మాట్లాడుతూ, తొలి

తెలుగు కథ 'దిద్దుబాటు'కు విజయనగరంలో స్థూపావిష్కరణ చేయనున్నామని ప్రకటించారు. తర్వాత డా॥ వకుళాభరణం మాట్లాడుతూ 'వందేళ్ళ తెలుగు కథ ఎన్నో మార్పులకు గురి అయిందని, మార్పు అభివృద్ధికి సంకేతమని, కథకు స్థూపాలు నిర్మించడం కంటే, నిర్మాణాత్మకమైన రచనలు చేయడంలోనే దాని ఉనికి ఎల్లప్పుడూ ఉంటుందని అన్నారు. వక్తలు అప్పల్నాయుడు, అల్లం రాజయ్య, బి.వి.ఎ. రామారావు నాయుడు, కనుగుల వెంకటరావులు తమ అభిప్రాయాల్ని వ్యక్తం చేసేరు. అనంతరం "ఇంటర్నెట్‌లో తెలుగు వాడకం" అనే అంశంపై చివుకూరి, దుప్పల రవికుమార్‌లు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ నిర్వహించారు. దీనితో తొలి రోజు విజయవంతమైన్నటైంది.

ఇక రెండో రోజు ఉదయం కథానిలయం ట్రస్ట్ బోర్డు సభ్యులు, రచయిత దాసరి రామచంద్రరావు కథానిలయం పన్నెండో వార్షికోత్సవ సభకు ఆహ్వానం పలికారు. ఈ సభకు కాశీపట్నం రామారావు అధ్యక్షత వహించగా, ముఖ్య అతిధిగా డా॥ వకుళాభరణం రామకృష్ణ, ప్రత్యేక అతిథిగా డా॥ కె. శివారెడ్డి పాల్గొన్నారు. సభను కవన శర్మ నిర్వహించారు.

అధ్యక్షోపన్యాసం చేస్తూ కాశీపట్నం రామారావు గారు 'ముఖ్య అతిథులుగా వీరిని ఎందుకు ఆహ్వానించేరు?' అని కొంతమంది ప్రశ్నించినపుడు, కథానిలయానికి కథకులే కాకుండా మిగతా ప్రక్రియల్లో నిష్ణాతులైన వ్యక్తుల అవసరం కూడా వుందని, శివారెడ్డి గారు కవి అయినప్పటికీ అన్ని ప్రక్రియలు చదివిన వారు, విశేష జీవితానుభవం గడించిన వారని, అలాగే రామకృష్ణ గారు కూడా అని భావించి వారిని ముఖ్య అతిథులుగా కథానిలయం ఆహ్వానించింది' అని అన్నారు. తాను శ్రీకాకుళంలో నివాసం ఏర్పరచుకున్నప్పటి నుంచి బివిఎ. రామారావు నాయుడు ఈ కథానిలయం నిర్మాణ బాధ్యతల్లో చేదోడుగా వుంటూ వచ్చారని అన్నారు. శ్రీకాకుళంలో కథానిలయం కా.రా. మాష్టారిది అని కొందరు అంటుంటే విని బాధ పడ్డాను. ఎందుకంటే ఈ కథానిలయం నాది కాదు. దీని నిర్మాణానికి నా స్వంత ఆర్జనలోంచి ఒక్కపైసా కూడా ఖర్చు చేయ్యలేదు. అవార్డుల రూపంలో వచ్చిన సొమ్మునే దీనికి ఖర్చు చేసేను. అవార్డులు సొమ్మంటే ప్రజల సొమ్ము ఆ సొమ్ముతోనే నిర్మితమైన ఈ కథానిలయం ప్రజలది. ఈ సమాజానిది. ఇది ఏ ఒక్కరికో చెందినది కాదు. దీని నిర్మాణానికి సమాజం తరపున ఒక పరికరంగా మాత్రమే పనిచేశాను. తెలుగు సాహిత్యంలో ప్రధానంగా 'కథ' ఒకే చోట ఉండాలని ప్రయత్నం చేసాను. దీనితో ప్రతులు అన్నీ ఉచితంగానే పొందినవి. కథకు సంబంధించి నాకు చేతనైంది చేసాను. ఈ పని మిగతా ప్రక్రియల్లో కూడా జరిగితే అభినందనీయమే. శ్రమకు మారు పేరు అయిన డబ్బు తోనే ఏ పనైనా ముడి పడి వుంటుంది. ఆ డబ్బు అనే అహమే మనిషిని ముందుకు నడిపిస్తుంది. కానీ అహంతో కీర్తి నిలుపుకోవాలనుకోవడం మూర్ఖత్వమౌతుందని' ముగించారు.

అనంతరం, కథానిలయం కార్యదర్శి బి.వి. రామారావు నాయుడు వార్షిక నివేదికను వినిపిస్తూ 1,800 పుస్తకాలతో ప్రారంభమైన ఈ కథానిలయం ఈ రోజు 392 జర్నల్స్, 15,800 సంచికలు (అందులో 9,800 కంప్యూటరైజ్ చేయబడినవి) (37,200 కథలు కంప్యూటరైజ్డ్) 88 ఫీచర్స్, 57 ఆత్మకథలు, 135 పరిశోధనలు, 102 సాహిత్య సర్వస్వాలు, 340 వ్యాస సంపుటాలు, 53 ఉపయుక్త గ్రంథాలు, 27 ఇతర భాషల్లోకి వెలువడినవి, ఇతర పుస్తకాలు 50తో నిర్వహిస్తున్నామని చెప్పారు. నేటికి తెలుగులో సుమారు 1,50,000 కథలు ఉంటాయని, వాటిలో 50% మాత్రమే ఇక్కడకు చేరి వుంటాయని అభిప్రాయ పడ్డారు.

అనంతరం ప్రత్యేక ప్రసంగం చేసిన డా॥ కె. శివారెడ్డి నా అరవై ఆరేళ్ళ జీవితంలో నలభై ఏళ్ళుగా నేను పొందిన అనుభవమే నా కవిత్వం అని అన్నారు. ఆ అనుభవాల్లోంచి అంతర్గత విస్తృతి చెందడం ఒక ప్రోసెస్‌గా జరుగుతూ వుంటుంది. తొలి రోజుల్లో పెరిగిన వాతావరణం లోకి ఇప్పుడు వెళ్తూ వుంటాం. ఆ మారు మూల గ్రామాల నుంచి ఇపుడు ఈ స్థాయికి ఎదగడంలో ఒక చోదక శక్తి పని చేస్తూ వుంటుంది. 'జాగ్రఫీ ఈజ్ డెస్టినీ' అని ఒక రచయిత అన్నట్టు, కవి పెరిగిన పరిసరాలు, భౌగోళిక పరిస్థితులు అతని కవిత్వంలో ప్రతి ఫలించాలి. ఒక రచయితకు పరిభాష, పరిణితి ఏర్పడడానికి అతని స్వభావం ఉపయోగ పడుతుంది. అతని భావజాల నేపథ్యంలో అతని స్వభావానికి, తాత్వికతకి విడదీయరాని సంబంధం వుంటుందని అన్నారు.

"గొంతు మీద కత్తి పెట్టి
నిజం మాట్లాడ మంటే
నిజమే మాట్లాడాలి"

అని 1975లో అన్నాను. ఇప్పుడా కవిత్వం అలా రాదు. అప్పటికి, ఇప్పటికి ఒక పరి వ్యాప్తి, పరిణామం, భౌగోళిక స్థితిలో మార్పు వుంటుంది. ఆ మార్పు ఆ మార్పుని గమనిస్తూ సాహిత్యం చెయ్యాలి. బాల్యం లేని బాల్యాన్ని అనుభవించాలి. పునః పునః దర్శనం చెయ్యాలి. తర్కించుకోవాలి. ఈ మార్పులు కవితకైనా, కతకైనా ఒకటే అని గమనించాలి అని అన్నారు. ఈ సందర్భంగా పి. మోహన్ 'కిటికీ పిట్ట' కవిత్వాన్ని ఉదహరించారు. నన్ను కవుల కంటే కథకులే భయ పెడతారు. అంటూ డా॥ వి. చంద్రశేఖర్ కథ "ఎ క్రానికల్ ఆఫ్ లవ్" అనే కథను గుర్తు చేస్తూ ముగించారు.

అనంతరం ముఖ్య అతిథి డా॥ వకుళాభరణం రామకృష్ణ మాట్లాడుతూ 'ఇది ఆలోచనా పరుల, సృజన శీలుర సాహితీ ప్రియుల సహృదయ సదస్సు' అని అన్నారు. మానవ, ఆర్థిక వనరులు పుష్కలంగా వున్నవారు చెయ్యాల్సిన పనిని కథానిలయం చేసిందని కొనియాడారు. ఈ ప్రారంభం ముగియడానికి ఎన్నో ఏళ్ళు పట్టవచ్చు అని అన్నారు. ఈ కథానిలయం సామాజిక విశ్లేషణా గ్రంథాలు గల ప్రత్యేక నిలయమని అంటూ చరిత్ర, సాహిత్యము ఒకదానికొకటి పరస్పర సంబంధం కలిగి వుంటాయని ఈ రెంటికి కేంద్ర బిందువు మానవ సమాజమే అని అన్నారు.

ఏ గ్రంథమైనా మానవుడి గురించే చెప్తుంది. మానవుడి మీద చూపిన ప్రభావమే చరిత్రని, మానవ స్వభావాన్ని నిర్ధారించడంలో భూగోళ శాస్త్ర పాత్ర వుంటుందని అన్నారు. సాహిత్యం సామాజిక చైతన్యం ఇస్తుంది. చరిత్ర సామాజిక జీవితాన్ని విశ్లేషిస్తుందని అన్నారు. సామాజిక చైతన్యం సాహిత్యం ప్రతిఫలిస్తే ఆ సామాజిక చైతన్యం చరిత్ర కలిగిస్తుంది. చరిత్ర చేయలేని పని సాహిత్యం చేస్తుంది. మానవ ప్రవృత్తిని సాహిత్యం చిత్రించినట్టు చరిత్ర చిత్రించలేదు. చరిత్ర కారుడు,

# నానోలు

**ఈగ హనుమాన్**



దీపం
ప్రసరించడానికి
చీకటే
యానకం-

దేహాల
చీకటిలో
దీపం
ప్రేమ-

కళ్ళకింద
నల్లగా
అనుభవపు
మరకలు-

ఆరంతస్తులు
ఎదిగినా
ఆరడుగులు
ఒదగాలి

మంతనాలెన్ని
చేసినా
మనిషిగా
గెలిచిరా-

బుర్ర
పగిలిపోయుండేది
మరుపొక
వరం-

వసపిట్టలు
పెళ్ళయ్యాక
ఊసులాడ్డానికి
మాటల్లేవు-

లోపలికి
ప్రవహించు
లోకంలోకి
ప్రయాణించు

కడిఎెడు
కాగీకాగీ
కలాకండ్
నానో-

తెంపబడే
పొగులన్నీ
పొగైతే
ఉరితాడే-

# సంక్షోభగీతిక

**నల్లెల్ల రాజయ్య**



ప్లీజ్ ఆగండాగండి!
ఏం జర్గుతుందిక్కడని
ఎన్నడైనా ఆలోచించారా!
ఎవ్వరైనా అవలోకించారా!
అ"సత్యానికి" అండగా
మైటాస్‌కి మద్దతుగా
బానిసగిరికి బాసటగా
బాటలువేసే బాసుల్ని
ఎవరైనా ఎదిరించారా!
ఎలుగుబంట్ల విలయవిహారం
ఏలికల ఎత్తుల చిత్తులు
ఎవరూహించని అవినీతి,
అక్రమాలు
ఎల్లెడెలా విస్తరించినా
ఎన్నడైనా అడ్డగించారా!

రియల్ దందా బ్రోకర్లు
పాలకులు పంచనజేరి
సెజ్‌ల పేర భూముల్ని
కబ్జా కావిస్తున్న
సంగతిని
కాసింతైనా
నిలువరించారా!
సాఫ్టువేరు సంక్షోభం
అవనంతా అలుముకుంది
ఏకధ్రువ ప్రపంచమే
ఎందుక్కొరగానిదైంది
ఇకనైనా ఆపు
మత్తుగుంటారా!
ప్రజాస్వామిక హక్కులన్ని
పటాపంచలయిపోయినా
లౌకికత్వం జాడలన్నీ
జావగారి జారిపోయినా
సార్వభౌమ సాధికారం
సాగిలిపడి మోకరిల్లినా
భీతావహం చెందకండి
భీరువుల్లా మారకండి
వీరుల్లాగా సాగిపొండి
విప్లవాల వెలుగు
బాటలో.....

సాహిత్య కారులు వారి ప్రాపంచిక దృక్పథాన్ని సమాజం నుంచే స్వీకరిస్తారు అని అన్నారు.

19వ శతాబ్దిలో ఆధునిక ప్రక్రియకు దోహద పడిన సామాజిక శక్తులను నడిపించడంలో వీరేశలింగం గారు కనిపిస్తారు. గురజాడ, గిడుగు, కందుకూరిలను కమ్యూనిస్టులు ముందుకు తెచ్చేరు. ఎందుకంటే అప్పటి సామాజిక విశ్లేషణ వీరి నుండే సాధ్యమని, కౌటిల్యుని అర్థశాస్త్రం రాజ్య నిర్వహణ చరిత్రకు ఆధారమైంది. మాలపల్లి నవల రెండుసార్లు నిషేదానికి గురై అప్పటి సామాజిక చిత్రణని మన కళ్ళముందు వుంచింది. 20వ దశకంలో ఆర్థిక, సామాజిక అంశాల్లో బోల్షివిక్ పార్టీకి గాంధేయ వాదానికి జరిగిన సంఘర్షణని చెప్తుంది. దీనిపై1917 రష్యా ప్రభావం వుందనేది స్పష్టం. ఈ నవల అప్పటి చరిత్రకు ఆధారం. అలాగే 'రాజశేఖర చరిత్రం' అల్లం రాజయ్య గారి 'కొమరం భీం' నవలలు. వీటిలో చారిత్రక పద్ధతి పాటించారని అన్నారు. అదే విధంగా కా.రా గారి 'యజ్ఞం' పంచవర్ష ప్రణాళికల వల్ల వ్యవసాయం లోను, ప్రజా జీవనంలోను వచ్చిన మార్పుల్ని చిత్రించి చరిత్ర అధ్యయనానికి దోహద పడ్డాయని అన్నారు. ఏ సాహిత్య కారుడికైనా చారిత్రక స్పృహ ఉండాలని అంటూ సాహిత్యంలో 'మార్పు'ని 'కంటిన్యూటి'ని గుర్తించి చరిత్ర రచన చెయ్యాలని అన్నారు.

అనంతరం 'ఆత్మీయ అభిభాషణం'లో కవన శర్మ తుమ్మేటి రఘోత్తమరెడ్డి, రెంటాల వెంకటేశ్వరరావు, రంగారావు భాగవతార్ డా॥ మానేపల్లి, సుధాకర్ రెడ్డి (ముంబై), ఎంవిఎస్ గంగరాజు (బరంపురం) సాగర్ (విశాఖ)లు తమ ఆత్మీయ వచనాలు పలికారు. ఎల్.ఆర్. స్వామిగారు ఆంగ్లానువాదం చేసిన 'గురజాడ కథలు' కా.రా. గారికి అందించారు. ఈ సభలో వెలుగు. రామినాయుడు (ఏవీ తల్లీ నిరుడు కురిసిన హిమసమూహములు) గంటేడ గౌరు నాయుడు (అమ్మా, నీ పాదాలకు వందనం) మల్లిపురం జగదీశ్ (ఎంత నెత్తురింకిందో ఈ నేలలో)లు ఆలపించిన గీతాలు సభను రంజింప జేసేయి.

చివరలో చలసాని ప్రసాద్ మాట్లాడుతూ విజయనగరంలో 'వందేళ్ల తెలుగు కథ' ఉత్సవాల్లో వేదగిరి కమ్యూనికేషన్ అధినేత కా.రా. గారిపై చేసిన విమర్శలను ప్రస్తావించారు. అందుకు స్పందిస్తూ 'ఇలాంటి వారిపై స్పందించి గుర్తింపు నివ్వడం కంటే విస్మరించి ఊరుకోవడమే మేలని పలువురు అన్నారు. ఈ సందర్భంగా కా.రా స్పందిస్తూ కథ రెండు రకాలుగా వుంటుందని, మొదటిది పుట్టుకతో, రెండోది కట్టు కథని, మొదటి దానికి సహజత్వం వుంటే ఆ రెండో కథని పట్టుకొని వేలాడే వాళ్ళని పట్టించుకోనవసరం లేదని అన్నారు. ఈ సందర్భంగా విజయనగరంలో తనకు ఎదురైన సంఘటనల్ని వివరించేరు.

సరిగ్గా మధ్యాహ్నం గం॥ 1.30 ని॥లకు ఖచ్చితమైన సమయ పాలనతో, సమర్థవంతంగా కవన శర్మ సభను నిర్వహించడంతో రమణమూర్తి గారు వందన సమర్పణతో సభ ముగిసింది. ●

# కొలకలూరి సాహిత్యోత్సవం

■ డా. కొలకలూరి మధుజ్యోతి



పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం హైదరాబాద్ డా॥ నందమూరి తారక రామారావు కళామందిరంలో ఫిబ్రవరి 26న జ్యోతి గ్రంథమాల అంబేద్కర్ విజ్ఞాన పీఠం నిర్వహించిన సాహిత్య కార్యక్రమంలో కొలకలూరి విశ్రాంతమ్మ నాటక పురస్కారాలు, కొలకలూరి భాగీరథి కవిత్వ పురస్కారాలు, ప్రధానం చేశారు.

మొదటి సమావేశం డా. కొలకలూరి మధుజ్యోతి నిర్వహించగా డా. కొలకలూరి ఆశాజ్యోతి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి, జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డా.సి. నారాయణరెడ్డి జ్యోతి వెలిగించారు. కొలకలూరి ఇనాక్ కృతులు 'ఆది ఆంధ్రుడు' పద్యకావ్యాన్ని ఆర్. ఏకాంబరాచార్యులు, 'కాకి' కథానికా సంపుటిని వేదగిరి రాంబాబు, 'మనలాంటి మనిషి' నాటకాన్ని ఆచార్య మొదలి నాగభూషణ శర్మ, జైహింద్ నాటకాన్ని ఆచార్య చాట్ల శ్రీరాములు ఆవిష్కరించారు. అనంతరం ఆవిష్కర్తలను పరిచయ కర్తలను ఆచార్య డా.సి. నారాయణ రెడ్డి సన్మానించారు.

ఆర్. ఏకాంబరాచార్యులు, ఆచార్య ఇనాక్ రాసిన 'ఆది ఆంధ్రుడు నాయకుడు భుజంగ రాయుడి అసమాన ప్రతిభను శక్తి సామర్థ్యాలను వీరత్వాన్ని ప్రేమ తత్త్వాన్ని స్నేహ జీవితాన్ని విశ్లేషించారు. వచన రచనల రచయితగా అపారమైన ఖ్యాతి పొందిన ఆచార్య ఇనాక్ ఈ పద్య కావ్యంలో తన ప్రతిభను సాహిత్య సామాజిక దార్శనికతతో చిత్రించారని అన్నారు.

తెలుగు కథానిక శతజయంతి సమయంలో 'కాకి' కథానికా సంపుటి ఆవిష్కరణ పరిచయం అదృష్టంగా భావిస్తున్నానని వేదగిరి రాంబాబు అన్నారు. చాలామంది రచయితలు ఒక స్థాయి పొందిన తర్వాత రచన చేయరని, కాని ఆచార్య ఇనాక్ అలా కాక వయసు పెరిగే కొద్దీ సాహితీ యజ్ఞం నిర్విరామంగా చేస్తూ వైవిధ్యంతో కూడిన కథలు రాస్తున్నారని అభినందనలు తెలియజేశారు. ప్రముఖ కథా రచయిత విహారి 'కాకి' సంకలనాన్ని విశ్లేషించారు.

అర్థత కలిగిన వ్యక్తి ఇనాక్ అని 'మనలాంటి మనిషి' నాటకం ఆవిష్కరించిన ఆచార్య మొదలి నాగభూషణ శర్మ పేర్కొన్నారు. ఇనాక్ ఆవిష్కరించిన నాలుగు పుస్తకాలు ఒక్కొక్కటి ఒక్కొక్క సభలో ఆవిష్కరించాల్సింది. కాని, నాలుగు ఒకేసారి ఆవిష్కరించటంలో ఇనాక్ ఆలోచన వివేచన ద్యోతకమవుతోంది అనీ, తన తల్లి తన భార్య సంస్మరణగా వీటిని ఆవిష్కరిస్తూ తమ నలుగురు పిల్లలకు అంకితం చేయటం మానవోన్నతుడి మధుర ఔచిత్యం అన్నారు.

ఆచార్య చాట్ల శ్రీరాములు 'మనలాంటి మనిషి' గురించి మాట్లాడటం 40 సంవత్సరాలకు పూర్వమే (1970) ఫ్లాష్ బ్యాక్ మెలుకువలు పాటించటం అభ్యుదయమే. స్త్రీవాద అద్భుతం చలం గారైతే... ఆ ప్రక్కన నిలుస్తాడనీ, ఇనాక్ స్త్రీ వాది అనీ అన్నారు. స్త్రీ జీవితాన్ని అన్ని కోణాల్లోనూ దర్శించి మహిళాభ్యుదయాన్ని కాంచాడు.

డి. విజయభాస్కర్ మాట్లాడుతూ ఇనాక్ కథలు చదివిన వారు ఇనాక్ అభిమాని, వారి కథాభిమాని కాక తప్పదు అన్నారు. సామాజిక జీవితాన్ని 'నాటకం' చూపించినంతగా మరో ప్రక్రియ చూపలేదు. చెప్పలేదని అన్నారు. వ్యక్తిగా, రచయితగా, సాహిత్యవేత్తగా, ఇనాక్ తన్నుతాను ఆవిష్కరించుకొని, సమాజాన్ని ఆవిష్కరించారని అన్నారు.

గండవరం సుబ్బిరామిరెడ్డి 'జైహింద్' నాటకంలో చెప్పిన వస్తువు కాంతిమంతంగా ఉంది. చెప్పిన విధానం ప్రగతిగా ఉందని ఆరు పాత్రలూ ఔచిత్యాన్ని కలిగిన పాత్రలనీ మట్టి వాసన పీల్చిన మామూలు వ్యక్తులనీ అన్నారు. జాతీయతా భావంతో నాటకానికి ముగింపునీయటంలో రచయిత విజ్ఞత ద్యోతకమవుతుందని అన్నారు.

ముఖ్య అతిథి జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డా॥ సి. నారాయణ రెడ్డి మాట్లాడుతూ ఆచార్య కొలకలూరి ఇనాక్ 1972 నుంచి తనకు పరిచయమని వారి సిద్ధాంత గ్రంథం తెలుగు వ్యాసపరిణామం ప్రౌఢ పరిశోధనమని, మరింత ప్రౌఢ పద్యకావ్యం 'ఆది ఆంధ్రుడు' అనితర సాధ్యమని కొనియాడారు. అలాగే 'కాకి' కథానిక సంకలనం, 'మనలాంటి మనిషి' – 'జైహింద్' నాటకాలు ఆయా రంగాలలో ప్రసిద్ధులైన వ్యక్తులతో ఆవిష్కరింపచేయటం, పరిచయం కలిగించటం ముదావహమన్నారు. ఆచితూచి మాట్లాడే మధుజ్యోతి, చాచి చాచి మాట్లాడే ఆశాజ్యోతి అద్భుత ఆచార్యులని, వాళ్ళ తండ్రి ఇనాక్ అభినందనీయులన్నారు. పద్య కవితలకు ఆదరణ తగ్గిన ఈ సమయంలో ప్రౌఢమైన కావ్యాన్ని రాయటం ముదావహమన్నారు. 'బహుముఖ ప్రజ్ఞాశాలి' గా కవిని వర్ణిస్తూ ఆది ఆంధ్రుడు కావ్యంలోని పద్యాన్ని చదివి వినిపిస్తూ ఈ సీసానిది శ్రీనాథుడు– జాషువా శైలి అన్నారు. డా॥ కొలకలూరి మధుజ్యోతి వందన సమర్పణ చేస్తూ పుస్తక ఆవిష్కర్తల, పుస్తక

## 'ఎన్నికలు-సామాన్యుడు' కవిసమ్మేళనం

సాహితీ స్రవంతి హైదరాబాద్ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి నెలా రెండవ ఆదివారం నిర్వహించే కవి సమ్మేళనం ఫిబ్రవరిలో ఎన్నికలు–సామాన్యుడు అనే అంశంపై జరిగింది. దేశరాజకీయాలలో ఎన్నికలు సంక్లిష్టంగా మారాయని, సామాన్యుడు అర్థం చేసుకోలేని స్థాయిలో ఉన్నాయని కవులు అభిప్రాయపడ్డారు. ప్రపంచీకరణ నేపథ్యంలో భారతదేశంలోనూ, రాష్ట్రంలోనూ జరిగే ఎన్నికలు దేశభవితపై తీవ్ర ప్రభావం చూపుతాయని సభాధ్యక్షులు సత్యభాస్కర్ అన్నారు. మేధావి వర్గానికి చెందిన కవులు మరింత నిశితంగా అధ్యయనం చేసి ప్రజలకు సరైన దిశానిర్దేశం చేసేలా రచనలు చేయాలని ఆయన కోరారు. ప్రొ॥ అరిబండి ప్రసాదరావు గారు మాట్లాడుతూ అంతర్జాతీయ ఫైనాన్స్ క్యాపిటల్ ప్రభావంతో దేశంలో రెండు పార్టీల వ్యవస్థ ఏర్పడాలనే ప్రయత్నం సాగుతుందని అన్నారు. దీని ఫలితంగా రెండు పక్షాలు ప్రపంచ బ్యాంకు ప్రయోజనాలు కాపాడుతూ ప్రజలను కష్టాలపాలు చేస్తాయని, దీన్ని నివారించాలని ఆయన కోరారు. పొత్తూరి సుబ్బారావు, వూసల రజనీగంగాధర్, గురజాడ అప్పారావు, శిల్పాజగదీష్, సుతారపు వెంకటనారాయణ, పొన్నం రాజయ్యగౌడ్, డి. రామచంద్రం, జి. యాదగిరి రావు, అశ్లేష జి. సుబ్బారావు, చల్లా లీలావతి తదితరులు కవితలు చదివారు. వచ్చే నెల రెండవ ఆదివారం (5.04.2009) కవి సమ్మేళనానికి 'నీరు' అంశాన్ని నిర్ణయించడం జరిగింది

---

పరిచయకర్తల శక్తి సామర్థ్యాలను, సాహితీ కృషిని, కళావైభవాన్ని విశ్లేషించారు.

ఇనాక్ సాహిత్యంపై పరిశోధన విమర్శన గ్రంథాలు ఆవిష్కరించి, పరిశోధకుల్ని పర్యవేక్షకుల్ని సన్మానించిన ద్వితీయ సమావేశాన్ని డా. కొలకలూరి ఆశాజ్యోతి నిర్వహించారు.

తెలుగు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్, ఆచార్య టి. గౌరీశంకర్ అధ్యక్షోపన్యాసంలో వివిధ విశ్వవిద్యాలయాలలో జరిగిన పరిశోధనలు, ఇనాక్ సాహిత్యంపై వివిధ సదస్సుల విమర్శనా వ్యాసాల విస్తృతిని. పరిణతిని లోతును వివరించారు. ముఖ్య అతిథిగా వచ్చిన డా. ఆవుల మంజులత మాట్లాడుతూ ఆచార్య కొలకలూరి ఇనాక్ గొప్పకవి, కథకుడు, నాటకకర్త, నవలా రచయిత, విమర్శకులు, పరిశోధకులు అనీ, వీరు కథలు రాస్తూనే ఉండాలనీ, ప్రపంచ సాహిత్యంలో తెలుగు సాహిత్యం ఎందులోనూ తీసిపోదనిపించే సాహిత్య సృష్టి చేశారని, 'కాకి' కథానికా సంకలనంలో కథలు చదువుతుంటే ఎన్నో ఆలోచనలు రేకెత్తాయన్నారు. ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహిత్యంపై పరిశోధనం, విమర్శనం అనే రెండు గ్రంథాలను డా. ఆవుల మంజులత ఆవిష్కరించారు.

పరిశోధన గ్రంథ సంపాదకులు ఆచార్య కొళ్ళాపంట ఆనందన్‌ని, విమర్శన గ్రంథ సంపాదకులు డా కొలకలూరి మధుజ్యోతిని ముఖ్య అతిథి సత్కరించారు. ఉస్మానియా యూనివర్శిటీ డాక్టరేటు పట్టం పొందిన 'కొలకలూరి ఇనాక్ కథలు దళిత జీవన చిత్రణ' గ్రంథానికి పర్యవేక్షకులు ఆచార్య ననుమాసస్వామి పరిశోధకురాలు డా. జి. అనిత సన్మానం పొందారు. నాగార్జున విశ్వవిద్యాలయంలో వీరి సాహిత్యంపై పరిశోధనకు పర్యవేక్షకులు డా. జి. జ్యోతి స్వరూపరాణి, యం.ఫిల్ పరిశోధకురాండ్రు శ్రీమతి పి. విజయలక్ష్మి (భవాని–వాస్తవికత) శ్రీమతి కాకాని హేమలత(కొలుపులు–సామాజికత) శ్రీమతి కుమారి (కట్టడి–సామాజిక చైతన్యం)లు సన్మానం పొందారు. ముఖ్య అతిథిని డా. కొలకలూరి ఆశాజ్యోతి , కొలకలూరి మధుజ్యోతి సత్కరించారు. అనంతమైన సాహిత్య సృష్టి చేసిన తమ గురువైన కొలకలూరి ఇనాక్‌ని ఆచార్య బుద్ధన్న సన్మానించారు.

ఈ సందర్భంలో ఆచార్య ననుమాసస్వామి మాట్లాడుతూ కొలకలూరి ఇనాక్ కథానిక, కవిత్వం, పరిశోధన విమర్శనం ప్రపంచ సాహిత్య స్థాయిని పొందాయని అన్నారు.

ఆచార్య కె. ఆనందన్ మాట్లాడుతూ ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహిత్యం ఆయన ఆలోచన ఆవేదన నుంచే వచ్చిందని, అన్ని ప్రక్రియల్లో సాహిత్య సృష్టి చేసిన వీరు నిరంతర సాహిత్య కృషీవలుడని అన్నారు. విమర్శ గ్రంథానికి సంపాదకురాలైన డా. కొలకలూరి మధుజ్యోతి 'వలస రచయితల–సామాజిక చైతన్యం' వ్యాససృష్టి విశిష్టమనీ వినూత్నమనీ 'ఆధునిక సాహిత్య విమర్శ సూత్రం' గ్రంథానికి ఈ వ్యాసం రెండో భాగం కాగలిగినంత ఉదాత్తమని పేర్కొన్నారు. డా.కొలకలూరి ఆశాజ్యోతి వందన సమర్పణ చేశారు. పురస్కారాల ప్రధానోత్సవ సమావేశం డా॥ చిలుములూరి శ్రీనివాసరావు నిర్వహించారు.

సభాధ్యక్షులు డా॥ కొలకలూరి మధుజ్యోతి గత ఏడాది కథ, నవలకు పురస్కారాలు ఇచ్చామని, ఈ ఏడు కవిత్వానికి నాటకాలకు ఇస్తున్నామని నాటకాలు, నాటికా సంపుటులు, వచన గేయ పద్యకావ్యాలు ఆంధ్రదేశం నుంచే కాక ఇతర రాష్ట్రాల నుంచి కూడా వచ్చాయని, ప్రకటించిన పురస్కారం ఒక్కటే కాక, రెండు అభినందన పురస్కారాలు కూడా రెండు ప్రక్రియలలోనూ ఇచ్చే సందర్భం ఏర్పడిందని తెలిపారు.

కొలకలూరి విశ్రాంతమ్మ నాటక పురస్కారం రూ.10,000/–లను 'అనగనగా ఆరు నాటికలు' రచయిత డా॥ కందిమళ్ళ సాంబశివరావు పొందారు. రెండు అభినందన పురస్కారాలు 'నాతిచరామి' రచయిత్రి శ్రీమతి ఝాన్సీ కె.వి. కుమారి, 'శరం' రచయిత తుర్లపాటి బాబ్జీ చెరొక రూ.5000/–ల పురస్కారం పొందారు. కొలకలూరి భాగీరథి కవిత్వ పురస్కారం 'ఒక రాఘవరెడ్డి కథ' కావ్య కర్త కరణం బాలసుబ్రహ్మణ్యం పిళ్ళైకు రూ. 10,000/–ల పురస్కారం ప్రధానం చేశారు. అభినందన పురస్కారాలుగా శ్రీమతి దోర్నాదుల సుబ్బమ్మ (మోపు) డా.సి. భవానీదేవి (అక్షరం నా అస్తిత్వం) చెరొక రూ.5000/–లు అభినందన పురస్కారాలు పొందారు. డా. కె. ఆశాజ్యోతి పురస్కారాలు పొందిన నాటకాలను, నాటక కర్తలను పరిచయం చేసి అభినందించారు.

ప్రసార భారతి న్యూస్ డైరెక్టర్ డా.పట్నాల సుధాకర్ పురస్కార గ్రహీతలను అభినందించి కన్నీరు, ఆత్మాభిమానం, కరుణ, ప్రేమ, అనురాగం సంకల్పబలం, కార్యదక్షతల అన్నింటి సమాహార రూపమయిన డా.ఇనాక్‌ను అభినందించారు.

'ఒక రాఘవరెడ్డి' పద్య కావ్యకర్త కరణం బాలసుబ్రహ్మణ్యం పిళ్ళై, అనగనగా ఆరు నాటికలు– నాటకకర్త డా.కె. సాంబశివరావు, 'నాతిచరామి' నాటక రచయిత్రి శ్రీమతి ఝాన్సీ కె.వి. కుమారి, 'శరం' నాటకం కర్త తుర్లపాటి బాబ్జీ, 'అక్షరం నా అస్తిత్వం' కావ్య రచయిత్రి డా.సి. భవానిదేవి తమ సంతోషాన్ని తెలిపారు.

డా. చిలుమూరి శ్రీనివాసరావు వందన సమర్పణతో సాహితీ కార్యక్రమం సమాప్తమయింది.

●

## 'దీపఖడ్గం' కు ఉమ్మడిశెట్టి సాహితీ అవార్డు



పెన్నా శివరామకృష్ణ

ఆధునిక కవిత్వానికి ప్రతిష్ఠాత్మక పురస్కారంగా భావించే ఉమ్మడిశెట్టి సాహితీ అవార్డు – 2008 కోసం ప్రముఖకవి పెన్నా శివరామకృష్ణ కవితాసంపుటి – 'దీపఖడ్గం' ఎంపికైనట్లుగా అవార్డు వ్యవస్థాపకులు డా॥ రాధేయ ఒక ప్రకటనలో తెలియజేశారు.

ఈ అవార్డును న్యాయ నిర్ణేతలుగా – శ్రీ అదృష్ట దీపక్, డా॥ నందినిసిధారెడ్డి, డా॥ శిలాలోలిత గార్లు వ్యవహరించారు. "హృదయ భాషను నివేదించే పాత్రికలో మానవ జీవితాలను వెలిగించే కవిత్వమే "దీపఖడ్గం" అని న్యాయనిర్ణేతలు ప్రశంసించారని ఆయన అన్నారు.

అవార్డు పొందిన కవి పెన్నాశివరామకృష్ణ మెదక్ జిల్లా 'తొగట' లోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురకుల జూనియర్ కళాశాలలో తెలుగు లెక్చరర్ గా పనిచేస్తున్నారు. కవిగా గతంలో ఏడు కవితా సంపుటాలను, విమర్శకులుగా నాలుగు సాహిత్య విమర్శ గ్రంధాలను ఐదు సంపాదకీయ గ్రంధాలను వెలువరించారు.

ఈ అవార్డు పొందిన వారిలో వీరు 21వ వారు. ఈ అవార్డు ప్రధానోత్సవ సభ జూలై నెలలో అనంతపురంలో జరుగుతుందని డా॥ రాధేయ తెలియజేశారు.

## సోమేపల్లి స్మారక పురస్కారాలు

'రమ్యభారతి' సాహిత్య త్రైమాసపత్రిక ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన 'సోమేపల్లి హనుమంతరావు స్మారక అవార్డు' చిన్న కథలపోటి విజేతలకు బహుమతి ప్రధానోత్సవ సభ ఫిబ్రవరి 22 విజయవాడలోని ప్రెస్‌క్లబ్‌లో జరిగింది. సాహితీవేత్త పొన్నూరు వెంకట శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన ఈ సభలో విజయవాడ ఆకాశవాణి సంచాలకులు మంగళగిరి ఆదిత్య ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ "కథలు పాఠకులకు ఆసక్తి కలిగించేవిగా ఉండాలన్నారు. రచయితలు తమ రచనలలో సామాజిక సమస్యలకు పరిష్కారాన్ని చూపాలన్నారు. ఉత్తమ కథలు వెలుగుచూసేందుకు కథా రచయితలను ప్రోత్సహిస్తున్న రమ్యభారతి నిర్వాహకుల్ని ఈ సందర్భంగా అభినందిస్తున్నానన్నారు".



'సోమేపల్లి' పురస్కార గ్రహీతలతో అతిథులు

రచయిత రసరాజు గౌరవ అతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ "కథ సమాజానికి చేరువగా ఉండే ప్రక్రియ " అన్నారు. కథల్లో క్లుప్తత, గుప్తత, ఆప్తత అవసరమన్నారు. బిందువులో సింధువుని చూపిస్తూ పాఠకునిలో అంతర్మథనాన్ని కలిగించాలన్నారు. మరో కథా రచయిత సర్వజిత్ ప్రసంగిస్తూ "నవల కంటే తక్కువ నిడివి గల కథ రాయటమే కష్టమని" పేర్కొన్నారు., పురస్కార వ్యవస్థాపకులు, ప్రముఖ కవి సోమేపల్లి వెంకట సుబ్బయ్య ఈ పోటీలను నిర్వహించడానికి గల కారణాల్ని సభకు వివరించారు. తొలుత అయినాల కనకరత్నాచారి (కోరిశపాడు) రచించిన 'స్టోరీ – 2040' కు గాను ప్రథమస్థాయి అవార్డు, టి.ఎస్.ఏ. కృష్ణమూర్తి (మదనపల్లి) రచించిన 'హింస రచన' కథకు తృతీయ, నారాయణ డి.వి.వి.ఎస్ (పెబ్బేర్) రచించిన 'మేన్‌మేకర్', జి. మేరీకృపాభాయి (మచిలీపట్నం) రచించిన 'సీనియర్ సిటిజన్స్ రిక్రియేషన్' కథలకు ప్రశంసపత్రాలతో సంస్థ సత్కరించింది. ఈ కార్యక్రమాన్ని 'రమ్యభారతి' సంపాదకులు చలపాక ప్రకాష్, చింతా లక్ష్మీసుజాత, వేలూరి సుధా కౌండిన్య, బి. ఆంజనేయరాజు నిర్వహించారు.



**ఫిబ్రవరి 8న జరిగిన మానస సాహితీ సంస్థ అష్టమ వార్షికోత్సవ వేడుకలలో కటుకోర్ఘ్వల రమేష్‌ను సత్కరిస్తున్న కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత ప్రముఖ కవి శివారెడ్డి. చిత్రంలో విజయవాడ మేయర్ ముత్తంశెట్టి రత్నబిందు, అకాడమీ అధ్యక్షులు సి.హెచ్.వి.ఎస్. బ్రహ్మానందరావు, సాహితీవేత్తలు హనుమారెడ్డి, బాలకృష్ణారెడ్డి ఉన్నారు.**



**పాలమూరు సాహితీ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలుగు భాషా సదస్సులో ప్రసంగిస్తున్న మహబూబ్‌నగర్ డి.ఆర్.ఓ. రాజశేఖర్.**

## మల్లెమాల
## రాష్ట్ర స్థాయి సాహితీ పురస్కారం

వివిధ సాహిత్య ప్రక్రియల్లో కృషి చేసి, 40 ఏళ్ళుగా సాహితీ సేవ చేసినందుకు గుర్తింపుగా, ఈ నెల 22న కడపలోని హరిత సమావేశ మందిరంలో రూ॥10,000 నగదు, జ్ఞాపిక, సన్మాన పత్రం, శాలువాతో కడప జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో డా॥ జయప్రదకు ఘనంగా సత్కారం జరిగింది.



**డా॥ పెళ్ళకూరు జయప్రద సోమిరెడ్డికి**
**మల్లెమాల రాష్ట్ర స్థాయి సాహితీ పురస్కారం.**

ఒక్క రోజంతా జరిగిన సమావేశంలో డా॥ యమ్. పార్వతీ శంకర్ సత్కార గ్రహీత డా॥ పెళ్ళకూరు జయప్రదసోమిరెడ్డి గార్ని సభకు పరిచయం చేయగా, జయప్రద కథానికల మీద... శ్రీమతి వి ప్రతిమ, జయప్రద మెడికల్ కథల మీద డా॥ ఆవుల రామచంద్రయ్య, జయప్రద నవలికల మీద శ్రీమతి ఎ. పుష్పాంజలి, జయప్రద నవలల మీద డా॥ కిన్నెర శ్రీదేవి... జయప్రద కవితల మీద, కవితా కావ్యం మీద డా॥ యం.యం. వినోదిని, నానీల మీద శ్రీ కొండ్రెడ్డి వెంకటేశ్వర్లు రెడ్డిగార్లు ఉపన్యాసించారు. శ్రీమతి జూలిపాళెం మంగమ్మ సభను నిర్వహించారు. డా॥ మల్లెమాల వేణుగోపాలరెడ్డి దంపతులు డా॥ జయప్రదకు మల్లెమాల సాహితీ అవార్డును అందజేసి జయప్రద దంపతుల్ని సత్కరించారు. గుర్రాల రమణయ్య నె.ర.సం. ప్రతినిధిగా సభకు విచ్చేసారు. మల్లెమాల తొలి సాహితీ అవార్డు సముచితమైన విధంగా నెల్లూరు రచయిత్రి డా॥ జయప్రదకు వచ్చినందుకు నె.ర.సం. అధ్యక్షుడు డా॥ శ్రీనివాసతేజ, ప్రధాన కార్యదర్శి శ్రీమతి పాతూరి అన్నపూర్ణ తమ హర్షాన్ని వెలిబుచ్చారు.

## కరువు కురిసిన మేఘం ఆవిష్కరణ

జనవరి 25న గుంటూరు జిల్లా పిడుగురాళ్ళ మహాకవి మాఘుడు సాహితీ ప్రాంగణంలో వై.హెచ్.కె. మోహన్‌రావు "కరువు కురిసిన మేఘం" కవితా సంకలనాన్ని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత కె. శివారెడ్డి ఆవిష్కరించారు. ఆవిష్కరణ సభకు ఆకాశవాణి విజయవాడ కేంద్రం డైరక్టర్ మంగళగిరి ఆదిత్యప్రసాద్ అధ్యక్షత వహించగా ప్రముఖ కవి డా॥ బీరం సుందరరావు సమీక్షకులుగా వ్యవహరించారు. ఆరసం రాష్ట్ర అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ, ధారణావాచస్పతి డా॥ రాధశ్రీ, గుంరసం ప్రధాన కార్యదర్శి కోసూరి రవికుమార్, లైఫ్ స్వచ్ఛందసేవా సంస్థ వ్యవస్థాపకులు వుగ్గ నాగేశ్వరరావు ప్రసంగించారు.



**కరువు కురిసిన మేఘం కవితా సంపుటి ఆవిష్కరణ**

## భద్రాచలంలో పుస్తకావిష్కరణ సభ

సమాజాన్ని చైతన్యం చేయాల్సిన బాధ్యత కవిపై ఉందని ఆ బాధ్యతను పరిపూర్ణంగా నిర్వర్తించిన ఆధునిక కవి 'తెనుగులెంక' తుమ్మల సీతారామమూర్తి అని కవి, విమర్శకులు డాక్టర్ అద్దేపల్లి రామమోహన్‌రావు అన్నారు. సంప్రదాయ మార్గాన్ని అనుసరించినా తుమ్మల కవిత్వమంతా దేశభక్తి ప్రబోధాత్మకమైందని కొనియాడారు. స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల ప్రాంగణంలో తుమ్మల సీతారామమూర్తి స్మారక సభ జరిగింది. ఈ సభలో ఎన్.సి.హెచ్. చక్రవర్తి రచించిన 'కాలం సాక్షిగా' కవితల సంపుటి, పరిటాల సూర్యనారాయణ రచన 'సుప్రభాత సుమాంజలి' పుస్తకాలను మాగంటి సూర్యం, తమ్మల ధనేశ్వరరావులు ఆవిష్కరించారు.



సాహిత్య సభకు డాక్టర్ కాపూరి పాపయ్యశాస్త్రి అధ్యక్షత వహించగా మాల్యశ్రీ సమన్వయకర్తగా వ్యవహరించారు. కిన్నెర సాంస్కృతిక సంస్థ అవార్డు గ్రహీత చక్రవర్తుల లక్ష్మీనరస్మమ్మకు సత్కారం జరిగింది. బీర శ్రీనివాస్‌ను సత్కరించారు.

పుస్తకాలను ప్రముఖ కవి ఎస్.ఆర్ భల్లం (తాడేపల్లిగూడెం) సమగ్రంగా సమీక్షించి, శ్రోతలను ఆకట్టుకున్నారు. సభకు వీదుల రాంబాబు స్వాగతం పలుకగా తాతోలు దుర్గాచారి వందన సమర్పణ చేసారు.సభలో ఉదయ భాస్కరరావు, జోగేశ్వరదేవి, రామరాజు, ఉష, రెడ్డి, పి.వి.ఆర్. స్వామి, శ్రీనివాసరాజు, కృష్ణమూర్తి, శ్రీహరి కామేశ్వరరావు, సివికె. రావు తదితరులు పాల్గొన్నారు.

సాహితీ స్రవంతి భద్రాచలం డివిజన్ శాఖ విజయవాడ కృష్ణమాచార్య కళాపీఠం సంయుక్త నిర్వహణలో ఈ కార్యక్రమం జరిగింది.

## మాతృభాషను మరవొద్దు

మాతృభాషను నిర్లక్ష్యం చేస్తే జన్మనిచ్చిన తల్లిని మరిచినట్లేనని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్ ఆచార్య ఎన్.గోపి అన్నారు. సమరయోధుడు సాహితీవేత్త పొనుగోటి నర్సింహారావు రచించిన వర్తమానాలు (నాని) పుస్తకాన్ని శనివారం ఆవిష్కరించారు.



ఈ సందర్భంగా సాహితీమిత్ర మండలి ఆధ్వర్యంలో జరిగిన సాహితీ సభలో ఆయన మాట్లాడుతూ రేపటి తరాల వారికి కూడా తెలుగు భాష సజీవంగా ఉండాలంటే ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు తెలుగును ప్రథమ భాషగా బోధించేలా పాలకులు, ప్రజలు చొరవ చూపాలని కోరారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం తెలుగు భాషకు ప్రాచీన హోదా కల్పించడం తెలుగు జాతికే గర్వకారణమన్నారు. ఈ హోదాతో కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను తెలుగు భాషాభివృద్ధికి వినియోగించాలని సూచించారు. 'పొనుగోటి' లాంటి పెద్దలు తమ జీవితానుభవంతో రాసిన రచనలు భవిష్యత్ తరాలను చైతన్యం కలిగించేలా ఉన్నాయని ప్రశంసించారు. మధురకవి డాక్టర్ కూరెళ్ళ విఠలాచార్య, కవి విమర్శకులు వేణు సంకోజు మాట్లాడుతూ పూర్వం రాజులను ప్రసన్నం చేసుకోవడానికే పరిమితమైన సాహిత్యం నేడు పాలకుల వైఫల్యాలను సైతం ఎత్తిచూపగలుగుతుందన్నారు. గోరంత పదంతో కొండంత అర్థం వచ్చేలా చెప్పే నానీలను రాయడం కవికి సాహసం వంటిదని, పొనుగోటి లాంటి వారు 83 ఏళ్ల వయస్సులో రచనలు చేయడం యువతరానికి స్ఫూర్తిదాయకమన్నారు. ఈ సందర్భంగా వర్తమానాలు రచయిత పొనుగోటి నర్సింహారావును రాజకీయ, సాహితీ, విద్యాభిమానులు ఘనంగా సన్మానించారు. సాహితీ మిత్ర మండలి అధ్యక్షుడు తండు కృష్ణకౌండిన్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీపీ నీల దయాకర్, జెడ్పీటీసీ నోముల పద్మామారయ్య, సర్పంచ్‌లు మినుముల వెంకటరామయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు కొమ్ము లక్ష్మయ్య, పున్న నరసింహ, ఉండాల నర్సింహ, ఎంపీటిసి సాల్వేరు అశోక్, వేమవరపు మనోహర్ పంతులు, ప్రముఖ కవయిత్రి ఎన్. అరుణ. పాలవరపు లక్ష్మి నర్సయ్య, చిత్రకారుడు కూరెళ్ల శ్రీనివాస్, మిత్రమండలి ప్రధానకార్యదర్శి బాసరాజు యాదగిరి, పెండెం జగదీశ్వర్, పెరుమాళ్ల ఆనంద్, ఏబూషి నర్సింహ, మర్రోజు రఘురాములు, బాలయ్య పరుశురాములు, జ్ఞానేశ్వరాచారి, విజయవెంకన్న, నాజర్ పాల్గొన్నారు.



**2009 ఫిబ్రవరి 26న హైదరాబాద్, తెలుగు విశ్వవిద్యాలయంలో 'నాతిచరామి' నాటక సంకలనానికి కొలకలూరి విశ్రాంతమ్మ అభినందన పురస్కారం అందుకుంటున్న రచయిత్రి ఝాన్సీ కె.వి. కుమారి. చిత్రంలో డా. కొలకలూరి ఆశాజ్యోతి, ఆచార్య టి. గౌరీశంకర్, కొలకలూరి ఇనాక్, డా. కొలకలూరి మధుజ్యోతి**



**తిరుపతి, శ్వేతభవనంలో వల్లంపాటి జయంతి సభలో వల్లంపాటి రచించిన పలు పుస్తకాలతో పాటు, పలమనేరు బాలాజీ కథా సంపుటి గదిలోపలి గోడ పుస్తక ఆవిష్కరణ దృశ్యం.**





ఫిబ్రవరి 26న హైదరాబాద్, తెలుగు విశ్వవిద్యాలయంలో జరిగిన కొలకలూరి సాహిత్యోత్సవంలో డా.జి. జ్యోతి స్వరూపరాణి, డాక్టరేటు పర్యవేక్షకుల్ని(పైన), పరిశోధనం పుస్తక సంపాదకులు ఆచార్య కె. ఆనందన్‌ను సన్మానిస్తున్న డా.ఆవుల మంజులత. చిత్రంలో ఆచార్య ననుమాసస్వామి, ఆచార్య టి. గౌరీశంకర్, డా. కొలకలూరి మధుజ్యోతి, ఆచార్య కొలకలూరి ఇనాక్, డా.జి. అనిత ఉన్నారు.



మానస-2008 ప్రధానఅవార్డును ప్రముఖకవి శివారెడ్డి నుండి స్వీకరిస్తున్న యువకవి పి.శ్రీనివాస్‌గౌడ్. చిత్రంలో విజయవాడ మేయర్ రత్నబిందు, మానస అధ్యక్షులు బ్రహ్మానందరావు, పారిశ్రామికవేత్త గంగరాజు, ప్ర.ర.సం. అధ్యక్షులు హనుమారెడ్డి, కార్యదర్శి పొన్నూరి శ్రీనివాసులు, కోశాధికారి బాలకృష్ణారెడ్డి వున్నారు.



అనకాపల్లి వై.ఎమ్.వి.ఏ. శ్రీధరాల వెంకటరమణ మెమోరియల్ హాలులో జనవరి 26న "బద్ది సాహితీ" ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా "జనని" సాంస్కృతిక సమితి, చైన్నె ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల చెన్నయ్యను సత్కరిస్తున్న దృశ్యం. వేదికపై అబ్దుల్ అజీజ్, ఎమ్.ఎస్.వి. కుమార్, మాధవీ సనారా, యిమ్మిడిశెట్టి చక్రపాణి, కె. కోటారావు, బద్ది నాగేశ్వరరావు, కె.ఎస్. చంద్రశేఖర్, బద్ది సత్యవతి, గంపా శ్రీదేవి.



మహబూబ్‌నగర్ పట్టణంలో ప్రెస్‌క్లబ్‌లో మార్చి 3న 'పాలమూరు చరిత్ర' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం.



ప్రముఖ రచయిత సలీం 'రాణీగారి కథలు' సంపుటి ఆవిష్కరణ దృశ్యం. చిత్రంలో సలీం, ఓల్గా, కె. శివారెడ్డి, అబ్బూరి ఛాయాదేవి



కవి 'రాఖీ (రాంకిషన్ గొల్లపెల్లి) రచించిన 'సంగీత గీత' నానీల సంపుటిని కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో నానీల రూపశిల్పి డా॥ఎన్ గోపి ఆవిష్కరిస్తున్న దృశ్యం. చిత్రంలో వరుసగా పి. విజయకుమార్ ఎల్ఐసి బ్రాంచి మేనేజర్, సాహితీవేత్త మధ్వాచారి రాంకిషన్, కె.ఎస్. అనంతాచార్య, సభాధ్యక్షులు మాడిశెట్టి గోపాల్, నానీల కవి రాఖీ శ్రీమతి గీత మరియు శ్రీమతి అరుణ ఉన్నారు.



తెలుగు రథం ఆధ్వర్యంలో మార్చి 5న జరిగిన మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి జయంతి సభలో మధుర రథ ప్రస్థానం సంకలనాన్ని ఆవిష్కరిస్తున్న జ్ఞానపీఠ అవార్డు గ్రహీత సినారె. చిత్రంలో కవి రేపాక ఏకాంబరాచార్యులు, మధునాపంతుల ట్రస్టు సభ్యులు సి.కె. రావు, వేదభారతి ట్రస్ట్ సంస్థాపకులు డా. అవధానులు రామెళ్ళ, ప్రముఖ విమర్శకులు డా. ద్వానా శాస్త్రి, జ్ఞాన సినారె, తెలుగు రథం అధ్యక్షులు కొంపెల్ల శర్మ ఉన్నారు.

# కొత్త పుస్తకాలు

## నెల్లూరు నాటకం

**ఈతకోట సుబ్బారావు**

**వెల : 50 పేజీలు : 48**




''నెల్లూరు నాటకం' రచించిన ఈతకోట సుబ్బారావు జర్నలిస్టు మిత్రుడు. ఆయన చేసిన ఈ చిరుప్రయత్నానికి ముందుమాట రాయటం మాత్రమే జరిగింది. ఇది ముందుమాట కాదు. 'నెల్లూరు నాటకం'కు ముందు ఆవేదన. చరిత్రను వక్రగతి పట్టిస్తూ వెంపలిచెట్లకు నిచ్చెనలు వేసే కళాకారులకు చెంపపెట్టు. ముందుమాట రాసేందుకు నాటక రచయితో, నటుడో, ప్రయోక్తో కావాల్సిన అవసరం లేదు. నాటకాన్ని చూసి అనుభవించగలిగిన పరిపక్వత ఉంటేచాలని నా వ్యక్తిగత అభిప్రాయం. కొంచెం తీవ్రత వుంటే క్షమించే అర్హత కలవారు మాత్రమే క్షమించేందుకు ప్రయత్నించగలరని ఆశిస్తూ..."

**జొన్నలగడ్డ మార్కండేయులు**

## ఇంద్ర ధనసు

**యస్. వివేకానంద**

**వెల : 40 పేజీలు : 66**




నాగరికత పెరిగేకొలదీ మనిషి జీవన యానం సుఖంగా సాగాలి. మానసిక ప్రశాంతత పెరగాలి. మానవీయత పెంపొందాలి. కానీ మనిషి స్వార్థంతో సమస్యలను పెంచుకుంటున్నాడు. ఈ దృష్టికోణంతో తన కవితా శరాలను సంధించారు ఈ కవి.

'దినదినాభివృద్ధి చెందుతున్న/ అవినీతిలాగా... నిత్యావసరాల/ధరలు ఆకాశన్నంటటం/ప్రజానీకానికి కొత్తేమీ కాదు!" అంటారు 'దురవస్థ' అనే కవితలో. అలాగే 'నామ్‌కే వాస్తే...!' అనే కవితలో 'మన దేశానికి మంచి/ ఫ్లాష్‌బ్యాక్సే ఉన్నాయ్!/వాటినే స్మరించుకుంటూ/అనుక్షణం మురుస్తూ/అదమరచి నిద్రిస్తున్నాం' అని మన నిర్లక్ష్యాన్ని వ్యంగ్యంగా విమర్శిస్తారు.

## నల్లతుమ్మ

**డా॥ గూటం స్వామి**

**వెల : 50 పేజీలు : 96**




''నల్లతుమ్మ' కవితా సంపుటి పాఠకులను తుమ్మ జిగురులా అతుక్కుపోయేలా చేస్తుంది. గ్రామీణ జీవితాన్ని సామాన్యుల స్థితిగతులను సమాజంలోని మనుషుల వికృత చేష్టలను ఆవిష్కరించడంలో స్వామి చూపిన నైపుణ్యం, అభివ్యక్తి ఇట్టే ఆకర్షిస్తుంది.

వచనకవిగా పద్యకవిగా నవలా రచయితగా, కథకుడుగా బాలగేయాల రచయితగా సమీక్షకుడిగా జర్నలిస్టుగా భిన్న రూపాల్లో కనిపించే ఈ స్వామి తెలుగు కవిత్వానికి అందునా దళిత కవిత్వానికి మరొక పదునైన గొంతును వినిపిస్తున్నాడు. విభిన్న ప్రక్రియల్లో కవితా సేద్యం చేస్తున్న గూటం స్వామిని మనసారా ఆలింగన చేసుకుంటున్నాను. "

**శిఖామణి**

## కరువు కురిసిన మేఘం

**వై.హెచ్.కె. మోహన్‌రావు**

**వెల : 40 పేజీలు : 54**




"అదేమిటో ఎంత వెదికినా/మేఘంలో చిరునామా దొరకని వాన చినుకు"– ఈ రెండు పంక్తులను చదివితే చాలు ఎంతకూ కురవని మేఘాలు కళ్లలో కదలాడతాయి. అంతటితో ఆగలేదు. దీన్ని రచించిన కలం. వెంటనే అందుకుంది – ఆ వానచినుకు 'కంటిలో కన్నీరై కనిపించింది' అని. ఒక యధార్థాన్ని కవితాత్మకంగా చెప్పిన కవి మోహనరావు ప్రతిభ ప్రశంసనీయం.

ఈ సంపుటిలోని కవితల్లో కొన్ని సమకాలీన సమస్యలున్నాయి. మరికొన్ని సార్వకాలీన సత్యాలున్నాయి. చక్కని భావుకత, అందుకు తగ్గ అభివ్యక్తి చతురత అలవరచుకున్న మోహనరావుకు నా ఆశీరభినందన"

**సినారె**

## క్షమార్పణం

**గోపరాజు నారాయణరావు**

**వెల : 50 పేజీలు : 138**




'ఈ కథల రచయిత గోపరాజు నారాయణరావు చరిత్ర విద్యార్థి. పత్రికా రచయిత. కనుకనే చరిత్ర, పత్రికా రచన ఈ కథలను బలంగా ప్రభావితం చేశాయనిపిస్తుంది. 'రంగురాళ్ళు' (విశాఖ మన్యంలో రంగురాళ్ళ తవ్వకంలోని ఒక విషాదం), 'వివర్ణం' (మండల్ కమీషన్, అయోధ్య రథయాత్ర), 'పతాక శీర్షిక' (రైతుల ఆత్మహత్యలు), 'ఒక సామూహిక మరణదండన' (నల్లగొండ ఫ్లోరోసిస్ బాధితుల దుస్థితి)– కథల్లో వార్తా పత్రికలలో కన్పించే ప్రత్యేక కథనాలనే ఇంకాస్త అందంగా చెప్పడానికి చేసిన ప్రయత్నాలనిపిస్తుంది. అందుకే కాబోలు ఈ కథల్లో ఒక్కోచోట కథాశిల్పం మందగించినా వార్తకు వుండే రచనాశైలి చదివించగలుగుతుంది. "

**కొత్తపల్లి రవిబాబు**

## సామాజిక శాస్త్రాల వ్యాసాలు

**వాసిరెడ్డి భాస్కరరావు**

**వెల : 50 పేజీలు : 104**




'సామాజిక శాస్త్రాలలో అనేక కొత్త విషయాలు అధ్యయనం చేయవలసి వస్తుంది. వాటిల్లో మానవ హక్కులు, సామాజిక పెట్టుబడి లాంటివి కొన్ని వున్నాయి. నాయకత్వం చాలా ప్రాముఖ్యం వహిస్తుంది. రాజకీయాలు, ముఖ్యంగా ప్రజాస్వామ్యం, ప్రజాస్వామిక వికేంద్రీకరణ అధిక ప్రాముఖ్యాన్ని వహిస్తున్నాయి. అనేక కొత్త పుస్తకాలు, కొత్త వ్యాసాలు చదివిన తర్వాత వాటిలోని ముఖ్య విషయాలు తెలుగు మీడియమ్‌లో చదువుతున్న సామాజిక శాస్త్రాల విద్యార్థులకు, యితర మేధావులకు ఉపయోగపడాలన్న వుద్దేశ్యంతో తెలుగులో సంక్షిప్తంగా వ్రాసిన వ్యాసాలు 'వీక్షణం' పత్రికలో, 'గ్రామసభ' పత్రికలో కొన్ని ప్రచురించబడ్డాయి."

**రచయిత**

# కొత్త పుస్తకాలు



## వర్తమానాలు (నానీలు)

**పొనుగోటి నరసింహారావు**

**వెల : 30 పేజీలు : 55**

"''రాజకీయ దృక్కోణాలను ఆవిష్కరించడంలో ఈ కవి అనుభవం దొడ్డది. 'ఇనుమతినే అవినీతి ఎలుకలు'–కంకరకు కక్కుర్తి పడే కాకులు వున్నాయట'. ఇటువంటి ఘోరాలను చూడలేని జనం 'కోమాలో' కి పోయిందనే బాధ వెంటాడుతూ ఉంటుంది. ధరలు నింగికి చేరేకొద్దీ ప్రజలు పాతాళానికి కూరుకుపోవడాన్ని చిత్రిస్తాడు. ప్రజలొకవంక ధరల బరువును మోయలేక మూల్గుతుంటే, వృద్ధిరేటును చూపిస్తూ మురిసే నాయకుల తీరు అవహేళనగాక మరేమౌతుంది! ఆయా విషయాలకు ఈ కవి యిచ్చే నిర్వచనాలు అధునాతనమైనవి, ఆలోచింపజేసేవిగా ఉంటాయి."

**వేణు సంకోజు**

వ్యక్తిత్వ వికాసానికి

## సంఘటనే మూలం




**కోట పురుషోత్తం**

**వెల : 100 పేజీలు : 202**

"ఈ పుస్తకం బలవర్ధక టానిక్ లాంటిది. నిరాశ, నిస్పృహలతో కృంగిపోయి, నిరుత్సాహంతో ముందుకు సాగలేక చతికిలపడి పోయే వారికి ఈ పుస్తకంలో కొత్త జీవితాన్ని ప్రసాదించే అద్భుతమైన ఆక్సిజన్ గుళికలున్నాయి. ఈ పుస్తకంలో ఒక్కొక్కరి జీవితం చదువుతూంటే ఒళ్ళు జలదరిస్తుంది. వారు విజయం సాధించిన ప్రక్రియలను చదువుతుంటే ఒళ్ళు పులకరిస్తుంది.

మనోవ్యాధికి మందు అవసరం లేదంటారు పెద్దలు. మరి మందు లేకపోతే ఎలా? అనుకునే వారికి ఈ పుస్తకం గొప్ప ఔషధం."

**బి.వి. పట్టాభిరామ్**




## నెమలి కన్నులు (పిల్లల కథలు)

**శ్రీమతి చెన్నుపాటి లక్ష్మీ వర్మ**

**వెల : 30 పేజీలు : 39**

"నెమలి కన్నులు – కన్ను – చుట్టూ రంగురంగుల ఈకలు ఎంతో మెత్తగా నవీనంగా అందంగా ఉంటాయి.

ఇందులోని పిల్లల కథలు కూడా ఇంతే! అన్నీ అందంగా రంగురంగుల భావాలతో నిశిత దృష్టితో – పిల్లల హృదయాలను మెత్తగా హత్తుకొనే ధోరణిలో యీ కథలు రూపొందించబడ్డాయి. రచయిత్రి లక్ష్మీవర్మ అభినందనీయురాలు. అన్నింటికంటె పిల్లల కథ ఊహకు పరాకాష్ఠ. నీతి నిజాయితీ, మాట, మంచి, అన్నీ కలగలిపిన కథలివి.

తెలుగులో బాలసాహిత్యం యింకా బాగా అభివృద్ధి చెందాలి. బాలలకు పాటలు కథలు చాలా యిష్టం– కాని వారిని అలరించే సాహిత్యం పొంగి పొరలుట లేదు. కారణం పిల్లల సాహిత్యమంటే పిల్ల సాహిత్యమనే న్యూనతా భావం రచయితల్లో ఉండడమే."

**డా॥ పోతుకూచి సాంబశివరావు**

ప్రజాహిత

## డిక్షనరీ (తెలుగు-సంస్కృతం-ఇంగ్లీష్)




**వాసిరెడ్డి భాస్కరరావు**

**వెల : 110 పేజీలు : 222**

"ఈనాడు అందరి నోళ్ళల్లో బాగా నానుతావున్న పదాలకు ఉదాహరణకు 'టెర్రరిజమ్' పదానికి మనవారు కాసేపు ఉగ్రవాదమని, మరొకసారి తీవ్రవాదమని, ఇంకొకసారి ఆటంకవాదమన్న పదాలు వాడుతున్నారు. ఏది కూడా సరైన అర్థాన్నివ్వదు. కనుక 'టెర్రరిజమ్' అన్న పదాన్నే వాడితే బాగుంటుంది కదా! అలాగే గ్లోబలైజేషన్ అన్న పదానికి ఒకాయన 'భౌగోళీకరణ' అని ఇంకొకాయన 'ప్రపంచీకరణ' అని, అట్లాగే లిబరలైజేషన్‌కి, 'ఉదారవాదమని, సరళీకరణ' అని. పోస్ట్–మోడ్రనిజానికి, 'ఆధునికోత్తరమని, ఉత్తర–ఆధునికమని', స్వాతంత్ర్యోత్తర ఆధునికమని, గందరగోళం సృష్టిస్తున్నారు. ఇంగ్లీష్ పదాన్నే వాడితే విషయంతో సంబంధమున్నవారికి స్పష్టంగానే తెలుస్తుంది కదా!'

**రచయిత**




## పండుటాకులు

**తంగిరాల సత్యలక్ష్మీదేవి**

**వెల : 60 పేజీలు : 60**

"సత్యలక్ష్మీదేవి కొన్ని సామాజిక వైరుధ్య సందర్భములో కవితలు కూడా రాశారు. ఉదాహరణకు 'స్వార్థం' మనిషి మృగంగా మారడానికి స్వార్థమొకటే కారణంగా చెప్పారు. కాని ఆ మనిషిని మృగం చేసినా, స్వార్థంగా పెరిగేటట్లు చేసినా అవి ఒక వ్యవస్థ మీద ఆధారపడి ఉంటై ఈనాడు ధన వ్యామోహం పెరిగిపోయిందంటే అది నేరాలకీ ఘోరాలకీ దారితీస్తోందంటే, అలాగే స్త్రీ విషయకంగా ఇది వరకు లేని దారుణాలు జరుగుతున్నయ్యంటే అన్నీ రాజకీయ ఆర్థిక పరిస్థితులు నిర్మాణం చేసే ఒక వ్యవస్థపై ఆధారపడి ఉన్న ఇలాంటి నేపథ్య అవగాహన గూడా దానికి అవసరమే."

**అద్దేపల్లి రామ్మోహనరావు**




## హృదయ నందనం

**బద్ది నాగేశ్వరరావు**

**వెల : 20 పేజీలు : 32**

'ఆధునిక యుగంలో మానవత్వం/ మరచిన మనిషి యంత్రం/స్వార్థభూయిష్టం నమన్యల తోరణం/ఎడతెగని కోర్కెల సమాహారం/జీవనం సుఖమయం కోసం ఆరాటం/శాంతి సహనం మాత్రం మృగ్యం" వర్తమాన సమాజంలో మనిషి స్వభావం మారిన చిత్రాన్ని సరళ వచనంలో కవి చెబుతున్న తీరు బావుంది. సామాజిక దృష్టితో దీర్ఘకాలంగా కవిత్వం రాస్తున్న వారు బద్ది నాగేశ్వరరావు. తన ప్రాంతనేపథ్యం దగ్గర నుండి అంతర్జాతీయ విషయాల వరకూ కవితా వస్తువులుగా ఈ కవిత్వంలో ఉన్నాయి. మానవత్వ గుణాలను ఆకాంక్షిస్తూ ఈ కవితా ప్రవాహం సాగుతుంది.

Printed, Published and owned by **V. Krishnaiah** 1-1-298/4, Street No-1, Ashoknagar, Hyderabad-20,
Printed at Prajashakti Daily Printing Press, 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad,
Published at **Shaitya Prasthanam** 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad-20. **Editor. T. Ravi**



కష్టజీవి బుర్రకథ రూపొందించడమే కాదు.
తన సోదరుడితో కలిసి దళాన్ని
ఏర్పాటు చేసి ప్రదర్శనలు ఇచ్చారు.
వాసిరెడ్డి భాస్కరరావుతో కలిసి రాసిన
'మాభూమి' నాటకం
ఆంధ్ర దేశంలో సంచలనం కలిగించింది.
అభ్యుదయ సాహిత్య సృష్టికి
జీవితతాంతం కృషిచేసిన ఆదర్శమూర్తి సుంకర

# సుంకర సత్యనారాయణ

SAHITYA PRASATHANAM RNI N0.APTEL/ 2004/18396 Postal Regd. No.H/SD/415/07-09

2009 మార్చి 23
భగత్‌సింగ్
వర్ధంతి సందర్భంగా

ప్రత్యేక తగ్గింపు

~~Rs.100~~
Rs.50

భగత్‌సింగ్ జీవిత
సమగ్ర సమాచారాన్ని
తెలిపే పుస్తకం!



ప్రతులకు:
ప్రజాశక్తి బుక్‌హౌస్
1-1-187/1/2
చిక్కడపల్లి, హైదరాబాద్-20
ఫోన్: 040-2766013
ఫ్యాక్స్: 27635136

50% Discount
SPECIAL OFFER



భగత్‌సింగ్
రచనలు
జైలు డైరీ
జీవిత ఘట్టాలు
సందేశాలు
సమకాలికుల స్మృతులతో

ఇంక్విలాబ్ జిందాబాద్